


# ఆంధ్రభూమి




సంపుటి: 30 . సంచిక: 245 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | సోమవారం 4 ఫిబ్రవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

## శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: బహుళ అమావాస్య రా.1.09
నక్షత్రం: శ్రవణం రా.తె.4.59
వర్జ్యం: ఉ.6.53 నుండి 8.39 వరకు
దుర్ముహూర్తం: మ.12.24 నుండి 01.12 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: ఉ.7.30నుండి 9.00 వరకు
విశేషాలు:
అమావాస్యోపవాసం, సోమవతీ అమావాస్య



పాట్నాలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'జన ఆకాంక్ష ర్యాలీ'లో కార్యకర్తలు అలంకరించిన టోపీతో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్

## అధికారమిస్తే.. రైతు రుణాల మాఫీ

- ఆహార పరిశ్రమకు ప్రాధాన్యం.. ఇతోధికంగా నిధులు
- పాట్నా ర్యాలీలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

పాట్నా, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుల రుణాలను మాఫీ చేస్తామని, ఆహార పరిశ్రమకు ప్రాధాన్యత ఇచ్చి ఇతోధికంగా నిధులు కేటాయిస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. కేంద్రం అమలు చేస్తున్న పంటల బీమా పథకం రైతులు కష్టపడిన

- మిగతా 6వ పేజీలో

# చారిత్రాత్మకం.. చిరస్మరణీయం

- సంక్షోభం నుంచి అవకాశాలు సృష్టిస్తున్నాం
- అమరావతిలో మౌలిక వసతులకు రూ.50 వేల కోట్లు వెచ్చిస్తున్నాం
- జ్యుడీషియల్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- భూములిచ్చిన రైతులే చరిత్ర నిర్మాతలు: జస్టిస్ రమణ



ఏపీ జ్యుడీషియల్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం, శాశ్వత భవనాలకు శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన హోమంలో పాల్గొన్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తదితర ప్రముఖులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 3: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో రాష్ట్ర హైకోర్టు ప్రారంభించుకోవటం చరిత్రాత్మక సందర్భమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అందరి భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. అమరావతి పరిధిలోని నేలపాడు గ్రామం వద్ద నిర్మించిన జ్యుడీషియల్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం, హైకోర్టు శాశ్వత భవనాలకు ఆదివారం శంకుస్థాపన జరిగిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సంక్షోభం నుంచి అవకాశాలు సృష్టించుకుంటున్నామని ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు. ప్రత్యేక హోదా సహా ఇతర హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. అమరావతిలో మౌలిక వసతుల కల్పనకు రూ.50వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. 2050 నాటికి ప్రపంచంలో నెంబర్-1 నగరంగా

- మిగతా 6వ పేజీలో

# పెండింగ్ కేసులు 3కోట్లు



- న్యాయవ్యవస్థపై ఇది ప్రతికూల ప్రభావం
- త్వరలో జిల్లా కోర్టుల్లో 5వేల పోస్టుల భర్తీ
- ప్రజలకు సత్వర న్యాయమే లక్ష్యం
- తీర్పుల్లో వ్యక్తిగత భావోద్వేగాలకు తావులేదు
- ఏపీ హైకోర్టు భవనాలు ప్రజలకు అంకితం
- రాజ్యాంగ విధి నిర్వహణలో సీఎం చొరవ భేష్
- సుప్రీంకోర్టు సీజే రంజన్ గొగోయ్
- వైభవంగా జ్యుడీషియల్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 3: దేశంలో న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో పెండింగ్ కేసుల అంశం ఒకటని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ అన్నారు. దేశంలో వివిధ కోర్టుల్లో 3కోట్ల వరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. త్వరలో జిల్లా కోర్టుల్లో 5వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పరిధిలోని నేలపాడు గ్రామం వద్ద నిర్మించనున్న ఏపీ హైకోర్టు శాశ్వత భవనాలకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. తాత్కాలిక హైకోర్టు కోసం నిర్మించిన జ్యుడీషియల్ కాంప్లెక్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ మాట్లాడుతూ పెండింగ్‌లోని కేసుల్లో 81లక్షల కేసులు సంవత్సరం కన్నా తక్కువ కాలంగా కోర్టుల్లో ఉన్నవేనని తెలిపారు. వీటిని పెండింగ్‌లో ఉన్న కేసులుగా చెప్పలేమని కూడా ఆయన వ్యాఖ్యానించారు. మరో 50లక్షలు పెట్టీ, స్వల్ప వివాదాలకు సంబంధించిన కేసులన్నారు. వివిధ రాష్ట్రాల్లోని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఈ తరహా కేసులపై దృష్టి సారించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. 25లక్షల కేసులు 10 సంవత్సరాలకు పైబడి పెండింగ్‌లో ఉన్నాయని, పదేళ్లంటే తక్కువ సమయం కాదంటూ న్యాయ వ్యవస్థ పనితీరును ఇవి ప్రతిబింబిస్తాయని చెప్పారు. ఈ అంశాన్ని తీవ్రమైనదిగా తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ 25లక్షల కేసులు న్యాయ వ్యవస్థపై నల్లమచ్చల వంటివి అని ఆయన వ్యాఖ్యానించారు. దీనికి తోడు వివిధ కోర్టుల్లో భారీగా ఖాళీలు ఉండటం కూడా పెండింగ్ కేసులపై ప్రభావం చూపుతోందన్నారు. ఇటీవలే జిల్లా కోర్టుల్లో 5వేల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటోందన్నారు. త్వరలోనే ఈ పోస్టులు భర్తీ చేస్తారనే ఆశావహ దృక్పథంతో ఉన్నామని చెప్పారు. ఈ సంవత్సరాంతానికే 75శాతం మేర భర్తీ చేస్తారని

- మిగతా 6వ పేజీలో



సీబీఐ అధికారులను బలవంతంగా లాక్కెళుతున్న కోల్‌కతా మఫ్టీ పోలీసులు

# సీబీఐ బృందం నిర్బంధం

- కోల్‌కతాలో కలకలం
- పోలీసు చీఫ్‌ను ప్రశ్నించేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్న పోలీసులు
- సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేయనున్న సీబీఐ?
- కమిషనర్ ఇంటికి హుటాహుటిన సీఎం మమత

కోల్‌కతా, ఫిబ్రవరి 3: పశ్చిమ బెంగాల్ సర్కార్, కేంద్రానికి మధ్య గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ సెగ పరాకాష్టకు చేరుకుంది. రాష్ట్ర పోలీస్ చీఫ్ రాజీవ్‌కుమార్‌ను చిట్ ఫండ్ కుంభకోణానికి సంబంధించిన కేసులో ప్రశ్నించడానికి వచ్చిన సీబీఐ అధికారులను రాష్ట్ర పోలీసులు అడ్డగించారు. వారిని నిర్బంధించడంతో పాటు కొందరిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీబీఐ సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. కోల్‌కతాలో ఆదివారం ఈ ఘటన జరిగింది. సీబీఐ అధికారులను తీసుకెళ్లి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. కొంతమందిని అరెస్టు చేశారనే వార్తలు కూడా వెలువడ్డాయి. కాగా తామేమీ అరెస్టు చేయలేదని కమిషనర్‌ను ప్రశ్నించేందుకు వచ్చిన సీబీఐ అధికారుల వద్ద తగిన డాక్యుమెంట్లు ఉన్నాయా లేదా అని మాత్రమే ప్రశ్నించామని పోలీసులు చెప్పారు. పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న వెంటనే సీఎం మమతా బెనర్జీ కూడా కమిషనర్ నివాసానికి రావడం సంచలనం కలిగించింది. అంతకుముందు సీబీఐ అధికారులు మాట్లాడుతూ తాము రాజీవ్ కుమార్ కోసం గాలిస్తున్నామని, ఆయన ఒక రోజు ముందే అజ్ఞాతంలోకి

- మిగతా 6వ పేజీలో

# నిరంతర వెలుగు

- అంతర్జాతీయ ప్రమాణాలతో 24గంటల విద్యుత్ సరఫరా
- అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- 5, 6న నగరంలో అంతర్జాతీయ విద్యుత్ సదస్సు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం కోసం నిరాటంకంగా అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో విద్యుత్‌ను 24గంటలూ సరఫరా చేయాలని ఆదేశించారు. ఇంధన రంగంలో వస్తున్న సరికొత్త ఆవిష్కరణలు, నవీన సాంకేతికతను అన్వేషించాలని అధికారులకు సూచించారు. 'పవరింగ్ ఆంధ్రప్రదేశ్, ఎనర్జీ ఇన్నోవేషన్ 2019' పేరిట విజయవాడ నగరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో రాష్ట్రానికి ఇవి ఉపయోగకరంగా ఉంటాయని ఆయన్నారు. అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ డాల్బర్గ్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్, టీఈఆర్ఐ సహకారంతో ఈ నెల 5, 6 తేదీల్లో నగరంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి సదస్సు నిర్వహించడం ఇదే తొలిసారి అని, ఇంధన రంగంలో ఏపీ లక్ష్యాలను సాధించడంలో ఇది తోడ్పడుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు. సదస్సులో ముఖ్యమంత్రి కీలకోపన్యాసం చేయనున్నారు. ఇంధన రంగంలో నవకల్పనలు, అధునాతన

- మిగతా 6వ పేజీలో




# కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది?

## కోట్ల బాటలో పార్టీ వీడనున్న మరికొందరు!

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, ఫిబ్రవరి 3: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పరిణితి చెందారని, ఆయన ఇస్తున్న హామీలతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం అనుకుంటున్న సమయంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు ఒకరొకరుగా పార్టీని వీడుతున్నారు. పార్టీ వీడుతున్న నేతలు కూడా అధినేత రాహుల్ కుటుంబానికి సన్నిహితులు కావడంతో వారు పార్టీ వీడటంపై జోరుగా చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో బలోపేతం కావడం, అధికార బీజేపీకి వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు ఒకటి కావడం, భవిష్యత్తులో ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఆ పార్టీ నేతలు రాష్ట్రంలో కాకపోయినా కేంద్రంలో అధికారంలో ఉంటామన్న ధీమాతో ఇంత కాలం పార్టీలో కొనసాగుతూ వచ్చారు. ఈ తరుణంలో రాష్ట్రంలో టీడీపీతో సన్నిహిత సంబంధాలు ఏర్పడటం, పొత్తులు ఉంటాయన్న చర్చ సాగతున్న నేపథ్యంలో రాష్ట్రంలో కూడా పరోక్షంగానైనా అధికారంలో ఉంటామన్న విశ్వాసం వారిలో కనిపించింది. అయితే 10 రోజుల క్రితం తమ

- మిగతా 6వ పేజీలో

Gripper



అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలంలో సాగులో ఉన్న నల్లమందు పంటను పరిశీలిస్తున్న అధికారులు


## 'అనంత'లో నల్లమందు సాగు..

### పదెకరాల్లో ధ్వంసం చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 3 : అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండల పరిధిలోని మల్లమ్మకొట్టాల సమీపంలో సాగు చేస్తున్న నల్లమందు పంటను ఎక్సైజ్ శాఖ అధికారులు ధ్వంసం చేశారు. వివరాలు.. ధర్మవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలోని ముదిగుబ్బ మండలం మల్లమ్మ కొట్టాల గ్రామ సమీపంలో నల్లమందు పంట సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అనసూయాదేవి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది దాడులు చేశారు. మల్లమ్మకొట్టాల గ్రామానికి చెందిన వెంకటరాముడు, వెంకటనారాయణ, దాసరి వెంకటరాముడు, చంద్ర, ధనుంజయరెడ్డికి చెందిన సుమారు 10.5 ఎకరాల పొలాల్లో చిత్తూరు జిల్లాకు చెందిన రెడ్డెప్ప, నాగరాజు, వీరనార, నరసింహులు, కిశోర్, మునికృష్ణమనాయుడు ఎకరాకు రూ. 10వేల చొప్పున భూమిని లీజుకు తీసుకుని నల్లమందు పంట సాగు చేశారు. అయితే నల్లమందు పంటను సాగు చేయడం చట్ట విరుద్ధం కావడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేసి సుమారు 42వేల మొక్కలను ధ్వంసం చేశారు. అలాగే ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం నల్లమందు పంట సాగు చేసిన చిత్తూరు జిల్లాకు చెందిన 9 మందిని అరెస్టు చేయగా కిశోర్, మునికృష్ణమనాయుడు పరారయ్యారు. మాదక ద్రవ్యాల ఉత్పత్తికి ఉపయోగపడే(ఓపీఎం పాపి) నల్లమందు పంటను సాగుచేస్తే 10 నుంచి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని, రైతులు ఎవరూ ఇలాంటి పంటలు సాగుకు అనుమతి ఇవ్వకూడదని డిప్యూటీ కమిషనర్ అనసూయాదేవి హెచ్చరించారు. దాడుల్లో పెనుకొండ, అనంతపురం ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్లు గోపాల్, నారాయణస్వామి, రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణమూర్తి, పెనుకొండ, సీకే పల్లి, పుట్టపర్తి, కదిరి, తనకల్లు ఎక్సైజ్ సీఐలు నరసానాయుడు, గుర్నాథరెడ్డి, తక్కీబాషా, భీమలింగం, రాజేంద్రప్రసాద్, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు మృతి

అద్దంకి, ఫిబ్రవరి 3: ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జాగర్లమూడి రాఘవరావు (68) ఆదివారం ఉదయం 11గంటలకు ఆయన స్వగ్రామమైన కొరిశపాడు మండలం



పమిడిపాడు గ్రామంలోని ఆయన నివాసంలో మృతి చెందారు. గత నెలరోజులుగా గుండెసంబంధిత వ్యాధితో బాధ పడుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవ చేశారు. 1989లో కాంగ్రెస్ తరపున అద్దంకి ఎమ్మెల్యేగా పోటీ చేసి బాచిన చెంచుగరటయ్య (టీడీపీ)పై 7వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం 1994లో అదే అభ్యర్థిపై పోటీ చేసి ఓటమి చెందారు. 2004లో తన రాజకీయ గురువుగా భావించే కరణం బలరామ్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. వయసు మీద పడడంతో ఆయన ఇటీవల గుండె సంబంధమైన వ్యాధికి ఆపరేషన్ చేయించుకున్నారు. అప్పటినుంచి ఆయన స్వగ్రామంలోనే ఉంటూవస్తున్నారు. గత నెలరోజులుగా ఆరోగ్యం క్షీణించడంతో మంచానికే పరిమితమయ్యారు. ఆదివారం ఉదయం 11గంటలకు తుది శ్వాస విడిచారు. రాఘవరావు మృతి వార్త తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, ఇతర రాజకీయ నాయకులు, అభిమానులు ఆయన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.

## సీఎం దృష్టికి వయోవృద్ధుల సమస్యలు

### ప్రత్యేక శాఖ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి చినరాజప్ప వెల్లడి

భీమవరం, ఫిబ్రవరి 3: వయోవృద్ధుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. అలాగే ప్రత్యేక శాఖ ఏర్పాటుకు కృషిచేస్తానని హామీయిచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ - ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ సమాఖ్య సంయుక్తంగా తొలి రాష్ట్ర స్థాయి సదస్సు ఆదివారం జరిగింది. రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి జ్యోతిప్రజ్వాళన చేసి



ఉప ముఖ్యమంత్రి చినరాజప్పకు డిమాండ్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

సదస్సును ప్రారంభించారు. సమాఖ్య అధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. వృద్ధాప్య పింఛను అర్హత 65 నుంచి 60కి తగ్గించాలని, 1999లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృద్ధుల జాతీయ విధానం అమలుచెయ్యాలి. వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, వార్షిక బడ్జెట్‌లో సంక్షేమ నిధులు, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అమలుచెయ్యాలని, అక్టోబర్ 1న వృద్ధుల దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా జరపాలని, రాజధాని అమరావతిలో సీనియర్ సిటిజన్స్ సంఘం కార్యాలయం ఏర్పాటుచేయాలని మొత్తం 12 తీర్మానాలను సదస్సులో ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలను అందరిముందు చదివి, ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పకు సమాఖ్య నాయకులు అందచేశారు. ఈ సందర్భంగా తొలి రాష్ట్ర స్థాయి సదస్సు సావనీర్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆలిండియా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు డిఎన్ చాప్కే, సీఎస్ఆర్ ఫండ్స్ కమిటీ ఛైర్మన్ ఆర్‌ఎన్ మిట్టల్ వయోవృద్ధులను ఉద్దేశించి ప్రసంగించారు. మున్సిపల్ ఛైర్మన్ కొటికలపూడి గోవిందరావు, ఆర్టీసీ విజయవాడ రీజియన్ ఛైర్మన్ మెంటే పార్ధసారధి, రాష్ట్ర విభిన్నప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్‌స సహాయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఛైర్మన్ మెంటే సోమేశ్వరరావు, డాక్టర్.మట్లపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అత్యున్నత స్థాయిలో సేవలు

### హైకోర్టు యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 3: దేశంలో అత్యంత యువ న్యాయస్థానంగా ఏపీ హైకోర్టు పనిచేస్తోందని, అత్యున్నత స్థాయిలో సేవలు అందించాలన్న ఆకాంక్షను ఏపీ హైకోర్టు యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి సి ప్రవీణ్‌కుమార్ వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి పరిధిలో నేలపాడు వద్ద జ్యుడీషియల్ కాంప్లెక్సు ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ విభజన తరువాత ఏపీకి న్యాయపాలన తరలిరావడం సమంజసమన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో ఉన్నత న్యాయస్థానం కీలక భూమిక పోషిస్తుందన్నారు. న్యాయవ్యవస్థ వారసత్వాన్ని, ఔన్నత్యాన్ని కొనసాగించేందుకు అందరూ సహకరించాలని కోరారు. 1954లో మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి విడివడి గుంటూరులో హైకోర్టును ఏర్పాటు చేశారన్నారు. అప్పుడు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ఇప్పుడు కొత్త భవనం నిర్మాణం వల్ల అందరికీ న్యాయం దొరుకుతుందని, సామాజిక న్యాయం అందరికీ అందుబాటులోకి వస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశంలోనే ఉత్తమ హైకోర్టుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. గౌహతి హైకోర్టు ఏడు రాష్ట్రాలకు సేవలు అందిస్తోందని ఉదహరించారు. దేశంలోనే అమరావతికి ఒక చరిత్ర ఉందన్నారు. 2వేల ఏళ్ల క్రితం శాలివాహనులు పాలించిన ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు అవుతోందని ఆయన వివరించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఆరునెలల పాటు ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసే అవకాశం తనకు లభించిందన్నారు. హైకోర్టు విభజన ప్రక్రియను సజావుగా జరిగేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు, హైకోర్టు అధికారులు, సిబ్బంది సహకరించారని తెలిపారు. ఎవరైనా పూర్వ ప్రతిష్ఠను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఏపీ హైకోర్టు పూర్వ ప్రాభావాన్ని, సంప్రదాయాలను కొనసాగించాలని ఆయన పిలుపిచ్చారు.

# గోవిందుని కిరీటాల చోరీ ఇంటి దొంగల పనేనా?

**★ సీసీ టీవీల పరిశీలనలో దొంగలు దొరికినట్లే! ★ ఒక కేజీ 200 గ్రాముల బరువున్న కిరీటాలు మాయం**
**★ నైవేద్యానంతరమే అపహరణ ★ ఇద్దరు అర్చకులు గైర్హాజరైనట్లు గుర్తించిన ఈఓ**
**★ సంఘటనా స్థలంలో రెండేళ్లుగా పనిచేయని సీసీ కెమెరాలు**

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, ఫిబ్రవరి 3: టీటీడీ చరిత్రలో కలకలం సృష్టించిన తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయం ప్రాంగణంలోని శ్రీ కళ్యాణవేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవీలకు చెందిన మూడు కిరీటాలు అపహరణ వెనుక ఇంటి దొంగల హస్తం ఉన్నట్లు పోలీసులు, టీటీడీ భద్రతా సిబ్బంది అనుమానిస్తున్నారు. కాగా ఇప్పటికే ఆలయ ప్రధాన అర్చకుల నుంచి ఉపాలయాల్లో పనిచేసే అర్చకులు, పోటులో పనిచేస్తున్నవారిని కూడా విజిలెన్స్ పోలీసులు క్షుణ్ణంగా విచారించారు. మరో సీసీ కెమెరాలో నమోదైన ఫుటేజీని కూడా వాళ్లు చూపించి అపరిచిత వ్యక్తిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా కిరీటాలు చిన్నవి కావడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లోని పడేశారా అనే కోణంలో ఈ కేసును దర్యాప్తు చేసిన బృందాలు ఆలయాన్ని జల్లెడపట్టి వెతికినా ఎలాంటి ఫలితం దక్కలేదు. కిరీటాలు అపహరించిన వ్యక్తి స్థానికంగానే ఉన్నాడా లేక మరెక్కడికైనా పారిపోయాడా అనే కోణంలో కూడా పోలీసులు దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా రైల్వే స్టేషన్, బస్టేషన్ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించినట్లు సమాచారం. కిరీటాలు అపహరించడానికి సాహసించిన వ్యక్తి ఆర్థిక కష్టాల్లో ఉండి వాటిని అధిగమించడానికి ఈ దుస్సాహసం తెగబడ్డాడా అనే అనుమానాలు కలుగుతున్నాయి. తాజా సంఘటనతో ఆలయంలో స్వామివార్లకు సంబంధించిన ఇతర ఆభరణాలు భద్రంగా ఉన్నాయా? లేదా? అని భక్తులు అనుమానిస్తున్నారు. ఇదిలావుండగా శనివారం సాయంత్రం 5.30 గంటలకు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు నైవేద్యం పెట్టిన అనంతరం కొంత సమయం తలుపులు మూస్తారు. ఆ సమయంలోనే ఈ చోరీ జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కాగా కిరీటాల అపహరణతో కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆదివారం మూసివేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆలయంలో సంప్రోక్షణ చేయకుండా పూజలు నిర్వహించ కూడదు. ఈ నేపథ్యంలో సోమవారం సంప్రోక్షణ చేసి పూజలు యదాతథంగా చేసి, భక్తులను దర్శనానికి అనుమతించాలని నిర్ణయించారు. గమనించ దగ్గ విషయం ఏమిటంటే చోరీ జరిగిన ఆలయం ముందున్న సీసీ కెమెరా గత రెండు సంవత్సరాలుగా పనిచేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఐదు సంవత్సరాల క్రితం కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద టీటీడీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. రెండు సంవత్సరాలుగా సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. ఈ విషయాన్ని టీటీడీ భద్రతా సిబ్బంది కాని ఆలయ భద్రతాధికారులు కాని పట్టించుకున్న పాపాన పోలేదు. భగవంతుని గుండెలో పెట్టుకుని చూడాల్సిన అర్చకుల నిర్లక్ష్యం కూడా ఈ సంఘటనలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సుమారు రూ. 35 నుంచి 40 లక్షలు విలువచేసే మూడు కిరీటాలు బరువు ఒక కేజీ 200 గ్రాములు ఉన్నట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే ఇవి పురాతనమైనవి కాదని 1998లో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని ఉత్సవ మూర్తులకు భక్తులు 2002లో మూడు కిరీటాలను విరాళంగా అందించారు. వీటిని శ్రీ కల్యాణవేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవీలకు అలంకరించేందుకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి శ్రీ గోవిందరాజ స్వామి వారి ఆలయంలోని కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయానికి అందించినట్లు సమాచారం. కిరీటాల అపహరణ వెనుక ఆలయంలో పనిచేసే సిబ్బంది, అధికారులు, అర్చకుల నిర్లక్ష్యం అడుగడుగునా కనపడుతోంది. గోవిందునికి నైవేద్యం పెట్టి ఆపై కిరీటాలను కొట్టేసి నామం పెట్టారంటూ భక్తులు మండిపడుతున్నారు. టీటీడీ ఆలయాలకు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నది ఉత్తుత్తిదేనని, వైఫల్యాలు ఇబ్బడి, ముబ్బడిగా ఉన్నాయని కిరీటాల అపరహరణతో మరోసారి రుజువైంది. గోవిందరాజ స్వామి వారి ఆలయంలో స్వామివారి ఆలయ ప్రాంగణంలో కల్యాణవేంకటేశ్వర స్వామి, ఆండాళ్ అమ్మవారు. పార్థిసారథి, పుండరీకవల్లి ఉపఆలయాలు ఉన్నాయి. అలాగే గోవిందరాజ స్వామి ఆలయానికి ఎదురుగా మఠం ఆంజనేయ స్వామి, టీటీడీ పాత పరిపాలన భవనంలో అభయాంజనేయ స్వామి ఉప ఆలయాలున్నాయి. ప్రతి రోజు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 12.30 గంటలకు, సాయంత్రం 5.45 గంటలకు మూల విరాట్టుతోపాటు ఈ ఆలయాల్లో కూడా నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. ప్రతి ఉప ఆలయంలోను ముగ్గురు అర్చకులు పనిచేస్తారు. పోటులో పనిచేసే వ్యక్తి ఈ నైవేద్యంను తీసుకువచ్చి ఆయా ఆలయాల్లోని అర్చకులకు అందిస్తారు. అర్చకులు నైవేద్యం పెట్టి ఆయా దేవతామూర్తులు ప్రసాదం ఆరగించేందుకు తలుపులు మూస్తారు. కొంత సమయానికి ఆలయానికి ప్రసాదం తీసుకువచ్చిన పోటులోని వ్యక్తి నైవేద్యంగా పెట్టిన ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేసేందుకు కౌంటర్‌కు అప్పగించే విధానం కొనసాగుతోంది. అయితే శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో కల్యాణవేంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు నైవేద్యం సమర్పించేందుకు ఉండవలసిన ముగ్గురు అర్చకుల్లో ఇద్దరు గైర్హాజరయ్యారు. ఒక అర్చకుడు మాత్రమే అక్కడ ఉన్నట్లు సమాచారం. ఆ ఇద్దరు అర్చకులు అధికారుల అనుమతితో గైర్హాజరయ్యారా? లేక అనధికారికంగా గైర్హాజరయ్యారా అనే అంశంపై పోలీసులు, టీటీడీ నిఘా విభాగం సమాచారం ఆరా తీస్తోంది. ఆ సమయంలో అక్కడున్న అర్చకుడు నైవేద్యం పెట్టాడా? లేక ఆ బాధ్యతను ఇంకెవరికైనా అప్పగించి వెళ్లాడా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోయినా మరో ప్రాంతంతలో ఉన్న సీసీ టీవీలు పనిచేయడంతో పోలీసులు, టీటీడీ నిఘా విభాగం వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా వడివడిగా వెడుతుండటాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. ఉత్సవ మూర్తులకిరీటాలు చిన్నవి కావడంతో చిన్నపాటి సంచిలో కూడా వాటిని వేసుకుని పైన ఉత్తరీయాన్ని కప్పుకుని ఎవరికంటా పడకుండా ఎవరికీ అనుమానం రాకుండా వెళ్లే అవకాశాలున్నాయి. అయితే సీసీ కెమెరా ఫుటేజీలో పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది గుర్తించిన వ్యక్తి ఎవరు, అతను ఆలయంలో పనిచేసే సిబ్బందికి పరిచయం ఉన్నవాడా? లేక అర్చకులకు పరిచయం ఉన్నవాడా? లేక అపరిచితుడా? అనే కోణంలో అర్బన్ ఎస్పీ అన్బురాజన్ నేతృత్వంలో దర్యాప్తును వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం టీటీడీ సీవీ ఎస్వోగా ఉన్న గోపీనాథ జెట్టి గతంలో తిరుపతి ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉండటం ఈ పరిసరాలపై అవగాహన ఉండటం నేరస్తులను పట్టుకోవడంలో మరింత సులవుకానుంది. కాగా గోవిందరాజ స్వామివారి ఆలయంలో కిరీటాల అపరహరణ విషయం తెలుసుకున్న ఈఓ ఆదివారం ఆలయానికి వచ్చి అక్కడి పరిస్థితులను గమనించి అధికారులను, భద్రతా సిబ్బందిపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. అలయంలో అంతా బాగుందని భక్తులు నమ్ముతున్న క్రమంలో ఈ సంఘటన టీటీడీ అధికారులను కూడా ఇరకాటంలో పడేసినట్లుయ్యింది. ఈనేపథ్యంలో టీటీడీ అనుబంధ ఆలయాల పాలనా, సిబ్బంది నియామకంకు సంబంధించి ప్రక్షాళన చేసి సంస్కరించడానికి ఈఓ ఏకెసింఘాల్ దృష్టిపెట్టక తప్పని పరిస్థితి. ఇదిలా ఉండగా ఈ సంఘటనపై టీటీడీ ఈఓ పేరిట విడుదల చేసిన ప్రకటనలో మాత్రం సీసీ కెమెరాల వ్యవస్థ సక్రమంగా పనిచేస్తున్నాయని త్వరలోనే నింధితులను పట్టుకుంటామని తెలియజేశారు. కాగా ఆదివారం గోవిందరాజ స్వామివారి ఆలయాన్ని సందర్శించిన వారిలో అదనపు సీవీ ఎస్వో శివకుమార్ రెడ్డి, సీఈ చంద్రశేఖర్ రెడ్డి, ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, స్పెషల్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, పోలీస్ అధికారులు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు మాజీ కేంద్ర మంత్రి కిశోర్ గుడ్‌బై

**★ కొందరు పార్టీని నష్టపరుస్తున్నారు ★ రాష్ట్ర విభజనలోనూ అన్యాయమే ★ పార్టీని వీడడం బాధాకరమే**
**★ త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ★ కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్

కురుపాం, ఫిబ్రవరి 3: మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వైరిశర్ల కిశోర్ చంద్రదేవ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు విజయనగరం జిల్లా కురుపాంలోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి రాజీనామాను ప్రకటించారు. 45 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీకి సేవలు చేశానని, పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో మనస్తాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి రాజీనామా లేఖను పంపించినట్లు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వానికి, ఆదివాసీ జాతీయ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని కిశోర్ పేర్కొన్నారు. ఢిల్లీలోగల బీజేపీయేతర పార్టీల నాయకులు శరద్ పవార్, లాలూ ప్రసాద్ యాదవ్, శరత్‌యాదవ్, మాయావతి, ఇతర మిత్రులు, బంధువులతో చర్చించి ఏ పార్టీలో చేరేది వెల్లడిస్తానన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరతారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టానని, పూర్తిస్థాయిలో ఆలోచించుకున్నాకా ఏ పార్టీలో చేరేది నిర్ణయించుకుంటానని అన్నారు. ఇతర పార్టీల్లో చేరేందుకు ఎవరు ఒత్తిడి గాని, బేరసారాలు లేవన్నారు. బీజేపీని ఓడించేందుకు అవసరమైన పార్టీలో చేరతానన్నారు. ప్రస్తుతం జాతీయ పార్టీకంటే ప్రాంతీయ పార్టీలు దేశాన్ని నడిపించే విధంగా పరిస్థితులు ఉన్నాయన్నారు. ఒకప్పుడు తాను ప్రాంతీయ పార్టీలకు వ్యతిరేకమైనప్పటికీ ప్రస్తుత పరిస్థితులు మారాయన్నారు. కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టడం కఠినమైన నిర్ణయమైనప్పటికీ ప్రస్తుత నాయకులకు విసుగెత్తి సరైన గుర్తింపు లేకపోవడంతో రాజీనామా చేశామన్నారు.

రాహుల్‌గాంధీ కూటమి పార్టీని భూస్థాపితం చేసేందుకు పూనుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలోకూడా కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ లేదన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో లోపాలకు కారణం కాంగ్రెస్ పార్టీ అన్నారు. గత ఎన్నికలలో ఓడిపోతానని తెలిసినా కేంద్రమంత్రిగా బాధ్యతతో కాంగ్రెస్ ద్వారా పోటీ చేశానన్నారు. తన రాజీనామా నిర్ణయం ఇప్పటికిప్పుడు తీసుకున్నది కాదని, గత కొన్నాళ్లుగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చానని, ప్రజలు ఆమోదిస్తారనే ఆశాభావం ఉందని కిశోర్ చంద్రదేవ్ పేర్కొన్నారు.

# సిక్కోల్ నుంచే..సత్యమేవ జయతే..

**★ పలాస నుంచి బస్సుయాత్రకు అమిత్ షా పచ్చ జెండా ★ జిల్లా రెండు రోజులు పర్యటన : బీజేపీ ఏపీ చీఫ్ కన్నా**



బీజేపీ బస్సు యాత్రకు సిద్ధం చేసిన వాహనం

ఆంధ్రభూమి బ్యూరో


శ్రీకాకుళం, ఫిబ్రవరి 3: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శివారున గల శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. ఢిల్లీలో ఉదయం 8.50 గంటలకు బయలుదేరి 10.30కు విశాఖపట్నం చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం చేరుకుని శక్తి కేంద్ర ప్రముఖ్ కార్యక్రమంలో పాల్గొంటారు. భోజన విరామం తర్వాత అక్కడ నుంచి శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో మధ్యాహ్నం రెండున్నర గంటలకు చేరుకుని అక్కడ జరిగే బహిరంగ సభలో ఏపీ రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తర్వాత బీజేపీ నిర్వహించనున్న బస్సు యాత్రకు పచ్చ జెండా ఊపి ప్రారంభిస్తారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏపీ బీజేపీ చీఫ్ కన్నా లక్ష్మీనారాయణ సారథ్యంలో బస్సు యాత్ర సిక్కోల్ సెంటిమెంటుతో ఈశాన్య దిశ నుంచి ప్రారంభం కానున్నది. పనిచేసే వారి నుంచే ఫలితం ఆశిస్తారనే నినాదంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎన్నికల బరిలో దిగనుంది. ఐదేళ్ల పదవీ కాలంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను పెద్దఎత్తున ప్రచారం చేస్తూ ఇదే నినాదంతో జనంలోకి విస్తృతంగా వెళ్లాలని పార్టీ వ్యూహాత్మక ప్రణాళిక మేరకు సిక్కోల్ నుంచే ఆరంభం కానున్నది. మరోపక్క మానిఫెస్టో రూపకల్పనలో దేశవ్యాప్తంగా దాదాపు పది కోట్ల మంది ప్రజల సలహాలను స్వీకరించేలా నెలరోజుల పాటు భారత్‌కీ మన్‌కీబాత్..మోదీ కే సాథ్ పేరుతో భారీ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ప్రజల భాగస్వామ్యంతో సంకల్ప్ యాత్ర (ఎన్నికల ప్రణాళిక) వెల్లడించేందుకు బీజేపీ శ్రీకాకుళం జిల్లా నుంచి సంసిద్ధం కావడం గమనార్హం. అందుకే, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పలాసలో జరిగే బహిరంగ సభకు రానున్నారు. నూతన నినాదంతో 2019 ఎన్నికల బరిలో దిగుతుండడంతో ప్రజల భాగస్వామ్యంతోనే మెనిఫెస్టో రూపకల్పన ప్రజాస్వామ్యానికి మరింత మేలు చేకూరుస్తుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పలు సభ వేదికల నుంచి ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా 4000 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 300కుపైగా వాహనాల్లో బాక్సులు ఏర్పాటుచేసి ప్రజాభిప్రాయం సేకరించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేసింది. అందులోభాగంగా శ్రీకాకుళం జిల్లాలో పలాస నుంచి ప్రారంభమైన బస్సు యాత్రలో ఏపీ చీఫ్ కన్నా లక్ష్మీనారాయణ సారథ్యంలో వాహనంలో బాక్సులు ఏర్పాటుచేసి ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు రంగం సిద్ధం చేసింది. ఎన్నికల మెనిఫెస్టోకు ఈ స్థాయిలో ఇంతవరకూ ఏ రాజకీయ పార్టీ కసరత్తు చేయలేదని పార్టీ మానిఫెస్టో కమిటీ చీఫ్, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్న విషయం విధితమే!

ఏపీలో జరుగుతున్న అవినీతిపై అమిత్ షా పలాస బహిరంగ సభ నుంచి గళం విప్పుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ 'ఆంధ్రభూమి'కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఏపీకి ఇచ్చిన నిధులను ఆయన వివరించనున్నట్లు చెప్పారు. ముందుగా విజయనగరం జిల్లాలో నిర్వహించే పార్లమెంటు స్థాయి శక్తి కేంద్రాల సభ్యులతో సమావేశమవుతారని, అనంతరం పలాస నుంచి సత్యమేవ జయతే బస్సు యాత్రను ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నెల 19వతేదీన ఒంగోలు, 21న రాజమహేంద్రవరంలో శక్తి కేంద్రాల సభ్యులతో అమిత్ షా సమావేశం కానున్నట్టు కన్నా లక్ష్మీనారాయణ వివరించారు.

## దమ్ముంటే మా దళపతిని అడ్డుకోండి

**★ బాబుకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి సవాల్**
**★ సీఎం అవినీతి పాలనపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి**

పలాస, ఫిబ్రవరి 3: ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సభలను దమ్ము, ధైర్యం ఉంటే సీఎం చంద్రబాబునాయుడు అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్‌లో జరగనున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో అధికారం కోసం సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని ప్రజాధనాన్ని దోచుకున్నారని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద 2 వేల కోట్ల రూపాయల నిధులు మంజూరులో అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. బాబు మతిభ్రమించి అసెంబ్లీలో ప్రవర్తించారని, రాష్ట్రంలోని డ్వాక్రా మహిళ సంఘాలకు చెల్లని చెక్కులు ఇచ్చి మాయ చేస్తున్నారన్నారు. ఎన్నికలలో ఓటమి భయంతో చంద్రబాబునాయుడు అమిత్‌షాను, మోదీ సభలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, భయపడవద్దు అని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ అవినీతి పాలనపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సత్యమేవ జయతే.. బీజేపీ బస్సు యాత్రను పలాస నుంచి అమిత్ షా ప్రారంభిస్తారన్నారు. బాబు పాలనలో అన్ని రంగాల్లో ప్రజలకు అన్యాయం జరిగిందని, ప్రధాని నరేంద్రమోదీ పాలనలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు వేల కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తే, ఆంధ్రులకు అన్యాయం చేశారని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి చేయూతను ఇచ్చి, విజయానికి తోడ్పాటు అందించాలని ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కో-కన్వీనర్, మాజీ ఎంపీ కణితి విశ్వనాథం, పి.వైకుంఠరావు, ప్రసాద్, కె.బుజ్జి, జోగారావు, ఇన్‌చార్జి ప్రకాశ్ పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

## రోడ్డు ప్రమాదంలో ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యదర్శి మృతి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 3: ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏవీవీఎస్‌వీవీ నరసింహం నగరంలో జరిగిన కారు ప్రమాదంలో గాయపడి శనివారం రాత్రి ఆంధ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన వైద్యశాఖలో 1995లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. పదోన్నతి పొంది సూపరింటెండెంట్‌గా గొల్లపూడిలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేస్తున్నారు. గత నెల 31న జరిగిన ఏపీ ఎన్జీవో సభలో రాష్ట్ర కార్యవర్గంతో పాటు పాల్గొని తిరుగు ప్రయాణంలో వస్తుండగా విజయవాడలో జరిగిన కారు ప్రమాదంలో రాష్ట్ర కోశాధికారి వీరేంద్రబాబు, ఉపాధ్యక్షుడు డీవీ రమణ, కార్యదర్శులు నరసింహ, వసంతరావు గాయపడ్డారు. వీరిని వెంటనే ఆంధ్ర ఆసుపత్రిలో చేర్పించగా మిగిలిన వారు కోలుకోగా నరసింహం మృతి చెందారు. నరసింహం పార్థివదేహానికి ఆదివారం కృష్ణలంక శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు. నరసింహంకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మఫిసిల్ సూపరింటెండెంట్ల గతి ఇంతే..!

**★ 590 జీవోతో ఏసీగా పదోన్నతి ఎండమావే**
**★ దేవాదాయ శాఖలో గందరగోళం**
**★ న్యాయపోరాటానికి సన్నాహాలు**

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3: దేవాదాయ శాఖలో జిల్లాల్లో మఫిసిల్ సూపరింటెండెంట్లకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోంది. కార్యనిర్వహణాధికారులు (ఈవోలు), ప్రధాన కార్యాలయంలో పనిచేసే సూపరింటెండెంట్లు పదేళ్లలోనే పదోన్నతులతో అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) స్థాయికి చేరుకుంటుండగా, మూడు దశాబ్దాలు దాటినా ఆ స్థాయిని చేరుకోలేక మఫిసిల్ సూపరింటెండెంట్లు మగ్గిపోతున్నారు. దేవాదాయ శాఖ ఆవిర్భావం నుంచి ఉన్న నిబంధనల జీవోలను తుంగలోతొక్కి తీసుకొస్తున్న కొత్తకొత్త ఉత్తర్వుల కారణంగా తమకు అన్యాయం జరుగుతోందని వారిలో ఆవేదన వ్యక్తమవుతోంది. తాజాగా జారీ అయిన జీవో 590తో మఫిసిల్ సూపరింటెండెంట్లను పక్కనపెట్టి ఇతరులందరికీ పదోన్నతులు కల్పించిన వైనం దేవాదాయ శాఖలో కలకలం సృష్టిస్తోంది. తమకు జరిగిన అన్యాయంపై కొంతమంది మఫిసిల్ సూపరింటెండెంట్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి రంగం సిద్ధంచేసుకుంటున్నారు.

దేవాదాయ శాఖలో ఏటా డీపీసీలో సమీక్షించుకుని నిష్పత్తుల ప్రకారం ఏసీల నియామకం చేయాల్సివుంది. డీపీసీ సమీక్ష ద్వారా ప్రతీ ఏడాది ప్యానెల్ పదోన్నతుల కోసం జాబితాను రూపొందించాలి. అసిస్టెంట్ కమిషనర్లుగా ఏపీపీఎస్సీ ద్వారా నేరుగా ఎంపికయ్యే వారితోపాటు గ్రేడ్-1 ఈవోలు, మఫిసిల్ సూపరింటెండెంట్లు, హెడ్ ఆఫీసు సూపరిండెంట్లకు డీపీసీ జాబితా ప్రకారం అవకాశం కల్పించాలి.

కాగా గ్రేడ్ 3 ఈవోల నుంచి గ్రేడ్-2 ఈవోగా ఇలా ప్రతి రెండేళ్లకోసారి పదోన్నతి పొందుతూ గ్రేడ్-1 ఈవోగా పదోన్నతుల పొంది, సుమారు ఎనిమిదేళ్ల కాలపరిమితిలో ఏసీగా పదోన్నతి పొందడానికి అర్హత సాధిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా ఏపీపీఎస్సీ ద్వారా నియమితులయ్యే వారు పదోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా ఆపై మఫిసిల్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందుతారు. ఇలా చేరడానికి వారికి పదేళ్లకు పైగా సమయం పడుతుంది. వీరితోపాటు దేవాదాయశాఖ కమిషనరేట్‌లో పనిచేసే సూపరింటెండెంట్లు, పెద్ద ఆలయాల్లో పీఏ టు ఈవోలు కూడా ఏసీలుగా పదోన్నతికి అర్హులు. పదోన్నతులకు వీరంతా అర్హులైనప్పటికీ, ఇప్పటివరకు హెడ్డాఫీసులో పనిచేసే సూపరిండెంట్లకు మాత్రమే ఏసీలుగా పదోన్నతులు లభిస్తుండగా, జిల్లాల్లో పనిచేసే మఫిసిల్ సూపరింటెండెంట్లకు మొండిచేయి ఎదురవుతోంది. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ కొంతమంది మఫిసిల్ సూపరింటెండెంట్లు కోర్టును ఆశ్రయించి ఏసీలుగా పదోన్నతులు పొందారు.

సాధారణంగా 245 జీవో ప్రకారం వీరికి పదోన్నతులు ఇవ్వాల్సివుంది. ఈ జీవో ప్రకార, మఫిసిల్ సూపరింటెండెంట్లకు 3, పీఏ టు ఈవోల నుంచి ఒకటి, గ్రేడ్-1 ఈవోల నుంచి ఒకటి, పబ్లిక్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ నుంచి ఒక పోస్టును భర్తీచేయాల్సివుంది. ప్రస్తుతం ఈ విధానాలన్నీ పక్కనబెట్టేసి ఈవోలకు ఏసీలుగా అడహక్ పదోన్నతులు కల్పిస్తున్నారు. మఫిసిల్ సూపరిండెంట్లకు నిబంధనల ప్రకారం పదోన్నతులు ఇస్తే అడిషనల్ కమిషనర్ స్థాయి వరకు చేరుకుంటారు.

గ్రేడ్-1 ఈవోలకు పదోన్నతులు కల్పించిన తర్వాతే మఫిసిల్ సూపరింటెండెంట్లకు ఇవ్వాలని కొందరు తమ పలుకుబడి ఉపయోగించడంతో వారికి పదోన్నతులు నిలిచిపోయాయని తెలుస్తోంది. అయితే తదనంతరం వచ్చిన 337 జీవో ప్రకారం 8:2 నిష్పత్తిలో మఫిసిల్ సూపరింటెండెంట్లకు పదోన్నతులు ఇవ్వాల్సివుంది. అంటే ఎనిమిది పోస్టులు పీఏ టు ఈవోలు, గ్రేడ్-1 ఈవోలు, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లకు ఇచ్చి మిగిలిన 2 పోస్టులు మఫిసిల్ సూపరింటెండెంట్లకు ఇవ్వాల్సివుంది. దీనిపై కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. 337 ప్రకారం ఏడు పోస్టులను సైకిల్ సర్కిల్‌గా నిర్ణయించి, 4:3 నిష్పత్తిలో నియామకాలు చేయాలని నిర్ణయించారు. అంటే నాలుగు పోస్టులు ఇతరులందరికీ వస్తే, మూడు మఫిసిల్ సూపరింటెండెంట్లకు వస్తాయి. ఇపుడు ఈ సైకిల్ సర్కిల్‌ను 10 పోస్టులకు పెంచి 8:2 నిష్పత్తిలో నియామకాలకు ప్రయత్నించారు. ఇదిలావుండగా తాజాగా గత ఏడాది నవంబర్ 19న 590 జీవో జారీచేసి, 10 పోస్టులను సైకిల్‌గా రూపొందించి అందులో మఫిసిల్‌కు కేవలం ఒక పోస్టు కేటాయించి మిగిలిన 9 పోస్టుల్లో గ్రేడ్-1 ఈవోలకు 6 పోస్టులు, పీఏ టు ఈవోలకు 1, డైరెక్టు రిక్రూటీలకు 2 పోస్టులు కేటాయించేలా ఆదేశాలు జారీచేశారు. నియామకాలు కూడా గుట్టుచప్పుడు కాకుండా చేసేశారు.

2008 నుంచి ప్యానల్ ఇయర్ కదపకుండా కొత్త జీవోలు సృష్టించి అన్ని పోస్టులూ కేవలం నాలుగు కేడర్లకు కట్టబెట్టడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందనే ఆందోళన మఫిసిల్ సూపరింటెండెంట్లలో వ్యక్తమవుతోంది. దీనికి తోడు గ్రేడ్-1 ఈవోలు పెరిగినంతగా మఫిసిల్ కేడర్ స్ట్రెంగ్త్ పెరగలేదు. దీనికి తోడు ఏసీ పోస్టులు కూడా పెరగలేదు. ఈ పలుకుబడి పదోన్నతుల వల్ల మఫిసిల్ సూపరింటెండెంట్లు ఆ పోస్టులోనే రిటైరయ్యే పరిస్థితి దాపురించింది. ఏదేమైనప్పటికీ జీవో 590 తమను భూస్థాపితం చేసిందని మఫిసిల్ సూపరింటెండెంట్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

దీనికి తోడు శాఖలో ఎవరికి పదోన్నతులు ఇవ్వకపోయినా రెండేళ్లకొకసారి ఈవోలు మాత్రం పదోన్నతులు పొందుతున్నారు. మినిస్టీరియల్ సిబ్బందికి మూడు దశాబ్దాల సీనియారిటీతో ఆఫీసులకే పరిమితమవుతుండగా, కేవలం పదేళ్ల సర్వీసుతోనే ఈవోలు అసిస్టెంట్ కమిషనర్ కేడర్‌లోకి వస్తున్నారు.

# 179 రోజుల్లో భవన నిర్మాణమా!

**చీఫ్ జస్టిస్ గొగోయ్ ఆశ్చర్యం.. హర్షం ★ కోర్టు హాల్లో మహాత్ముని విగ్రహావిష్కరణ**



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 3: రాష్ట్ర రాజధాని అమరావతి పరిధిలో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ఆదివారం బిజీబిజీగా గడిపారు. విజయవాడకు శనివారం చేరుకున్న ఆయన రాజధాని ప్రాంతంలోని నేలపాడు వద్ద నిర్మించనున్న ఏపీ హైకోర్టు శాశ్వత భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం జ్యుడీషియల్ కాంప్లెక్సును ప్రారంభించారు.

తాత్కాలిక హైకోర్టు నిర్మాణ విశేషాలను ఆడియో, వీడియో ప్రజంటేషన్ ద్వారా అధికారులు ఆయనకు వివరించారు. అమరావతి నగర నిర్మాణ నమూనాలను ఆసక్తిగా తిలకించారు. హైకోర్టు, శాసనసభ, 9నగరాల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. రాజధానిలో వర్సిటీల ఏర్పాటు గురించి అధికారులను జస్టిస్ గొగోయ్ అడిగి తెలుసుకున్నారు. తాత్కాలిక హైకోర్టు ఆవరణ పరిధిలో 100 అడుగుల ఎత్తుల ఏర్పాటు చేసిన జాతీయ జెండాను జస్టిస్ గొగోయ్ ఆవిష్కరించారు. తాత్కాలిక హైకోర్టు భవనంలో ప్రవేశద్వారం సమీపంలో గోడపై ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ నిలువెత్తు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. తాత్కాలిక హైకోర్టులోని వివిధ హాళ్లను సందర్శించారు. రెండో అంతస్తులోని కోర్టు హాల్‌ను కూడా పరిశీలించారు. 179రోజుల్లో భవన నిర్మాణం పూర్తిచేయడంపై ఆశ్చర్యం, హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం ఆయన హెలికాప్టర్‌లో అమరావతి రాజధాని నిర్మాణ ప్రాంతాలను వీక్షించారు. ఈ పర్యటనలో ఆయన వెంట దీపాంజలీ గొగోయ్ కూడా ఉన్నారు. కాగా తాత్కాలిక హైకోర్టుగా వ్యవహరించే జ్యుడీషియల్ కాంప్లెక్సును 4.6 ఎకరాల్లో నిర్మించారు. 2.65 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం వచ్చేలా నిర్మించారు. 22 కోర్టులు, జడ్జిల చాంబర్లను, గ్రంథాలయం, బార్ రూమ్, అడ్వకేట్ల చాంబర్ల వంటివి దీనిలో ఏర్పాటు చేశారు.

## యూటీఎఫ్ మహా పాదయాత్ర భగ్నం

**★ అడ్డుకున్న పోలీసులు**
**★ నేతలు, కార్యకర్తల అరెస్టు**

గుంటూరు, ఫిబ్రవరి 3: ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యుటీఎఫ్ ఆధ్వర్యాన గుంటూరు నగరంలో ఆదివారం నిర్వహించిన మహా పాదయాత్రను పోలీసులు భగ్నం చేశారు. నగరంలోని మార్కెట్ సెంటర్ నుండి యాత్రగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలను పాత బస్టాండ్ సెంటర్‌లో అడ్డుకున్నారు.

ఈసందర్భంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి. పీడీఎఫ్ ఎమ్మెల్సీ వై శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాబురెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు శ్రీదేవి, లక్ష్మీరాజ, సురేష్‌కుమార్, శ్రీనివాసరావు, నాగమణి, సీహెచ్ పద్మావతి, టీఎస్ఎన్ఎల్ మల్లేశ్వరరావు, సీపీఎం తూర్పు కార్యదర్శి పాశం రామారావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు 30 యాక్ట్‌ను ఈ నెలరోజులు అమలు చేస్తున్నారు. యుటీఎఫ్ మహా పాదయాత్రకు అనుమతి లేదని నిరాకరించినప్పటికీ ఖాతరు చేయకపోవడంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేశారు.

# ఏ పార్టీ టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటాం

**★ చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకే నిరాదరణ**
**★ బ్రాహ్మణ సేవా సమాఖ్య సమావేశం తీర్మానం**

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 3: ఒకప్పుడు చట్టసభల్లో బ్రాహ్మణుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేది. క్రమంగా రాజకీయాల్లో చోటుచేసుకున్న సమీకరణాలు మన ప్రాధాన్యతకు గండికొట్టింది. తద్వారా చట్టసభల్లో ప్రాతినిధ్యం కోల్పోయి, పూర్తి నిరాదరణకు గురవుతూ వచ్చాం. ఇదే తీరు కొనసాగితే భవిష్యత్‌లో కనీస గుర్తింపునకు కూడా నోచుకోలేం. అందుకే రాజకీయ ప్రాధాన్యత కోసం ఉద్యమించక తప్పదంటూ బ్రాహ్మణ వర్గాలు గళమెత్తాయి. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో విశాఖ నగరంలో ఆదివారం నిర్వహించిన ఐక్యతా సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు. సమాఖ్య పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ కన్వీనర్‌గా వ్యవహరించారు. వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అయినా బ్రాహ్మణులకు పార్టీ టికెట్టు ఇచ్చి పోటీకి నిలబెడితే తామంతా ఒక్కటిగా పనిచేసి గెలిపించుకుంటామని ఉద్ఘాటించారు. సామాజికంగా సంఖ్యాబలాలు బేరీజు వేస్తూ ప్రాతినిధ్యం ఇవ్వడానికి రాజకీయ పార్టీలు విముఖత చూపడంపై సమాఖ్య అభ్యంతరం తెలిపింది. రాష్ట్రంలో తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు తామంతా సమైక్యంగా కృషి చేస్తామన్నారు. సామాజికంగా ఆయా నియోజకవర్గాల్లో మిగిలిన వారందరినీ సంఘటిత పరిచి అభ్యర్థులకు విజయం దక్కేలా చూస్తామన్నారు. వివిధ రాజకీయ పార్టీల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న వారు వారి పార్టీ అధిష్ఠానాలను ఒప్పించి పోటీకి నిలబడితే సంఘం బలపరుస్తుందని భరోసానిచ్చారు. సమావేశంలో ఏపీ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షుడు జ్వాలాపురపుశ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కోనేరు సతీష్ శర్మ, ఉపాధ్యక్షుడు దివి ప్రభాకరరావు, సంయుక్త కార్యదర్శి వడ్డాది ఉదయ్ కుమార్, ఒడియా బ్రాహ్మణ సంఘం తరపున ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోదీకి ఖాళీ కుండలతో నిరసన తెలుపుతాం: సీపీఐ

ఒంగోలు, ఫిబ్రవరి 3: ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల రాజకీయాలు నడుస్తున్నాయని, ఎన్నికల్లో విజయం కోసం పార్టీలు, ప్రభుత్వాలు తాయిలాలు ప్రకటిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కేంద్రం ప్రకటించిన బడ్జెట్ లో రైతులు, మధ్యతరగతి ప్రజలను ఆకర్షించే పథకాలు ప్రకటించడమే ఇందుకు నిదర్శనమన్నారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఒక్క అంశం కూడా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం అన్యాయం అన్నారు. ఈనెల 10న ప్రధాని నరేంద్ర మోదీ గుంటూరులో జరిపే పర్యటనలో ఖాళీ కుండలతో తాము నిరసన తెలుపుతామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని పార్టీలవారు ఒక్కో నియోజకవర్గంలో 50 కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఓట్లు కొనుగోలు చేసేందుకు పథకాలు సిద్ధం చేశారని ఆయన ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం , జనసేన పార్టీలు కలిసి రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తాయని స్పష్టం చేశారు.

# మంత్రి సునీతకు చేదు అనుభవం

**★ 'పసుపు కుంకుమ'ను అడ్డుకున్న మహిళలు**
**★ కాన్వాయ్‌పై చెప్పులు, చీపుర్ల వర్షం..**



మంత్రి సునీత కాన్వాయ్‌పై చెప్పులు విసురుతున్న మహిళ

ఆంధ్రభూమి బ్యూరో

అనంతపురం, ఫిబ్రవరి 3 : చంద్రన్న పసుపు కుంకుమ పంపిణీ కార్యక్రమానికి వెళ్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీతకు సొంత నియోజకవర్గంలోనే చేదు అనుభవం ఎదురైంది. అనంతపురం జిల్లాలోని తన సొంత నియోజకవర్గమైన రాప్తాడులోని ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన పసుపు కుంకుమ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆ గ్రామ డ్వాక్రా మహిళలు అడ్డుకున్నారు. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు, సునీత అధికారం చేపట్టాక పొదుపు మహిళలకు అన్యాయం చేశారని, దీంతో తాము అప్పులపాలయ్యామని ధ్వజమెత్తారు. ఇప్పుడు చెక్కుల పంపిణీ పేరుతో మరోమారు మోసం చేయడానికి వస్తుండటంపై నిరసన వ్యక్తం చేస్తూ మహిళలు ఆందోళనకు దిగారు. ఈ పరిస్థితిని అంచనా వేసిన జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తుగానే ఓఎస్‌డీ స్వామి నేతృత్వంలో ఇద్దరు డీఎస్పీల ఆధ్వర్యంలో 8 మంది సీఐలు, సుమారు 350 మంది సివిల్ పోలీసులు, సాయుధ దళాలు గ్రామంలో మోహరించాయి.

భారీ బందోబస్తు నడుమ గ్రామంలో ఉదయమే కవాతు నిర్వహించి గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అలాగే తోపుదుర్తి గ్రామానికి వెళ్లే మార్గంలో రెండు పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాకపోకలపై నిఘా ఉంచారు. ఈ తరుణంలో గ్రామంలో ఆందోళనకు దిగిన మహిళలు సీఎం చంద్రబాబు, మంత్రి సునీతకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసీపీ ఆధ్వర్యంలోనే డ్వాక్రా సంఘాల మహిళలు ఆందోళనకు దిగినట్లు పోలీసులు గుర్తించారు. తోపుదుర్తిలో పసుపు కుంకుమ పంపిణీని అడ్డుకునేందుకు మహిళలు తీవ్రయత్నం చేశారు. ఈక్రమంలో మంత్రి కాన్వాయ్‌పై మహిళలు చెప్పులు, చీపుర్లు విసిరారు. దీంతో పోలీసులు, మహిళల నడుమ తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుని గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తేవడానికి మహిళా సిబ్బంది సాయంతో ఆందోళనకారులను పోలీసు వాహనంలోకి ఎక్కించారు. అలాగే మంత్రి పరిటాల సునీతను మార్గమధ్యంలోని సనప గ్రామం వద్ద పోలీసులు నిలువరించారు.

విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జీవీజీ.అశోక్ కుమార్ అక్కడికి చేరుకుని మంత్రికి పరిస్థితిని వివరించారు. గ్రామంలో పరిస్థితిని అదుపులోకి తీసుకున్న అనంతరం భారీ పోలీసు బందోబస్తు మధ్య మంత్రి పరిటాల సునీత పసుపు కుంకుమ పంపిణీ కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కాగా రాత్రి వరకూ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గృహనిర్బంధంలోనే ఉంచారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ తమ పట్ల పోలీసులు అత్యంత క్రూరంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యుత్ షాక్‌తో విషాదం

**★ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, ఫిబ్రవరి 3: విద్యుత్ షాక్‌తో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. లావేరు మండలం కొత్తరౌతుపేటలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో ఒకే కుటుంబానికి చెందిన ఆబోతుల రాములు (55), అతని భార్య పుణ్యావతి(50), రౌతు బంగారమ్మ(45), కొమ్ము వెంకన్న(48) మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో అరటి తోటలో గెలలు కోస్తుండగా ఆ తోట మీదుగా హై-టెన్షన్ కరెంటు సరఫరా తీగెలు వేలాడుతుండడంతో తగిలి ఈ ప్రమాదం సంభవించింది. అక్కడికక్కడే నలుగురూ మృతి చెందారు. అయితే, వెంకన్న కుమారుడికి సోమవారం నిశ్చితార్థం కావడంతో అరటి గెలల కోసం తోట వద్దకు వెళ్ళి గెలలు కోస్తుండగా వేలాడుతున్న విద్యుత్ తీగెలు వారిపాలిట యమపాశంగా మారాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# చంద్రబాబు పాలనలోనే అర్చకుల సంక్షేమం

**★ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్ సూర్య**

ఆంధ్రభూమి బ్యూరో



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ సూర్య

విజయవాడ, ఫిబ్రవరి 3: మాఘమాస వేళ అర్చకుల జీవితాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర దేవదాయ శాఖ కొత్త వెలుగులు నింపాయని, అర్చకుల ఉద్యోగ వయోపరిమితి పెంచడంతో పాటు, వేతన విధానాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య హర్షం ప్రకటించారు. నెలకు రూ. 10వేల వంతున కనీస జీతం ఇవ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఉన్నారని, ఈ నెల 5న ఆయన మనసులోని మాట వెల్లడించనున్నారని చెప్పారు. ఆదివారం నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులందరికీ నెలవారీ వేతనం ఇవ్వడం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారని తెలిపారు. అర్చక సంక్షేమం కోసం కొత్త వరాలు, మరిన్ని పథకాలను ప్రజావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించనున్నట్లు చెప్పారు. వంశపారంపర్య హక్కులకు చెందిన 76 జీవో జారీపై కూడా ఆయన ఒక స్పష్టమైన ప్రకటన చేయనున్నారన్నారు. అర్చకులకు ఆరోగ్య కార్డులు కూడా అందజేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందని ఆనంద్ సూర్య వివరించారు.


# సాంస్కృతిక రాజధానిగా విజయనగరం

**★ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గంటా**

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, ఫిబ్రవరి 3: విజయనగరాన్ని సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఆదివారం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల శతజయంతి ఉత్సవాలను మంత్రి గంటా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలను స్ఫూర్తిగా తీసుకొని అమరావతిలో సంగీత నృత్య కళాశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని అన్నారు. ఈ ఉత్సవాలను రెండు నెలల ముందర నుంచి ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి రూ.100 కోట్లు నిధులు మంజూరు చేసి దానిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. హరికథ పితామహులు ఆదిభట్ల నారాయణదాసు స్వస్థలమైన అజ్జాడలో పాఠశాలకు ఆయన పేరు పెట్టాలని నిర్ణయించామన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు ముఖ్యమంత్రి రూ.2 కోట్లు మంజూరు చేయగా, భవన మరమ్మతులకు మరో రూ.90 లక్షలు వెచ్చించారని వివరించారు. ఈ కళాశాలలో వసతి గృహం ఏర్పాటుకు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఈ ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు మాట్లాడుతూ కళాశాలలో ఎల్లప్పుడు ఉత్సవాలు జరిగేలా అభివృద్ధి చేయాలన్నారు. మరో వందేళ్లపాటు కళాశాల ఉండేలా పునర్మిర్మాణం చేయడాన్ని ఆయన అభినందించారు. వందేళ్ల ఉత్సవాలను మూడు రోజులపాటు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ శతజయంతి ఉత్సవాలను ప్రపంచంలోనే ఒక గుర్తుగా ఉండేలా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కళాశాలకు నిధులు మంజూరు చేసినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆదివారం ఉదయం వివిధ శకటాలతో శోభయాత్ర నిర్వహించారు. అనంతరం ఎంపీ అశోక్‌గజపతిరాజు చేతుల మీదుగా కళాశాలలో ఏర్పాటు చేసిన నాల్గో విజయరామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం హరికథా చూడామణి కోట సచ్చిదానంద శాస్త్రి భాగవతార్‌కు అతిధుల చేతుల మీదుగా శతజయంతి పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎమ్మెల్యే మృణాళిని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.నరసింగరావు, జెసి కెవి రమణారెడ్డి, జెసి-2 సీతారామారావు, ప్రిన్సిపాల్ బి.అనురాధ పరశురాం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సంగీత కళాశాల కచేరి భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు

# సాహితి

email: sahiti@andhrabhoomi.net



## విశ్వానుభూతి

చలి అందరికీ
ఒకే తీరుగ వుండదు
ఎండలాగే

వ్యక్తి పరిస్థితి కన్నా
లోకగతి ముఖ్యం మనకు
ఏ అతినైనా ప్రతిఘటిస్తాం
వ్యతిరేకిస్తాం
అవసరమైతే పోరాటం సాగిస్తాం

ఎవరో
వెన్నుదన్నుగా ఉండాలని కాదు
మనకు మనమే ధైర్యం

కష్టాలు అందరికీ
ఒకే తీరుగ వుండవు
కొందరి కష్టాలు
నిజంగా కష్టాలే అయితే
అవి మనందరివి కూడా.

సుఖాల గుట్టు తెలిసి
కష్ట నివారణ కోసం
అందరిదారి పట్టిన తేజోమూర్తులకు
మోకరిల్లక తప్పదు

మనస్సు అందరికీ
ఒకే తీరుగ వుండదు
తవ్వగా తవ్వగా
అడుగున తగిలే మనిషి మాత్రం
అందరికీ అందుతాడు
ఆ ఒక్క క్షణమే
విశ్వానుభూతికి చేరువౌతాం.

అనుభవాలూ అంతే!
స్వీయమనే లోయలోంచి పైకెగబాకితే
సూర్యుడు దొరక్కపోడు
అతని వేడికీ
నరాల్లోని ఉష్ణరక్త ప్రవాహానికీ
లంకె కుదిరినప్పుడు
మార్పు ప్రారంభమౌతుంది.
మార్పే
కొత్త చేర్పును ప్రసాదిస్తుంది.

- డా. ఎన్. గోపి



## కవి మనస్సు

ఎదురుగా ఉన్న రోడ్డు జగతికి నిదర్శనంగా
క్రమ్ముకున్న చీకటి అజ్ఞానానికి సూచనగా
వెలుగుతున్న నాలుగు దీపాలు
వేదాలకు గుర్తుగా
ఇంకా చెప్పాలంటే దిక్కులను తలపిస్తూ
విచిత్రమైన ఆలోచనలు మెదడును చుట్టేస్తూ
నిలవనివ్వవే ఏ క్షణమూ
కవి అంటే ఇంతేనేమో?
అనుక్షణం అన్వేషణ నేపథ్యంలోనే
తప్పు ఎక్కడ జరుగుతుందా అన్నట్లు
చూపుల బాణాలను ఎప్పుడూ ప్రసరిస్తూనే
రచనతో సరిచేసేంతవరకూ తపన ఆగదే
నువ్వు వింటావా వినవా
అన్న విషయం పట్టించుకోడు
తన పని తాను చేసుకుపోవడమే ధర్మంగా
నిరంతరం సాగిపోయే చిట్టిమనసు
అతనికే సొంతం
కలం సృష్టించే కలకలంలో పడి
కొట్టుకుపోతూనే
ఉప్పెనైనా ఉపద్రవం అయినా
తట్టుకునే స్థైర్యంతో
అడుగు ముందుకే వెనకడుగు తెలియని
పయనం సాగించే నీవెంత ధీరోదాత్తుడివి?
నీకిచ్చే మెమెంటోలు అందరి లెక్కలో
ఓ చెక్కముక్క
అది నీ ప్రతిభకు తార్కాణం అని
కొందరికే తెలుసు
నీ చుట్టూ కప్పే శాలువా గుడ్డముక్క కాదని
నీలోని ఆత్మవిశ్వాసాన్ని అంచెలంచెలుగా
పెంచే చెట్టని ఎందరు గ్రహిస్తారు?
విలువకే విలువను ఆపాదిస్తుందని
ఎప్పుడు తెలుసుకుంటారు?
సత్కారం అంటే పరుగులు తీసే
నీ మనసును పరిహాసాలపాలు చేస్తూ
నిన్ను అనుక్షణం అణగదొక్కే
మాటలతో తూట్లు పొడిచినా
యోధుడిలా, యుద్ధ సైనికుడిలా
సమాజానికి దిక్సూచిలా
నువ్వు మాత్రం
ముందుకే.. ముమ్ముందుకే..

- యలమర్తి అనూరాధ, 9247260206



## బంధం

మరణంతో మరిచేదా ప్రేమంటే..
దూరంతో ముగిసేదా ప్రేమంటే..
నా అర్థ భాగానివి నీవయ్యావు
మూడు ముళ్ల బంధానికి
విలువనిచ్చావు...
ఏడడుగుల బంధానికి
అర్థం చూపించావు
కష్టసుఖాల్లో పాలుపంచుకున్నావు
మన ప్రేమకు గుర్తుగా ఇద్దరు
పిల్లను నాకు ఇచ్చావు
కష్టాలు వున్నా ఆనందంగా
స్వీకరిస్తూ
చిరునవ్వును మాకందించావు
ఇంటికి దీపమై వెలుగు నింపావు
చివరకు మము వీడి
నీవు వెళ్లిపోయావు

- మాధవి గోపిశెట్టి

# కాలము ఋతువులారైన కావ్యమనగ...

అనగా ''పుణికి తెచ్చిన తావుల పూలగుత్తి'' యన్నమాట. ఎప్పుడో కొన్ని ఏళ్ళక్రితము ఆయా ఋతువులాగమించిన యప్పుడు రంగు కుంచె విదల్పున బొమ్మ కట్టిన అక్షరాత్మలు. నాజూకు లెన్నియో పోగుపడిన సొబగు చాయల మేల్కవనంపు సొంపులు నాదామృతమయమ్మైన తెలుగు ఋతువులై తనివి స్వరములూదిన వైశ్వనాధీయ వివరనాళిక. వన్నెదిద్దించుకున్న వార్షిక భూషలు. ఒక్కటొక్కటిగా ఋతువులు నిల్రద్రొక్కుకునే కాలము కేవలము రెండు నెలలు. రెండు నెలలెన్ని పద్యములను భ(ధ)రించును-? కనుక నాతి దీర్ఘములే నాడెము. ఇట్టి వొక చిన్ని పొత్తమున చిక్కుకున్న చిక్కణములు. చిత్రములై జిగిమీరినవి. ''వాల్మీకి తరణి'' ఛాయను తడిసి ప్రభావితుడైన కాళిదాసు కాలము గడిచి తెలుగు నేలమీద తిరిగి కాలూనినాడూ. అప్పటి తన పేరును మార్చుకున్నాడు. ఋతువుల శోభ అక్షరాల్లో కొదిగినంత అందంగా. చర్మచక్షుగోచరాలు కావు. అక్షరాలు నియమాల కతీతం గదా!

(మమ్మటుడు) **"నియతి కృత నియమ రహితాం / హ్లాదైకమయీ మనన్యపర తంత్రామ్ / నవ రస రుచిరాం నిర్మితి / మా దధతీ భారతీ కవేర్జయతి॥"** (కావ్య ప్రకాశ.)

లౌకిక కవియొక్క భారతి ప్రకృతి నియమములకతీతమైనది. బ్రహ్మ సృష్టియగు ప్రకృతియందు పద్మమునకు సౌరభము నియమితమై యుండును; పద్మమన్నచో గంధముండవలెను. ఇది నియతి కృత నియమము. కవి సృష్టియగు ముఖ పద్మమునకు లోక సిద్ధి సౌరభముతో పని లేదు. అది కవి ప్రతిభా కల్పిత సౌరభ విశేషములే విరాజిల్లును. కవి సృష్టి ఇట్లు నియతి కృత నియమ రహితము. బ్రహ్మ సృష్టి నియతముగా సుఖ దుఃఖ మోహస్వరూపము. పరమాణ్వాది కారణ పరతంత్రము. కవి సృష్టి అట్లుకాదు. అది ఆనందైక మయము. కేవల కవి ప్రతిభా సిద్ధమగుట చేసి అనన్య పరతంత్రము. శృంగారాది రసోజ్జ్వలము. ఇట్లు బ్రహ్మసృష్టికంటె విలక్షణమై కవిసృష్టి మొప్పారును. "The most delightful and perfect form of Utterance that human words can reach" (మాచ్యు ఆర్నాల్డ్). ఇది కవికున్న ప్రతిభను ప్రపంచించుటలోని ఒక విపుల వైదుష్యం ఒక విషయ వైవిధ్యం. అక్షరముల ద్వారా ప్రతిపాదింపబడిన ఒక అలౌకికార్థ పర్యవసానంలో కవి ''చాటువ'' కనిపించుటయే ఉత్తమ కవితాలక్షణమని పెద్దల యభిప్రాయము. ఇది నిరాక్షేపణీయంగా అంగీకరించాల్సిన బుద్ధిమంతము. ఇక్కడ కవి పోడిమి పొత్తపు ''అడపాడ'' మీద ఆధారపడి యుండదు. అయితే ఇదే విషయంలో అనుస్యూతాచారం ఏమంటే గొప్పతనానికి గొప్ప పొత్తాలే ఎన్నుకోబడటం. కానీ ఇప్పుడొక ''మాఋ పాఋ''.

బహుకృతి ప్రబంధలగు కవుల కృషికి వెలగట్టునప్పుడు వారి ప్రధాన గ్రంథములను గ్రహించుట భావుక సాధారణమైన పద్ధతియని పై ప్రస్తావనాతాత్పర్యం. కారణం వాఙ్మయంలో కొందరు కవుల పేర్లతో వారి వారి ప్రసిద్ధ రచనలు మాత్రమే స్ఫురించును. కాళిదాసు అనగానే శాకుంతలం, బాణుడు అనగానే కాదంబరి, తిక్కన యనగానే భారతం, విశ్వనాథ అనగానే- వేయిపడగలో- రామాయణమో తలపు పొలముల తగులుట సాహితీ పథికులకు అనుభవ విషయము. ఇప్పుడొక ''మాఋ పాఋ''యంటిని కదా! అది యొక్క చిన్న కబ్బము. అందునా కాలమారు మార్పుల సంహారమన్నచో అందుండు ఋతువు కాలమే రెండు నెలలు. ఇట్టి కొద్దికాలము యేమంత పెద్దతనము నొనగూర్చుకొనకలదు. కనుక నాతి దీర్ఘములే నాడెమనుట. దీర్ఘమో హ్రస్వమో. కవిత ప్రతిభా సమన్వితమైనప్పుడీ పుటల లెక్క పరిగణనలోకి రాదు. ఇది యొక ప్రమాణము ననుసరించియే యుండును. ప్రమాణము శిల్పము; పోషణము. ఈ శిల్ప పోషణలో వైశాల్యము వైశారద్యమునకు ''గది''కాదు. ఇప్పుడు ''రమణీయార్థ ప్రతిపాదక శబ్దం'' ఎకరముల మేర నాక్రమించును. అట్టిదే కానిచో ''నానీ''లణాకానీలగుట కన్న మర్యాదేమున్నది..?

అరవై పద్యాల్లో ఆరు ఋతువులు; పది చొప్పున. పరిణామంలో చిన్నదయ్యూ పరిపాకంలో మిన్నదగుట గమనించతగ్గది. ఋతువుల్ని సంస్కృతాంధ్రాల్లో చాలామందే వ్రాశారు. కాళిదాసే వ్రాయగలడు కనుక వ్రాసినాడు. మరి తెలుగున ఎవరి సొమ్ము? జడాజడ వస్తు పరిశీలనము; ఆచార సంప్రదాయ పరిజ్ఞానము వాతావరణ పరివర్తన ప్రకారము ఏది యెట్లో వర్ణన యందట్లే అందగించిన ఆ తీరు మునుపెన్నడు ఎవ్వరు స్పృశించనిది. ఏ ఋతువున ఏ లత లే దారువులే పూవులే తావులెట్లుండునో- తెలుగు ఋతు సంహారకర్త యెరిగినంత మరొక తెలుగు కవి ఎఱుగరన్నది నిజం. నిష్ఠురమైనను. గ్రంథకర్త యొక్క సాహిత్యాభిరుచులకు, జీవిత దర్శన ప్రదర్శనమునకు స్వీకార్యము కాతగినది. ''నిరంకుశ పద ప్రజాస్వామ్య ప్రభుత్వమె''వరిదో వారు మాత్రమే వ్రాయగలరనుట. ఇదిగాక పెక్కురు కూర్పరులలో సాధారణమైనది ఏదో ఒక కూర్పున మాత్రమే వారి శక్తులన్నిటిని ప్రోవుపెట్టగలరు; పెట్టుదురు. ఈ సూత్రము ''ఋతుసంహార'' కర్తకొప్పదు. ఆ మహాశిల్పి రచనలన్నియును దేనికదే బహుముఖీనములు. ''ఋతుసంహారము- అను తెలుగు ఋతువులు'' కబ్బమును లేదా ఖండకావ్య సంపుటిని వ్రాసిన కవి విశ్వనాథ సత్యనారాయణగారు. లక్షణముచే యిది అనిబద్ధ కావ్యము. విషయమున ప్రకృతి వర్ణనాప్రధానమైన భావకావ్యము. మహాకవి పెక్కు కృతులకంటె దీనియందు కొన్ని విశేషములున్నవి. అందు మొదటిది ఆయన కృతి ప్రదానము. ఈ కావ్యరత్నము శ్రీ కట్టమంచి వారి యశఃకౌస్తుభము. సర్వథా దీనికి మహోజ్వల శిఖరారోపణ తుల్యమనదగినదీ కృతి సమర్పణమ. ఈ అంకిత పద్యములైదు: (ఇందులో మొదటిది శ్లోకం, మిగిలిన నాలుగు పద్యాలు) అందు పొదిగిన ప్రసంగమంతయు ఆంధ్ర వాఙ్మయ ప్రశంసారూపము. అందులోని చివరి పద్యము ''నన్న భట్టులు మధు నవ ఝరీ జనగిరి''... తెలుగులకు ప్రాతఃపఠనీయము. కారణము పెద్ద పాదములన్నియు తెలుగువారేలగా ఎత్తుగీతము మాత్రము సంస్కృత కవులది. కనుక ఈ పద్యము తెలుగుల ప్రాతఃపఠనీయమనుట.

ఈ పొత్తమున కవిగారి మొదటి కారు వసంతము. ఈ ప్రథమ ఋతు పరిచయము నాగరక వాతావరణమున నుపక్రమింపబడినది. పల్లీయులకు ఆమని వచ్చినదని తెలిసికొనుటకు తీవ్ర ప్రయత్నమక్కరలేదు. ప్రకృతి సహజమగు ఋతు పరిణామ హేల పల్లెలందు ప్రామాణికముగనే యుండును. నాది యిప్పటికీ పచ్చిపల్లెటూరు కనుక- నాకీ విషయము జన్మజ్ఞానమై యున్నది. వ్యావహారిక ప్రవృత్తి పాషాణీకృతమైన పౌర జీవితమున కందువ కరస్పర్శ; అందునా సుకుమారమగు చైత్రానందము తత్వాన్వేషణపరులకే అనిపించుట, కనిపించుట కద్దు. కనుకనే ''పరిచయానుద్రిక్త పరిరంభణమున ప్రియురాలి యెద చెమరింపు'' ''శీతోదక స్నాన జాత సౌఖ్యము పైని ముకుపుటాన చెమర్పు'' ''పేరంట మునకేగు పిన్న బాలిక వాలుజడ మల్లెపూవు కానుపు'' ''వేప కొమ్మ కావి చిగురెత్త పజ్జయానెకు పూత'' ఈ హేతుపరంపరను పల్లెటూరువాడు గమనించినంత వేగముగా పురీ పౌరులు గమనించలేరు. వారికేదో సంశయానుభవము కొలువు జీవితమున కొసాకులు మేయును. వారికి వసంత మాగ మించినదను విశ్వాసపు గుర్తు ఎట్టి గుబులును పుట్టించదు. కనుకనే ''ఒక దినాన హఠాత్తుగా చికిలి కుహూకుహువు''ను గుర్తించిరి. వసంతము వచ్చినది. ఇక సందేహము లేదు. ప్రవాహము వదలి వచ్చిన పరభృతము మేలుకొలిపినది. ఇది వసంత మధురిమావతారమే.

> ***అరవై పద్యాల్లో ఆరు ఋతువులు; పది చొప్పున. పరిణామంలో చిన్నదయ్యూ పరిపాకంలో మిన్నదగుట గమనించతగ్గది. ఋతువుల్ని సంస్కృతాంధ్రాల్లో చాలామందే వ్రాశారు. కాళిదాసే వ్రాయగలడు కనుక వ్రాసినాడు. మరి తెలుగున ఎవరి సొమ్ము? జడాజడ వస్తు పరిశీలనము; ఆచార సంప్రదాయ పరిజ్ఞానము వాతావరణ పరివర్తన ప్రకారము ఏది యెట్లో వర్ణన యందట్లే అందగించిన ఆ తీరు మునుపెన్నడు ఎవ్వరు స్పృశించనిది.***

దీనికింత ప్రత్యేకత ఎందుకు- అనగా అన్ని ఋతువుల ''రేకులు'' ఇచట నున్నవి. ఫలించిన తపసు యొక్క నగ్నత్వము అలంకరించుకొనును. సమయమంతయు పరిమళించును. సందర్భము సుంకు తేలును. ఈ వసంతుడు సామాన్యుడా...? మహారాజ వైభవోద్దామ సుకుమారమూర్తి. ఋతురాట్ సభానలకూబరుడు. ఈ ఔపమ్య స్ఫూర్తి మార్గదృష్టిగల మహాకవయితల పొత్తు. పొత్తము. ఇట్టిదే వసంతము నలుదెసలు ముట్టినది. సందడి యంతయు సుతర్దన కంఠ కూచితముగా దిక్కులు చుట్టినది. కొత్తగా జతకట్టిన కోకిలమ్మ తెలుగునాటి రసాల వాటికల ఎంగిలి చేయక విడిచిన చిగురు లేదు. ఆమనికి బాల్యము గడిచినట్లున్న శోభ యంతయు తరు యౌవనమైనది. పుష్పవత్యాంకురములైనవి. కామినీ కాముకులు అంగజాతంబుజాప్తారుణాంతర్బహిర్వహ్ని తప్తులు. ఇంత ఎవరికి తెలియును. ప్రకృతిననుశీలనము చేయగల పరమ ప్రతిభామూర్తులకు తప్ప. ఇదియూ పూజమే! పూజలనట్లుంచ తెలుగునాటి పూదటికే వన్నెయువాసియు తెచ్చినది మల్లెపూవు. సాయం తనమున ముగ్ధభావ ప్రచాలితయై ప్రియురాలు సరము కట్టుటాది పగలు రెండుజాముల వేళ పంచపాత్ర వారిపై తేలియాడువరకు వాని దినచర్య వర్ణింపబడినది. తరువాతి పద్యములందున ఆ పూలే ప్రౌఢాంధ్ర కృతుల గుణములకు పూటకాపులు. ఇందు ఆ కావ్యస్వభావములు స్థూలముగా తెలుపుచు మల్లికా పుష్ప గుణములతో వానిని శ్లేషించుట సుభగము. ఇట్లీ వసంతావతార ఘట్టము ఆద్యంతము మల్లెపూలతో సవరింపబడినది. పిన్న బాలిక వాలు జడ మొగ్గగా కంటికి వ్రేగై వసంత ఋతుశోభల ప్రసవించు చూలాలుగా ఎసకమెసగి మల్లికయే మాధవోత్సవమును నిర్వహించుట ముఖ నిర్వహణముల యైక్యము సాధించిన యుదాత్త శిల్పము. ఇంతటితో వసంతము ముగిసినది. పాఠకులు చదువువచ్చిన వారు కదా, వసంత ఋతు సూక్తమున చివరగా ఎన్ని ప్రబంధ ప్రసూనములావిర్భవించినవో గదా!! ఇవి యన్నియు మల్లెలే!!! ఇంకను ఏమియో. ఎంతయో చెప్పవలసినదున్నదే మోయని యనిపించుట పాఠకుని తృప్తికి కవి పెట్టిన మర్యాద. ఋతువునకు పది పద్యములుగా చేసికొన్న నియమము నియమముగానే సాగినది. ప్రాచీన వసంత వర్ణనలలో తేనె విందున త్రేన్చెడు తేటలు, కమ్మని లతాంతములకు మ్మొనసివచ్చు మధుపమ్ముల గీత నినదమ్ములు పంచమ స్వరమున ప్రపంచమునొక డోల నూపు అనిమకములు తవిరాకులూడిచి తపసిగా మసలిన నగ్నవల్లిక పర్ణములలో దాగుటలు, ఇట్లెన్నిటినో ఊహావిహగములుచేసి ఎగిరింపవచ్చును కానీ మర్యాద మర్యాదే.

ఎండాకాలమునూహించియో- ఆ నిదాఘ మావహింపచేసుకొనియో 'దుర్నిరీక్ష్య ప్రభాధూర్ధరభ్భటంతో క్షేత్ర జీవనుల శిక్షించాడనో పటురోష కాషాయ కుటిలాంశు కశలతో గోగణాన్ని చావగొట్టాడనో ఖరమయూఖ క్రూర ఘనకాండ పటరితో విహంగ జాతుల క్షోభ పెట్టాడనో గ్రీష్మకాల ప్రాంశు కింశుకద్యుతులతో తరువల్లి కలకగ్గిదాల్చినాడనో'' వేసంగిని గూర్చి వేసవి వేడిని గూర్చి- వేడి హావడి గురించి - ఏవో ఎవేవో చెప్పవచ్చు. అది కవి చిత్తకోశమునందలి భావ సంపద. కర్తవ్య బాధ్యత నెరిగిన కవి కది చెల్లును. ఆ భారతి ధ్వన్యర్థ విలసితమై, ప్రతిపత్తలకు దివ్యమగునానందమును పిండును, అప్పుడా పాఠకుల ఎద నిండును. ఎలమి పండును. పాఠకుల కెదపండుట కడుప నిండుట వంటిది. కడుపెప్పుడు నిండును, తల్లి దగ్గరకు తీసుకున్నప్పుడు. తల్లి ఎవరు? పరమేశ్వరి. మరి పరమేశ్వరి? ఇదిగో అభినవ గుప్తుడీమాట అన్నాడు. చదువొచ్చుకదా. తప్పకుండా చదవండి.

**"యదున్మీలన యుక్తైవ విశ్వమున్మీల తిక్షనాత్**
**స్వాత్మాయతన విశ్రాంతాం తాం వందే ప్రతిభాం శివాం"**

ప్రతిభను ''పరమేశ్వరీ'' రూపం చేసినాడు. ఆ ''ప్రతిభా ధృతకవి'' చెంత ఈ పాఠకుల కాకలి తీరుట. ఆ దేవి కరుణ ఎవనిపై ప్రసరించునో వానికి విశ్వోన్మీలనము కలుగును. అట్టి విశ్వోన్మీలనము కలిగిన నాడు కాని యాతడు మహాకవి కానేరడు. ఇప్పుడట్లు కాదు; కలము పట్టినాడా వాడు కాళిదాసే. అక్షరములనెటిగినాడా ఆనందవర్ధనుడే. సందునకొక చిందబొందడు సాహిత్యమనుచున్నాడు. సామూహిక హత్యాకాండకుపక్రమించు చున్నాడు. పాపమీతరము వారిలో కొందరికేదో వ్రాయవలయునన్న ఉత్సాహమున్నది. నిజమే! వ్రాయుటకేమి కావలయును? మంచి భావములు కావలెను. మంచి భాష కావలెను, మంచి భాష ఎచట లభించును? పబ్బులందు లభించదు కదా! మంచి కావ్యములయందు లభించును. మంచి కావ్యము లెచట లభించును? చదువుట యందభినివేశమున్న చిత్తాభిజాత్యమున లభించును. అట్టిదిపుడొక శశవిషాణము గదా చదువుట లేదాయె. వీరికి చేతిలో చెప్పినట్లొదిగి- ఒదుగులు పోవు భాష లేదు కదా. నిత్య వ్యవహార భాషయే'' అడుసు చిమ్మను. చిమ్మబడిన అడుసే అల్లిక పదములౌను. అల్లబడిన పదములు పద్యములు కానేరవు. అవునని వారందురు. అట్టిదే ''సామాజిక స్పృహ'' యని కూడా అందురు.

ఏవో కొన్ని శబ్దములు తెలియవచ్చును. కొన్ని యర్థములున్నూ తెలియవచ్చును. వ్యాకరణచ్ఛందోలంకారస్పృహ కొంత యుండవచ్చును. దాని కారణముగా కొన్ని పద్యములను గిలకవచ్చును. అట్టి వారిని గూడ కవులనవచ్చును. సర్వకాలములందు ఇట్టి వారలు కుప్పతెప్పలైయుండవచ్చును. కానీ అసలు కవియనగా నెట్టివానిననవచ్చును? ''ఏనాస్మిన్ అతి విచిత్ర కవి పరంపరావాహిని సంసారే కాళిదాస ప్రభృతియో ద్విత్రాః పంచభావా మహాకవయం ఇతి గణ్యంతే॥'' ఈ మహాకవుల భారతి ధ్వన్యర్థ విలసితమై ప్రతి పత్తలకు దివ్యమగు ఆనందమును కలిగించును. వారి ప్రతిభను అభివ్యక్తము చేయును. మహాకవుల ప్రతిభ సహృదయములను భ్రమర కీటక న్యాయమున సమానమగు అనుభవము కల వారినిగా జేయును. విశ్వనాథవారు గాఢ ప్రతిభులు కనుకనే అనుభూతి ప్రధానముగా కవిత్వము పలికింతురు. మిగిలిన కొందరిప్పటి కవులట్లు కాదుగదా. వీరు స్వతంత్రులైన తరువాత దేశభక్తి నశించినది. భాషాభిమానము చచ్చినది. సాహిత్యాధ్యయన శీలము చెడినది. సంస్కృతీ సంప్రదాయముల మీద ఏహ్యాభావము పతాకమెక్కినది. ఈ దృశ్యమైన మనఃస్థితి నుండి ఇప్పుడు సాహిత్యము సృష్టింపబడుచున్నది. పత్రికలలో చోటు మరింత అధఃశ్శిఖరము చేర్చినది.

ఈ ''ఋతు సంహార''కర్తకీ తిప్పలు లేవు. ఈయన భాషకొక ప్రత్యేకత యున్నది. ఆ ప్రత్యేకత జాతి మనుగడలోని ప్రత్యేకత. జాతి మనుగడలోని ప్రత్యేకత జాతికి ప్రాణము వంటిది. ఈ ప్రాణము భాషయందు; తద్గత సాహిత్యమునందు ప్రతిబింబించును. అప్పుడే అది ప్రాణవంతమైన రచన యగును. ఇట్టి ప్రాణవంతమైన రచన చేయుటకు వట్టి రచనా శక్తి చాలదు. అనంతమైన విమర్శనాశక్తి జీవితమును సహస్ర ముఖముల చూడగలశక్తి. ప్రతి విషయమునందు నిగూఢమైయున్న ప్రాణధాతువును గమనింపగల శక్తి. ఒక్క మాటలో సృష్టిసర్వమును వ్యాఖ్యానము చేయగల శక్తియుండవలయును. ఇంత ప్రతిభ ఋతుసంహార కర్తకున్నది. ఆయన కాలమున మనముండుటే శిశిరము గడచిన వసంతమూ. ఈ వసంత మధ్యంలో ఎన్ని ''వశత''లున్నాయో చూడండి. - ''కించి దుషః పూర్వకించి దతఃపర / ప్రాలేయ బిందు సంపాత వశత / మధ్యాహ్న వేళాక్రమాప్రాప్త తీక్ష్ణతా / కవితా తపోగ్ర సంక్రాంతి వశతి / సాయం సమాగత స్వచ్ఛ చంద్రాతప / కుల్యా ప్రసారణాకూత వశత / మధుర నిశార్థభాగవధునీ విధా ప్రియా /హేలా మనోజ్ఞ సాహిత్య వశత....

ఇంకా ఏదో జరిగి, ఎంత సొగసుకాడో మాధవుడు వచ్చాట్ట ఇదీ సంగతి- ఆపై కొన్ని తెలుగు నాజూకులు- చివురు జున్నులు- ఇవన్నీ గడచి ఒక హర విలాసాన్ని. కళాపూర్ణోదయాన్ని- ఆముక్తమాల్యదని- పాండురంగ మహత్తుని- మనుచరిత్రని అందించి- కవి మల్లెల కొత్త రుచుల్ని చివరిసారిగా గుర్తుచేసిన ఈ సొబగంతా -

గగన భూమండలమ్మెల్ల కలయ తిరుగు
కాలము ఋతువులారైన కబ్బమనగ
సృష్టి లావణ్య మాధురీ వృష్టి తడిసి
పొలుపు విచ్చిన వాసంతి పూల గుత్తి....

- చేత పుచ్చుకొని కవి సమ్రాట్టు గ్రీష్మ ద్వారంలోకి అడుగుపెడతాడు. ఆ వైనం మరోసారి.

- సాంధ్యశ్రీ, 8106897404

### సాధు వరదరాజం పంతులు

# తమిళనాట తెలుగు నిలిపిన ఘనుడు

తమ ప్రాంతాల తెలుగును ఇతరులు ఈసడించినా, తాము తెలుగు వాళ్ళమని, తమ భాషను పరిరక్షించుకోవడం తమ కర్తవ్యమని దక్షిణ భారతంలోని ముఖ్యంగా తమిళనాడులోని తెలుగువారు ఆరు దశాబ్దాల క్రిందటే భావించారు. సాధు వరదరాజం పంతులుగారి అకుంఠిత దీక్షవల్ల తమిళనాడులో కొడిగట్టుతున్న తెలుగుదీపం స్నేహప్రాప్తిని పొంది మళ్ళీ వెలుగుతూంది.

వరదరాజం పంతులుగారు తిరునల్వేలి జిల్లాలోని వీరరాఘవపురంలో 1889 ఆగస్టు 20న జన్మించారు. వీరి తండ్రి సాధు రామకృష్ణయ్య పంతులుగారు వివిధ ప్రభుత్వోద్యోగాలలోను, ఎట్టియాపురం సంస్థానంలో దివాన్‌గారు పనిచేశారు. ఎట్టియాపురం తెలుగురాజులు తెలుగు సంగీత సాహిత్యాలను పోషించిన వారు. ఆంధ్ర మహాభారతాన్ని తమిళ భాషలో వచన రూపంగా అనువదింపజేసి ప్రకటించారు. సాధు వరదరాజం పంతులు తమిళం బాగా అభ్యసించారు. పట్టభద్రులయిన తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయంవారి Tamil Lexicon (తమిళ శబ్దకోశం) కార్యాలయంలో ఒక చిన్న గుమాస్తాగా చేరి ఆఫీసు మేనేజరుగా చాలాకాలం పనిచేసి రిటైర్ అయ్యారు. తమిళ నిఘంటు కార్యాలయంలో పనిచేస్తున్నప్పుడు ఆయనకు తెలుగు మీద అభిమానం ఏర్పడింది. తెలుగు మాట్లాడడం వచ్చినా వ్రాయడం, చదవడం రాదు. తెలుగు సాహిత్యంతో పరిచయం లేదు. ఈ లోపాలకు ఆయన సిగ్గుపడి తెలుగు లిపి నేర్చుకున్నాడు. తెలుగు శతకాలు, భాస్కర, రామాయణం, పోతన భాగవతం, వీరేశలింగంగారి రచనలు, ఆంధ్రపత్రిక దినం దినం చదివారు. తన యింట్లో వాళ్ళకు తెలుగు నేర్పారు. వరదరాజం పంతులుగారి భార్య జయలక్ష్మమ్మ, కుమారుడు శివ సుబ్రహ్మణ్యం తెలుగులో ప్రావీణ్యం సంపాదించారు. వరదరాజం పంతులుగారి ఉద్యమానికి తోడ్పడ్డారు. ఆయన తమిళనాడులోని తెలుగువారిలో క్షీణిస్తున్న తెలుగుకు ప్రాణంపోశారు. పనిగట్టుకొని స్వంత ఖర్చులతో ఊరూరు ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా పర్యటించి తరతరాల తెలుగును ఎగసన తోశారు.

తమిళనాడులోని తెలుగువాళ్ళకు చాలా మందికి తెలుగు లిపి తెలియదు. భాషా వ్యాప్తికి లిపి అడ్డం రాకూడదు. తంజావూరులో మహారాష్ట్ర రాజులు తెలుగు కావ్యాలను నాగదలిలో వ్రాయించుకొని చదివారు. ఆంగ్లేయులు సంస్కృతాన్ని రోమన్ లిపిలో ముద్రించుకొన్నారు. నేడు కూడా సైన్యంలో హిందూస్తానీకి లిపి రోమన్ లిపే. సింధులో అరబ్బీ లిపిలో సంస్కృత గ్రంథాలున్నాయి. సాధు వరదరాజం పంతులుగారు తమిళనాడులో తెలుగు ప్రచారానికి తమిళ లిపిలో తెలుగు రచనలను అచ్చువేయించారు. ''దక్షిణాంధ్ర పత్రిక'' అనే ఒక పత్రికను పెట్టి ఉచితంగా ప్రతులను పంపారు.

వరదరాజం పంతులుగారి పుణ్యమా అని తమిళనాడులోని తెలుగువారు తమ భాషకు, యాసకు సిగ్గుపడడం మానేశారు. ఆయనకు 'దక్షిణాంధ్ర పితామహ', 'భాషోద్ధారక' అనే బిరుదులు ఇచ్చి గౌరవించారు. వరదరాజం పంతులుగారు ''దయచేసి తెలుగును కాపాడుడు'' అనే పెద్ద బ్యానరును భుజానికి తగిలించుకొని కాలికి బలపం కట్టుకొని తమిళ దేశమంతా తిరిగారు. ఆయన ఉద్యమం ఫలించింది. ఈ విధంగా తెలుగు వ్యాప్తికి, పరిరక్షణకు జీవితం వెచ్చించి ధన్యులైన వరదరాజం పంతులుగారు 1972లో 83వ ఏట కాలధర్మం చెందారు.

- తిరుమల రామచంద్ర

*(డా. నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వంలో వెలువడిన 'దక్షిణాంధ్ర దారిదీపాలు' పుస్తకం నుంచి...)*

## ఎంగిలి మెతుకులు



ముఖాముఖి అంటే
నరాలకు సూదులేసినట్టుంటుంది
అందుకే నా బాల్యాన్ని
నా ముందు కూర్చోనివ్వను...

నా పాదముద్రల వెంట
ఆమె ఎందుకు వెంటపడుతోందో..
అయోమయం
ఎక్కడో ఆకాశంలో ఉన్నవాడికి
నాపై ఎందుకంత కోపమో?
వెంటాడుతూనే ఉండేవాడు...

నా కడుపులో ఎవరో
కత్తులేసి కోసినట్టు ఉండేది;
పరిస్థితిని అర్థం చేసుకోలేనిది
అదా; నేనా!
సంహరించాలనిపిస్తుంది..

మేఘాలు గుద్దుకున్నప్పుడో
నీటిలో అగ్గి చెలరేగినప్పుడో
మా ఇంటి ముందున్న
టెంకాయచెట్ల నడుములు
ఇంటికప్పుపై వాలుతుంటే
అమ్మమ్మ కళ్లలో దీపం కదిలేది...

వీధిలో విసిరేసినట్టుండే మా ఇల్లు
ఒక అనాథ పక్షి కట్టుకున్న
గూడులా అనిపించేది...
పేగులు శబ్దం చేస్తున్నా
ఆత్మాభిమానం
ఇంటిగడప దాటేది కాదు...
తొడలపైకున్న నిక్కర్ని చూసి
మసీదు నన్ను వెలేసింది
ఒక కాగితాన్ని నా పిడికిలో
బంధించగానే
చెంపలపై నదులు కదులుతాయి
అందులో ఏముందో తెలిసేది కాదు
మరుసటి రోజు బడి మరణిస్తుంది...

వాళ్లమ్మకు తెలియకుండా
పక్కింటి జయ నా దోసిళ్లలో పెట్టె
ఎంగిలి మెతుకులు నాకు అమృతం
కడవలోని నీటిని తాగాలన్నా
కనురెప్పలు విరిగిన శబ్దం;
గుండెల్లో ఒణుకు పుట్టించేది...

అందుకే నేనెప్పుడూ నా బాల్యాన్ని
ఎదురుగా కూర్చోబెట్టుకుని మాట్లాడను
కానీ నేడెందుకో బాల్యాన్ని
అక్షరీకరించాలనుకున్నా...
ముసలి ఆవు నోట్లో
మేత నెమరేస్తున్న శబ్దం వినగానే
లోపలో బయటో
ఊపిరి బందీ అవుతుంది

- జాకీర్, 8977159437

# రైతు రుణమాఫీ ఒక గిమ్మిక్కు

- ❐ 80 శాతం మంది రైతులకు ప్రయోజనం శూన్యం
- ❐ వారి ఖాతాలో సాలీనా రూ.6 వేలు జమ ఒక వరం
- ❐ పౌరసత్వం బిల్లు తెచ్చి తీరుతాం ❐ ఉగ్రవాదంపై ఉక్కుపాదం
- ❐ జమ్మూ ర్యాలీలో కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని నరేంద్ర మోదీ

జమ్ము, ఫిబ్రవరి 3: వచ్చే ఎన్నికల్లో ఏదో విధంగా గెలవాలనే తాపత్రయంతో ప్రజలను మోసం చేసేందుకు రైతు రుణమాఫీ స్కీంను ఒక గిమ్మిక్కుగా కాంగ్రెస్ పార్టీ ప్రయోగిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలపై విశ్వాసం లేదని, వారి ఓట్లు దండుకునేందుకు మాయమాటలు చెబుతోందన్నారు. తమ ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు సాలీనా రూ. 6వేలను మూడు విడతలుగా వారి ఖాతాలో నేరుగా జమ చేసే వినూత్న స్కీంను ప్రవేశపెట్టామన్నారు. ఐదు ఎకరాలున్న రైతులకు ప్రయోజనం కల్పిస్తామన్నారు. రైతులకు రుణమాఫీ స్కీం వల్ల 80 శాతం రైతులకు మేలు జరగదన్నారు. వీరి సంగతిని ఎవరు పట్టించుకుంటారన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ ఎయిమ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ విజయ్‌పూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మతపరమైన అల్లర్లకు బలై ఇతర దేశాల నుంచి వలస వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించడానికి తాము చేస్తున్న ప్రయత్నాలకు ప్రతిపక్ష పార్టీలు సహకరించడం లేదన్నారు. ఇరుగుపొరుగుదేశాల్లో మతపరమైదాడులను భరించలేక మనదేశానికి వస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. కాశ్మీరీ పండిట్ల అంశం భావోద్వేగాలతో కూడుకున్నదన్నారు. శరణార్థులు గౌరవంగా జీవించే హక్కును కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. సరిహద్దుల్లో 14వేల బంకర్లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తిలేదని, ఉక్కుపాదం మోపుతామన్నారు. మాజీ సైనికులకు ఇచ్చిన హామీలను



అమలు చేస్తున్నామని, ఈ విషయంలో కాంగ్రెస్ దగాకోరు విధానాలకు పాల్పడుతోందన్నారు. మాజీ సైనికుల సంక్షేమానికి గత ప్రభుత్వం రూ. 500 కోట్లు ఖర్చుపెట్టిందని, కాని తమ ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన బకాయిలు, సంక్షేమం కోసం రూ.35వేల కోట్లను ఇంతవరకు ఖర్చుపెట్టినట్లు చెప్పారు. దేశ విభజన జరిగిన సమయంలోనే కర్తాపూర్‌లో గురునానక్ స్థాపించినన గురుద్వారా ప్రాంతం మన దేశంలో కలిపే విషయంలో ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రద్ధ వహించలేదన్నారు. ప్రతి పౌరుడు తప్పనిసరిగా బ్యాంకు ఖాతాను తెరవాలన్న నిబంధన వల్ల ఈ రోజు రైతుల ఖాతాల్లోకి నేరుగా బెనిఫిట్ జమవుతుందన్నారు. పీఎం కిసాన్ స్కీంకు రూ.75వేల కోట్లను మంజూరు చేశామన్నారు. వచ్చే పదేళ్ల పాటు రైతులకు మేలు కలిగే విధంగా ఈ స్కీంకు సంబంధించి సొమ్మును డిపాజిట్ చేయనున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరలో రైతులకు మొదటి వాయిదా కింద సొమ్మును డిపాజిట్ చేస్తున్నట్లు చెప్పారు.

# పౌరసత్వ బిల్లు ఆమోదించ వద్దు

- ❐ సవరణ బిల్లుపై పెరుగుతున్న వ్యతిరేకత
- ❐ ఈశాన్య రాష్ట్రాల లాబీయింగ్
- ❐ ప్రతిపక్ష నేతలతో ఢిల్లీలో మంతనాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళన ఉధృతమవుతోంది. ఇందులోభాగంగా ఆ ప్రాంతానికి చెందిన నేతలు ఇక్కడ సమావేశమై రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందకుండా చూడాలని ప్రతిపక్ష పార్టీలపై వత్తిడి తెస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 11 పార్టీలు అన్ని పార్టీలను కలిసి తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాయి. ఈ బిల్లును ప్రవేశపెట్టవద్దంటూ ఈ పార్టీల తరఫున ప్రతినిధులు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. ఈ విషయమై ఏజీపీ నేత, మాజీ మంత్రి బీరేంద్ర ప్రసాద్ బైష్యా మాట్లాడుతూ, మేఘాలయ సీఎం కొన్రాడ్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే ఒడిశాకు చెందిన బీజేడీ పార్టీ నేతలు, ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్‌ను కూడా కలిశామన్నారు. తాము సోమవారం కాంగ్రెస్, శివసేన పార్టీ నేతలను కూడా కలుస్తుమన్నారు. ఇరుగుపొరుగుదేశాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధ శరణార్థులకు పౌరసత్వం ఇచ్చే బిల్లుకు లోక్‌సభ ఇప్పటికే ఆమోదించింది. 4వ తేదీన రాజ్యసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. 2014 డిసెంబర్ 31వరకు ఇక్కడ వచ్చి స్థిరపడిన శరణార్థులకు పౌరసత్వం ఇవ్వాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది.

# పద్మశ్రీని వెనక్కి ఇచ్చేసిన నిర్మాత

పౌరసత్వం సవరణ బిల్లును నిరసిస్తూ మణిపురికి చెందిన ప్రముఖ సినీ నిర్మాత అర్బిమ్ శ్యాం శర్మ పద్మశ్రీ పురస్కారాన్ని వెనక్కి ఇచ్చేస్తున్నట్లు చెప్పారు. శ్యాం శర్మ వయస్సు 83 ఏళ్లు. ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజల మనోభావాలను భంగపరిచే విధంగా బిల్లు ఉందన్నారు. ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొంది తీరుతుందని ప్రధాని మోదీ చెప్పడం తనను బాధించిందన్నారు. ఈ బిల్లు వల్ల ఈశాన్యంలోని చిన్న రాష్ట్రాల ప్రజలు స్థానికేతరులవుతారన్నారు. నాగాలాండ్, మిజోరాం, మేఘాలయ రాష్ట్రాలకు రాజ్యాంగపరమైన రక్షణలు ఉన్నా, ఆందోళన చేస్తున్నాయంటే అర్థం చేసుకోవాలన్నారు. వచ్చే 50 ఏళ్లలో ఈశాన్యంలోని భిన్న సంస్కృతి ప్రజల సంప్రదాయాలు అంతరించిపోతాయన్నారు.



పద్మశ్రీని వెనక్కి ఇచ్చేసిన నిర్మాత అర్బిమ్ శ్యాం శర్మ

# బీహార్‌లో రైలు ప్రమాదం

**పట్టాలు తప్పిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ ❐ ఆరుగురు మృతి ❐ 29 మందికి గాయాలు**



సోన్‌పూర్ (బీహార్), ఫిబ్రవరి 3: బీహార్‌లో రైలు ప్రమాదం జరిగింది. సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, 29 మంది గాయపడ్డారు. 12487 జోగ్‌బనీ-ఆనంద్ విహార్ సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ 11 బోగీలు ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు కిషన్‌గంజ్ జిల్లాలోని జోగ్‌బనీ వద్ద పట్టాలు తప్పాయి. ప్రమాదం జరిగిన ప్రదేశం సోన్‌పూర్ డివిజన్‌లోని మహనార్‌రోడ్‌కు దగ్గరలో ఉంది. ఈ ప్రమాదంలో ఒక జనరల్ కోచ్, ఒక ఏసీ కోచ్, బి3, ఎస్ 9, ఎస్ 9, ఎస్ 10 స్లీపర్ కోచ్‌లతో పాటు మరో ఆరు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, 29 మంది తీవ్రంగా, 27 మంది స్వల్పంగా గాయపడ్డారు. మృతి చెందిన వారిని లచ్చా దేవి (66), ఇందిరా దేవి (60), శంషుద్దీన్ ఆలం (26), అన్సర్ ఆలం (19), షైదా ఖటూన్ (40), సుదర్శన్ దాస్ (60)లుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. వారిలో తీవ్రంగా గాయపడిన వారిని మజఫర్‌పూర్, పట్నా ఆసుపత్రులకు డాక్టర్లు రిఫర్ చేశారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా**

రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడ్డ వారికి లక్ష రూపాయలు, స్వల్పంగా గాయపడ్డ వారికి 50 వేల రూపాయల పరిహారాన్ని ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. సహాయ చర్యలు వేగంగా జరుగుతున్నాయని, మిగిలిన ప్రయాణికులకు ఆహారం, నీరు అందించామని, ఏక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌ను సంఘటనా స్థలానికి పంపామని, ప్రమాదంలో బాగానే ఉన్న 12 కోచ్‌లను 11 కోచ్‌ల రైలుకు కలిపి 500 మంది ప్రయాణికులతో 9.52 గంటలకు గమ్యస్థానానికి బయలుదేరిందని, మరికొంతమందిని పది బస్సులలో హాజిపూర్‌కు పంపామని ఆయన వివరించారు. ప్రమాదానికి ట్రాక్‌లో ఏర్పడినే పగులే కారణం కావచ్చునని అధికారులు భావిస్తున్నారు. రైల్వే సేఫ్టీ కమిషనర్ లతీఫ్‌ఖాన్‌ను ప్రమాదంపై విచారణను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రైల్వే శాఖ ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది. సోన్‌పూర్ 06158221645, హాజీపూర్ 06224272230, బరౌని 06279232222 నెంబర్లను ప్రయాణికులు, వారి బంధువులు సంప్రదించవచ్చునని రైల్వే అధికారులు తెలిపారు.

కాగా, తొలుత ప్రమాదంలో ఏడుగురు మృ చెందినట్టు అధికారులు ప్రకటించారు. మృతదేహాలను వైశాలి జిల్లాలోని ఆసుపత్రికి తరలించగా, ఆ ఆసుపత్రిలో మృతి చెందిన రోగిని కూడా ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిగా పొరపాటుగా భావించి ప్రమాద మృతులు ఏడుగురని ప్రకటించారు. తర్వాత పొరపాటును సవరించి మృతులు ఆరుగురేనని అధికారులు స్పష్టం చేశారు.

# 'కంజరభట్' వధువులకు కన్యత్వ పరీక్షలు

- ❐ జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం
- ❐ వెంటనే చర్యలు తీసుకోవాలని 'మహారాష్ట్ర'కు ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: సంచార జాతికి చెందిన కంజరభట్ కులానికి చెందిన వధువులకు బలవంతంగా కన్యత్వ పరీక్షలు నిర్వహిస్తున్నారని మీడియాలో కథనం రావడం పట్ల జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇది పూర్తిగా తిరోగమన చర్య అని, సమాజంలో మహిళల పట్ల వివక్ష, ద్వేషభావాన్ని చూపేదని, స్త్రీగౌరవానికి భంగం కలిగించడమే కాక, మానవ హక్కుల ఉల్లంఘన అని ఎన్‌సీడబ్ల్యు చైర్‌పర్సన్ రేఖాశర్మ పేర్కొన్నారు. ఈ విషయాన్ని వెంటనే పరిశీలించాలని ఆమె మహారాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పంకజ గోపీనాథ్ ముండేకు లేఖ రాసారు. మీడియా కథనం ప్రకారం కంజర్‌భట్ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు వధువులకు బలవంతంగా కన్యత్వ పరీక్షలు చేయించిన రెండు ఉదంతాలు పుణెలో వెలుగులోకి వచ్చాయి. దీనిని మహిళా కమిషన్ చాలా తీవ్రమైన విషయంగా పరిగణిస్తోందని రేఖాశర్మ తెలిపారు. ఈ చర్య మహిళల గౌరవానికి తీవ్రంగా భంగం కలిగించేదే కాక, మానవహక్కులను ఉల్లంఘించేదని, సమాజాన్ని మళ్లీ రాతియుగంలోకి తీసుకుపోతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వం తగువిచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆమె మంత్రి గోపీనాథ్ ముండేకు విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనపై ప్రభుత్వ ఏం చర్య తీసుకుందో తమ కమిషన్‌కు తెలియజేయాలని రేఖాశర్మ కోరారు.

# వాయు నాణ్యత పరిరక్షణకు చర్యలు

- ❐ పర్యవేక్షక వ్యవస్థలను పెంచాలని నిర్ణయం
- ❐ పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారి వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: రోజురోజుకు వాయు కాలుష్యం పెరిగిపోతూ నాణ్యత పడిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2024 నాటికి దేశవ్యాప్తంగా మరో 300కు పైగా రియల్‌టైమ్ యాంబియెంట్ వాయు నాణ్యత పర్యవేక్షక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి కంటిన్యూస్ యాంబియెంట్ వాయు నాణ్యత పర్యవేక్షక వ్యవస్థల (సీఏఏక్యూఎంఎస్) గురించి వివరిస్తూ, దేశవ్యాప్తంగా 70 నగరాలలో ప్రస్తుతం 150 రియల్‌టైమ్, 731 మాన్యువల్ స్టేషన్లు ఉన్నాయని, వీటిలో 48 స్టేషన్లు ఒక్క దేశ రాజధాని ఢిల్లీలోనే ఉన్నాయని వెల్లడించారు. ఈ స్టేషన్లు వాయు నాణ్యతను ఖచ్చితంగా, సమీకృతంగా మదింపు వేస్తాయని ఆయన తెలిపారు. '2024 నాటికన్నా ముందే రియల్‌టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌లను 450కి, మాన్యువల్ స్టేషన్లను 1,500కు పెంచాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం' అని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు విభాగం డిప్యూటి కార్యదర్శి సత్యేంద్ర కుమార్ ఒక వార్తాసంస్థకు చెప్పారు. వాయు నాణ్యతను పర్యవేక్షించడంతో పాటు 2024 నాటికి 20నుంచి 30 శాతం వరకు కాలుష్యాన్ని తగ్గించడానికి ఇటీవల ప్రారంభించిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో భాగంగా కొన్ని స్టేషన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2017-18 నివేదిక ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో 28 సీఏఏక్యూఎంఎస్‌లు, ఇతర 57 నగరాలలో 86 రియల్‌టైమ్ సీఏఏక్యూఎంఎస్‌లు ఉన్నాయి. ఢిల్లీలో అదనంగా మరో 20 సీఏఏక్యూఎంఎస్‌లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది.

# ఇది కేంద్రం కుట్ర

**సీబీఐ చర్యపై మమత నిప్పులు ❐ కోల్‌కతా నడిబొడ్డున బైఠాయింపు**

కోల్‌కతా, ఫిబ్రవరి 3: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చిట్‌ఫండ్ స్కామ్‌లో రాష్ట్ర పోలీసు చీఫ్‌ను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు రావడం, వారిని రాష్ట్ర పోలీసులు నిర్బంధించిన నేపథ్యంలో ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మాట్లాడిన మమతా బెనర్జీ ఈ పరిణామం ఇటు రాజ్యాంగం, అటు సమాఖ్య స్ఫూర్తికే విఘాతకరమని మండిపడ్డారు. అనంతరం నగరం నడిబొడ్డున ఉన్న మెట్రో సినిమా వద్ద బైఠాయించిన మమత.. కేంద్ర చర్య రాష్ట్రానికే అవమానకరమని తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. ఇటు ప్రధాని మోదీ, అటు బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఎలాంటి సెర్చ్‌వారెంట్ లేకుండానే సీబీఐ అధికారులు కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ ఇంట్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని ఆమె అన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కేంద్ర పాలన విధించడమే లక్ష్యంగా మోదీ, అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 'నేను మరణించేందుకైనా సిద్ధం.. కానీ ఎవరికీ తలవంచను' అని స్పష్టం చేశారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించాలంటూ ఈ సందర్భంగా ఆమె నినదించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపిచ్చిన మమత, మోదీ సర్కార్ వైఖరిని ప్రతి ఒక్కరూ గర్హించి తీరాలన్నారు. గత నెల 19న ప్రతిపక్షాలన్నింటితో తాను కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించినప్పటి నుంచీ మోదీ, అమిత్ షా తనపై కత్తికట్టారని ఈ సందర్భంగా మమత స్పష్టం చేశారు. అప్పటినుంచీ ఏదో ఒక క్షణంలో సీబీఐ చేత దాడులు చేయిస్తారని తాము భావిస్తూనే ఉన్నామని అన్నారు. ఇదిలావుండగా ఈ మొత్తం వ్యవహారంపై సోమవారం మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడే అవకాశం కనిపిస్తోంది.



కోల్‌కతాలోని మెట్రో సినిమా ముందు బైఠాయింపు జరిపిన సీఎం మమతాబెనర్జీ

# రామ మందిర నిర్మాణానికి అడ్డు తగలొద్దు

- ❐ విపక్షాలను కోరిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా
- ❐ వివాద రహిత 66 ఎకరాల స్థలం ఇవ్వాలని కోర్టును కోరడం విప్లవాత్మక నిర్ణయం
- ❐ రైతులకు మేలు నగదు బదిలీ పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: అయోధ్య రామ జన్మభూమిలో వివాదస్పదం కాని 66 ఎకరాల స్థలం భూమి యజమానులకు ఇచ్చేందుకు వీలుగా కేంద్రం సుప్రీంకోర్టులో దావాను దాఖలు చేయడం విప్లవాత్మకమైన నిర్ణయమని బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా అన్నారు. రామమందిర నిర్మాణానికి ఎటువంటి ఆటంకాలు కలిగించవద్దని ఆయన విపక్ష పార్టీలను కోరారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జన్మభూమి స్థలంలోనే అద్భుతమైన ఆలయాన్ని నిర్మించాలని బీజేపీ భావిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై విపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. భూమి యాజమానులకు వివాదం కాని భూమిని తిరిగి ఇచ్చేయాలని కోర్టును కోరామని, ఇది చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. రామ జన్మభూమి న్యాస్ రామాలయం నిర్మించడానికి అంకితమైన సంస్థ అన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో ఆలయ నిర్మాణానికి అడ్డు తగలవద్దని రాజకీయ పార్టీలను కోరారు. కేంద్రం రైతులకు మేలు చేసేందుకు ఇన్‌పుట్ సబ్సిడీని ప్రకటించిందన్నారు. ఇది విప్లవాత్మకమైన నిర్ణయమన్నారు. దేశంలో 15 కోట్ల మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. దేశంలో అరవై శాతం మంది రైతులు రుణాలు తీసుకోవడం లేదన్నారు. రైతులబ్యాంకుల ఖాతాల్లో నేరుగా సొమ్మును జమచేయడం మంచి నిర్ణయమన్నారు. లోక్‌సభ ఎన్నికలతోనే మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయా అనే ప్రశ్నకు స్పందిస్తూ, రాష్ట్రప్రభుత్వాలు తీసుకునే నిర్ణయమన్నారు.



# బెంగాల్‌లో క్షీణించిన శాంతి భద్రతలు

**❐ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపణ**

**చిన్‌సురా (పశ్చిమ బెంగాల్):** పశ్చిమ బెంగాల్‌లో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొంటూ కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వ పనితీరుపై విరుచుకుపడ్డారు. మహాకూటమిని ఏర్పాటు చేయడంపై దృష్టి సారించిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇప్పుడు రాష్ట్రానికి చాలా తక్కువ సమయం కేటాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. హుగ్లీ జిల్లాలోని చిన్‌సురాలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీ' పేరిట నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలో గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ జరుగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని మెరుగు పరచవలసిన అవసరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రాష్ట్రంలో హక్కుల సంఘాల కార్యకర్తలు, ప్రతిపక్షాలతో పాటు పోలీసు స్టేషన్లపైనా దాడులు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో గత పంచాయతి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి బదులు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అణచివేత కొనసాగుతోందని ఆయన విమర్శించారు. బీజేపీయేతర ప్రతిపక్షాలతో ఏర్పాటు చేయతలపెట్టిన మహాకూటమికి ఒక దిశ లేదని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీని వ్యతిరేకించడమే ఈ పార్టీల ఏకైక ఉమ్మడి అజెండా అని ఆయన విమర్శించారు.


# వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బ్రెయిలీ ఓటర్ స్లిప్పులు

❐ అంధులకోసం ప్రత్యేక ఏర్పాట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చూపు కోల్పోయినవారు, అంధులకోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగానే బ్రెయిలీ లిపిలో ఓటర్ల స్లిప్పును అందజేయనున్నారు. చూపు కోల్పోయినవారు ప్రింటింగ్ అయిన విషయాన్ని చదువలేరు. అందుకోసం బ్రెయిలీ అంటే డాట్స్‌తో రూపొందించిన ప్రత్యేక లిపిని వేళ్లతో తడుముకుంటూ చదువగలుగుతారు అనే విషయం తెలిసిందే. అంధులకోసం బ్రెయిలీ లిపిలో ఫోటో ఐడెంటిటీ కార్డులు జారీ చేయాలని అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో అంధులకోసం బ్రెయిలీలో ఓటరు స్లిప్పును జారీ చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో సైతం బ్రెయిల్ ఫీచర్లు ఉన్నాయి. బ్రెయిలీ లిపిలో అభ్యర్థుల పేర్లు, వారి ఎన్నికల చిహ్నం ఉన్న పేపర్లను ఓటింగ్ మిషన్‌పై అంటిస్తారు. ఆ విధంగా అంధులు సైతం ఎవరి సహకారం లేకుండా సీక్రెట్ ఓటింగ్ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.

# అధికారం నుంచి మోదీని తప్పించాలి

❐ సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



కోల్‌కతాలో ఆదివారం జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

కోల్‌కతా, ఫిబ్రవరి 3: 'చౌకీదార్' పేరుతో దేశాన్ని లూటీ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని అధికారం నుంచి తప్పించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సీపీఎం పిలుపునిచ్చింది. దేశం లో మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ఏచూరి మాట్లాడారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని మార్చాల్సిందేనని, ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ విచ్ఛిన్నతికి దారితీస్తున్నాయని ఆయన అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి ప్రస్తావిస్తూ, తప్పుడు హామీలు గుప్పించినంత మాత్రాన వాటిని నమ్మి ప్రజలు మోసపోరని అన్నారు. పనిలో పనిగా రాష్ట్రంలోని అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ పైనా విమర్శలు గుప్పించారు. బీజేపీ, తృణమూల్ ఒక నాణేనికి రెండు ముఖాల వంటివని అన్నారు. రాష్ట్రంలో తృణమూల్‌ను, కేంద్రంలో బీజేపీని ఓడించి తీరాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## భాగవతోత్తములు సీతారామ శాస్త్రి కన్నుమూత



ధర్మపురి, ఫిబ్రవరి 3: పరమ భాగవతోత్తములు, కంచి పీఠ సన్మానితులు, సంస్కృతాంధ్ర భాషా పండితులు, పురాణ వాచస్పతి బిరుదాంచితులు, లబ్ధప్రతిష్ఠులైన పౌరాణికులు గుండి సీతారామ శాస్త్రి (60) శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్రం, ధర్మపురి క్షేత్రంలో ఆయన స్వగృహంలో కన్ను మూసారు. ధర్మపురి క్షేత్రస్థ సాంప్రదాయ సంస్కృత పాఠశాలలో, అనంతరం వేములవాడ రాజరాజేశ్వర సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. బాల్యం ఆధ్యాత్మిక కార్యాచరణులై, వేదవేదాంగ పురాణేతిహాలను లోతుగా అధ్యయనం గావించారు. బాల్యంలో తమ బంధువుల ఇంటికి తరుచూ వచ్చి పోయే డోంగ్రే మహరాజ్ ఆధ్యాత్మిక ప్రసంగాలకు ప్రభావితులై, నిత్య పురాణ పఠనాసక్తులైనారు. రానురాను తుది శ్వాస వదిలే వరకు నిత్య నిరంతర భాగవత పారాయణం చేస్తూనే ఉన్నారు. తొందొలుత ధర్మపురి క్షేత్రంలో భాగవత సప్తాహం నిర్వహించి, అప్పటి నుండి ప్రతి ఏడూ భాద్రపద ప్రథమార్థంలో భాగవత పురాణ సప్తాహం వందలాది సాంప్రదాయ శ్రోతల సమక్షాన నిర్వహిస్తూ వస్తున్నారు. దేవీ భాగవతం, గరుడ పురాణం, కార్తీక పురాణం, శ్రీమద్భాగవతం పలు ప్రదేశాలలో పురాణ ప్రవచాలు గావించారు. శౌనకాది మహామునులకు సూత పౌరాణికులు ప్రవచించిన స్థలమైన నైమిశారణ్యంలో, హరిద్వార్‌లో, శుకఫలిలో, ప్రధానంగా ముంబైలో అనాకానేక సప్తాహాలు నిర్వహించారు. కంచి పరమాచార్య స్వహస్తాలతో స్వర్ణకంకణ సన్మానితులైనారు. ద్వాదశ స్కంద సహిత 333 అధ్యాయాలు, 18వేల శ్లోకాలతో కూడిన భాగవతాన్ని గ్రంథస్థంగానే కుకుండా కళ్ళుమూసుకుని తన్మయులై, గ్రంథం చూడకుండా సుమధుర వ్యాఖ్యానాలతో చెప్పే పద్ధతి పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్రశేఖర శాస్త్రి, శృంగేరీ సంస్థానాధీశులు, చిన జీయర్ స్వామి, చాగంటి కోటేశ్వర్‌రావు లాంటి ప్రముఖులు ప్రశంసలకు పాత్రమైంది. అవిభక్త తెలుగు రాష్ట్రంలోనే గాక, ఇతర ప్రాంతాలలోనూ సీతారామ శాస్త్రికి శిష్యగణం ఉంది. దేవస్థానంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు తదితర కార్యక్రమాలలో శాస్త్రి ఆధ్యాత్మిక అంశాల వివరణలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. శాస్త్రి అకాల మృతితో ధర్మపురి క్షేత్రం శోకసంద్రంలో మునిగి పోయింది.

**శాస్త్రి లేని లోటు పూడ్చలేనిది**

ధర్మపురి క్షేత్రానికి చెందిన బహుముఖ ప్రజ్ఞులు గుండి సీతారామ శాస్త్రి మరణం ధర్మపురి క్షేత్రానికి తీరని లోటని పలువురు అన్నారు. బహుముఖీయ ప్రతిభతో ఆయన అందించిన సేవలు ప్రాత:స్మరణీయాలని, ఆయన మృతి తీరని లోటని అన్నారు. ఆదివారం శాస్త్రి అంతిమ యాత్రలో ఆబాల గోపాలం పాల్గొని, కన్నీటితో కడసారి వీడ్కోలు పలికారు. జ్యోతిష్కులుగా, వేదపండితులుగా, పౌరాణీకులుగా, యాజ్ఞికునిగా, భగవదుపాసకులుగా, పురాణ ప్రవచకునిగా, సన్మానితులై, బహుముఖ సేవలందించిన శాస్త్రి మరణం తీరని లోటని పలువురు కంట తడి పెట్టారు.



# అద్భుత క్షేత్రంగా యాదాద్రి

## వెయ్యేళ్లు చిరస్థాయిగా నిలిచేలా తీర్చిదిద్దుతాం

- తరాల మధ్య సంస్కృతి, సంప్రదాయానికి ఆలయాలే వారధులు
- ఆలస్యమైనా అనుకున్న రీతిలో వచ్చేదాకా నిర్మాణ పనులు
- తొందరపడటానికి ఇవి ప్రభుత్వ కార్యాలయాలు కావు
- సహస్ర కుండాత్మక హోమంతో ఆలయ ప్రతిష్ఠ
- పక్షం రోజుల్లో మళ్లీ వస్తా.. ఇక నెలకు రెండు, మూడుసార్లు సందర్శన
- యాదాద్రి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎం కేసీఆర్

**ఆంధ్రభూమి బ్యూరో**

నల్లగొండ/యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 3: తరాల మధ్య సంస్కృతి, సంప్రదాయ వారసత్వానికి ఆలయాలు వారధి వంటివని, ప్రపంచంలో యూనిక్ టెంపుల్‌గా శిల్పకళాద్భుతంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణం జరుగుతుందని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. ఆలయ నిర్మాణం ఆలస్యమైనా అనుకున్న రీతిలో సంతృప్తికరంగా ఆలయ నిర్మాణం జరిగేదాకా పనులు కొనసాగిస్తామని ప్రకటించారు. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా యాదాద్రి ఆలయాన్ని సందర్శించిన సీఎం కేసీఆర్ ముందుగా హెలికాప్టర్ నుండి యాదాద్రి అభివృద్ధి పనులపై ఏరియల్ పరిశీలన చేశారు. వడాయిగూడెం హెలిపాడ్ నుండి కొండపైకి చేరుకున్న సీఎం కేసీఆర్ బాల ఆలయంలో లక్ష్మీనరసింహులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో గీత, ప్రధానార్చకులు నందిగల్ లక్ష్మీనరసింహాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలనంతరం అర్చక బృందం సీఎం కేసీఆర్‌కు ఆశీర్వచనం అందించారు. అనంతరం యాదాద్రి ఆలయ పరిశీలనకు వెళ్లిన సీఎం కేసీఆర్ గర్భగుడిలోని స్వయంభూ పంచ నారసింహులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానాలయం నిర్మాణ పనులను, సప్త రాజగోపురాలు, మాడవీధులు, ప్రాకారాలు, ఆంజనేయస్వామి ఆలయం, అష్టభుజ మండపం, నూతన శివాలయం, వ్రతమండపం, విష్ణు పుష్కరిణి, ప్రసాద విక్రయ నిర్మాణాలను పరిశీలించారు. సీఎం కేసీఆర్‌కు ఆర్కిటెక్ట్ ఆనందసాయి, స్థపతులు సుందర్‌రాజన్, వేలు, ఈవో గీత, వైటీడీఏ వైస్ చైర్మన్ జి.కిషన్‌రావులు ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. అనంతరం కొండ దిగువన పెద్దగుట్టపై టెంపుల్ సిటీ నిర్మాణ పనులను, ప్రెసిడెన్షియల్ సూట్స్ నిర్మాణాలను సీఎం కేసీఆర్ పరిశీలించారు. తిరిగి కొండపైకి చేరుకున్న సీఎం కేసీఆర్ మరోసారి కొండపైన ప్రధానాలయంతో పాటు వివిధ నిర్మాణాలను పరిశీలించి వైటీడీఏ అధికారులకు పలు సూచనలు చేశారు. దాదాపు ఆరుగంటల పాటు యాదాద్రి ప్రధానాలయం, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎం కేసీఆర్ అనంతరం పెద్దగుట్ట వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

యాదాద్రి ఆలయ నిర్మాణ పనులకు కాలపరిమితి లేదని, పూర్తిగా కృష్ణశిలలతో అద్భుత శిల్పకళతో సప్త రాజగోపురాలు అష్టభుజ ప్రాకార మండపాలతో నిర్మితమవుతున్నందున నిర్మాణం ఆలస్యమవుతోందని పనుల్లో వేగం పెంచేందుకు శిల్పులను ఒత్తిడి పెట్టబోమన్నారు. ఎట్లా జరగాలో ఎట్లా కట్టాలో అలాగే తీర్చిదిద్దుతారని, ఇవి ప్రభుత్వ కార్యాలయాలు కాదని, వేయ్యేళ్లు ఉండే కట్టడమని, పనుల్లో పరుగెత్తాల్సిన అవసరం లేదని, తాను అలా నిర్మించదలుచుకోలేదని అన్నారు. ఎక్కడైతే పనుల్లో వేగం పెంచే అవకాశముందో అక్కడ పనుల్లో వేగం పెంచాలన్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి సూచనల మేరకు ఆలయ నిర్మాణ పనులు సవ్యంగానే సాగుతున్నాయని ఆలయం పూర్తయ్యాక చూస్తే గొప్ప దివ్యానుభూతి చెందుతారన్నారు. మరో 15 రోజుల్లో తాను మరోసారి యాదాద్రి వస్తానని, ఇకమీదట నెలకు రెండుమూడుసార్లు వచ్చి ఆలయ అభివృద్ధి పనులు సమీక్షిస్తానన్నారు.



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

**సహస్ర కుండాత్మక హోమంతో ఆలయ ప్రతిష్ఠాపన**

యాదాద్రి ఆలయ పునర్ నిర్మాణం (ఆలయ ప్రతిష్ట)ను త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో స్వయంగా నా పర్యవేక్షణలో సహస్ర కుండాత్మక హోమం 1008 హోమగుండాలతో నిర్వహిస్తామన్నారు. బద్రినాథ్‌తో పాటు దేశంలోని వైష్ణవ రుత్విక్‌లు హాజరవుతారని, ఇప్పటికే 133 దేశాల వైష్ణవ మత ప్రతినిధులు తరలివస్తామని చెప్పారని, ఐదువేల మంది రుత్విక్‌లు ఏకకాలంలో వేద పఠనం చేస్తారని వారి సహాయకులే పది పన్నెండు వేల మంది ఉంటారన్నారు. ఆ సమయంలో ఐదు పదిహేను లక్షల మంది భక్తులు యాదాద్రి వస్తారన్నారు. ప్రధానమంత్రి, రాష్ట్రపతులను సైతం ఆలయ ప్రతిష్టాపనకు ఆహ్వానిస్తామన్నారు. యాదాద్రికి వచ్చే భక్తులు కుటుంబాలతో గడిపేందుకు బస్వాపురం వద్ద 250ఎకరాల్లో స్టార్ హోటల్స్, కన్వెన్షన్ సెంటర్లు, బోటింగ్, థియేటర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. యాదాద్రి, భువనగిరి ఖిల్లా, కొలనుపాక జైన దేవాలయం, బస్వాపురం అన్ని ఒక టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. యాదాద్రి చుట్టూ ఆరులైన్ల రింగ్‌రోడ్డుకు భూసేకరణ, నిర్మాణ నిధులు విడుదల చేశామని, రెండునెలల్లో పూర్తిచేసేలా చూస్తామన్నారు. ప్రెసిడెన్షియల్ సూట్స్‌ను సెప్టెంబర్‌లో పూర్తయ్యేలా చూస్తామని, ఆలయం ప్రతిష్టాపనోత్సవానికి ప్రధానమంత్రి, రాష్ట్రపతి రానున్నందున అతిథుల కోసం సూట్స్‌ను అందుబాటులో ఉంచేలా నిర్మాణాలు జరిపిస్తామన్నారు. కేసీఆర్ వెంట ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రి జి.జగదీష్‌రెడ్డి, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిషోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎ.కృష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్‌లు ఉన్నారు.

## మరో 250 ఎకరాల్లో భక్తులకు క్వార్టర్లు

యాదాద్రి గొప్ప మహిమాన్విత సనాతన పుణ్యక్షేత్రమని, సమైక్యాంధ్ర పాలనలో పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిందని మన దేవుళ్లు దేవుళ్లు కాకుండా పోయారని తాను ఉద్యమకాలంలోనే చెప్పానని కేసీఆర్ పేర్కొన్నారు. యాదాద్రి మాదిరిగానే అష్టాదశ శక్తిపీఠాల్లోని జోగులాంబ శక్తీపీఠం ఆలయాన్ని కూడా నిర్లక్ష్యం చేశారని, తాను కృష్ణా పుష్కరాల్లో ఘాట్ ఏర్పాటు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేసి స్వయంగా తాను అక్కడే పుష్కర స్నానం చేశాక ఇప్పుడు వేలాది మంది భక్తుల రద్దీ పెరిగిందన్నారు. యాదాద్రి నూతన ఆలయంతో పాటు నూతన శివాలయం నిర్మాణం కూడా అద్భుతంగా సాగుతుందన్నారు. కొండ కింద 143 ఎకరాలకు తోడు మరో 30 ఎకరాలను ఆలయ ఉత్తర భాగంలో భూసేకరణ చేసేందుకు 70 కోట్లు విడుదల చేశామన్నారు. గండిచెరువు పరిధిలోని 30 ఎకరాల్లోని ఈ సదరు స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించేందుకు చెరువు అభివృద్ధి జరుగుతుందన్నారు. జూన్ మాసంలో కాళేశ్వరం నీళ్లు గంధమల్ల, బస్వాపురం రిజర్వాయర్‌లకు చేరుతాయని గండి చెరువుకు గోదావరి నీళ్లు అందిస్తామన్నారు. శని, ఆదివారాల్లో యాదాద్రికి 80వేల మంది వరకు వస్తున్నారని, ఆలయం ఒక తరానికి మరో తరానికి సంస్కృతి, సంప్రదాయాన్ని వారసత్వంగా అందించే వారధి సంస్థయని, కల్చరల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సెంటరని, కమ్యూనిటీ సెంటరని, నాస్తికులు ఆలయాలపై చేసే పిచ్చిపిచ్చి విమర్శలు సరికాదన్నారు. పుష్పాకృతిలో 1100 ఎకరాల్లో నిర్మితమైన టెంపుల్ సిటీకి మరో 250 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. టెంపుల్ సిటీలో 250 ఎకరాల లేఅవుట్‌లో 350 భక్తుల క్వార్టర్స్‌ను 25లక్షల నుండి 2 కోట్లతో వివిధ స్థాయిల్లో దాతల సహకారంతో నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే 2 కోట్ల చొప్పున 48 క్వార్టర్స్ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చారని త్వరలో నిర్మాణ విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు. అన్నదాన సత్రానికి ఆనందరాజ్ సంస్థ 10 కోట్ల విరాళం ఇచ్చారన్నారు. కొండ దిగువన 143 ఎకరాల్లో బస్టాండ్, క్యూకాంప్లెక్స్, అన్నదాన సత్రం, షాపింగ్ కాంప్లెక్స్ పోను 50ఎకరాల్లో ప్రవచన మండపం, లక్ష రెండులక్షల మంది కూర్చునేలా కల్యాణ మండపం నిర్మిస్తామన్నారు.

1వ పేజీ తరువాయి

## చారిత్రాత్మకం.. చిరస్మరణీయం

అమరావతి తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. బౌద్ధ స్తూపాకారంలో హైకోర్టు భవనం నిర్మిస్తున్నామన్నారు. వయాడక్ట్ ఫార్ములాతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దుబాయ్, సింగపూర్‌లో సముద్రంలో భవనాలు నిర్మిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని పర్యాటకానికి దోహదపడే అంశాల్లో న్యాయ వివాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నల్సార్ వర్సిటీని అమరావతిలో ఏర్పాటు చేయాలని కోరారు. హైకోర్టు జ్యుడీషియల్ సిబ్బంది పదవీ విరమణ వయసును 60 సంవత్సరాలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉచిత వసతి, రవాణా సదుపాయాలను కల్పిస్తామన్నారు. న్యాయ నగరానికి అవసరమైన వాతావరణం కల్పించడంలో సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ మాట్లాడుతూ పవిత్ర కృష్ణా తరంగాల సవ్వడిలో, తెలుగు సంస్కృతి పవనాల వీచికతో పరవశించే ఈ నేలపై రాజధానితో పాటు హైకోర్టు నిర్మాణం కావడం చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. అమరావతి నేల నుండే ప్రేమ, కరుణ, మానవతావాద విలువలను చాటిన బౌద్ధమతం విలసిల్లిందన్నారు. శాతావాహనులు పాలించిన ఈ గడ్డపైనే తెలుగుజాతి రాజధాని నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ గడ్డ నూతన రాష్ట్ర నూతన పాలనకు కేంద్రం కావడం, ఈ బృహత్తర పరిణామంలో భాగస్వాములు కావడం మన అదృష్టమన్నారు. 2వేల ఏళ్ల ఘన చరిత్ర కలిగిన అమరావతికి, కొత్త అధ్యాయానికి మనం రచయితలం కావడం గర్వకారమన్నారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల త్యాగాన్ని గుర్తుపెట్టుకోవాల్సి ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు, రైతులే రాజధాని నిర్మాణంలో కీలకమని, చరిత్ర నిర్మాతలన్నారు. ప్రస్తుతం పరీక్షా సమయంలో ఉన్నామని, సంధికాలంలో ఉన్నామని న్యాయవాదులకు వివరించారు. న్యాయవ్యవస్థ దేశంలో అనేకసార్లు అనేక పరిస్థితులను ఎదుర్కొందన్నారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నపుడు మరింత ఉత్సాహంగా వ్యవహరించి, న్యాయవ్యవస్థ మరింత శక్తిమంతమైందన్నారు. మరింత తేజోవంతంగా దేశానికి సేవలందించి తప్పితే బలహీన పడలేదన్నారు. ఇటీవలి కాలంలో మానవ సంబంధాలు, రాజ్యాంగంలోని వివిధ అంశాల మధ్య అధికారం కోసం పెరిగిపోతున్న ఆరాటం వంటివి కలసి న్యాయవ్యవస్థపై ముప్పేట దాడి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కొన్ని విమర్శలకు గురైనా ఉత్సాహంతో పనిచేస్తున్నామన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా న్యాయవ్యవస్థ నిరంతర ప్రయాణం కొనసాగించింది, కొనసాగిస్తుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసంతో ప్రజలు మనవైపు కాపు కాస్తున్నారన్నారు. ప్రతి ప్రజాస్వామ్యానికి ఇలాంటివి సహజమేనన్నారు. ఇలాంటి సందర్భాల్లో వ్యక్తుల భావోద్వేగాలు వ్యవస్థకు దోహదం చేయకపోవడం విచారకరమన్నారు. ఎన్నో సమస్యలను దీటుగా ఎదుర్కొన్నామన్నారు. న్యాయవ్యవస్థలోని లోపాలను భూతద్దంలో చూపించి ఆక్షేపించడాన్ని ఎదుర్కొన్నామన్నారు. ఇదే స్ఫూర్తితో న్యాయవాదులు, న్యాయమూర్తులు కృషి చేస్తారని నమ్ముతున్నానన్నారు. ఏపీలో హైకోర్టు ఏర్పాటుకు సాక్షీభూతులమని, కొత్తలో కొన్ని సమస్యలు ఉంటాయన్నారు. తెలుగువారు ఓర్పుకు, సహనానికి పేరుపడిన వాళ్లమన్నారు. అందరూ సహకరిస్తే త్వరలోనే అద్భుతమైన భవన నిర్మాణం జరుగుతుందని ఆశిస్తున్నానన్నారు. ధర్మసంస్థాపన ఒక్కరోజులోనే జరగదన్నారు. కాలానుగుణంగా న్యాయ ప్రక్రియలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని వ్యవస్థ ఔన్నత్యానికి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వసుధైక కుటుంబం అనేదానికి తెలుగువారు ప్రతీకలన్నారు. తెలుగుభాష తియ్యందనానికి, తెలుగు సంస్కృతి గొప్పదనానికి వారసులమని, అందులో శక్తిమంతమైన న్యాయవ్యవస్థ భాగస్వామ్యం కావాలన్నారు. తెలుగువారి ధీశక్తి, క్రియాశక్తి నలుదిశలా విస్తరించాలని, తెలుగుతనం జయించాలని, కోట్లాది తెలుగుజాతి హర్షించాలన్నారు. తెలుగువాడి తెలివితేటలకు జైజై.. తెలుగువాడు దేనికైనా సైసై.. తెలుగువాడికి సాటి నైనై.. అంటూ తన ప్రసంగాన్ని జస్టిస్ రమణ ముగించారు.

## పెండింగ్ కేసులు 3కోట్లు

భావిస్తున్నామన్నారు. హైకోర్టు జడ్జీలకు సంబంధించి 392 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో 270 పోస్టుల భర్తీకి రాష్ట్ర హైకోర్టులు ఇంకా సిఫారుసు చేయలేదన్నారు. సుప్రీంకోర్టు పరిధిలోని 130 పోస్టుల్లో 100 పోస్టులను మరో మూడువారాల్లో భర్తీ చేస్తామని, మరో 14 పోస్టులు కేంద్రం పరిధిలో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు దీనిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. పెండింగ్ కేసులు, జడ్జిల కొరత ప్రజలకు సత్వర న్యాయం అందించలేక పోవటం, న్యాయ వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయన్నారు. దీన్ని కూడా ఓ అవకాశంగా మలచుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. భారీ భవంతులున్నా, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించినా సత్వర న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. అన్యాయానికి గురై ఆశగా ఎదురుచూస్తున్న వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రగతిశీల ఆలోచనలు, పరిసరాలు కూడా సత్వర న్యాయం అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. కోర్టు భవనం అంటే ఇటుకలే కాదని, న్యాయ వ్యవస్థకు చిహ్నంగా గుర్తించాలన్నారు. ఏపీలో హైకోర్టు భవనానికి శంకుస్థాపన, కోర్టు కాంప్లెక్సు భవనం నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. హైకోర్టు అధికారులకు, రాష్ట్ర ప్రజలకు వేగంగా కోర్టు భవనం నిర్మించడంపై అభినందనలు తెలిపారు. కొత్త రాష్ట్రంలో న్యాయ వ్యవస్థకు వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. రాజ్యాంగ పరమైన విధిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చక్కగా నిర్వర్తించారన్నారు. క్రిమినల్ కోర్టు అయినా, సివిల్ కోర్టు అయినా అది నిర్దిష్ట లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తుందని ఆయన చెప్పారు. న్యాయమూర్తులు తీర్పులు ఇవ్వడంలో వ్యక్తిగత భావోద్వేగాలకు గురికాకూడదని సూచించారు. రాజ్యాంగ విలువలకు లోబడి తీర్పులు చెప్పాలన్నారు. న్యాయ వ్యవస్థ విలువలు కాపాడంతో బార్ సభ్యుల పాత్ర కీలకమన్నారు. కొత్త కోర్టు విధానాల నిర్వహణ, తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. హైకోర్టు భవనాలను రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ప్రకటించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎల్ నాగేశ్వరరావు, ఆర్ సుభాష్ రెడ్డి, ఏపీ హైకోర్టు యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి సి ప్రవీణ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధాకృష్ణన్ ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఇతర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర వెలుగు

టెక్నాలజీ, అంతర్జాతీయ ఉత్తమ విధానాలను గుర్తించి రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు అధికారులతో ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరాను సుస్థిర, శాశ్వత సంక్షేమ పథకంగా కొనసాగించేందుకు అత్యుత్తమ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని, దీన్ని ఎంబీసీలకూ అమలు చేయనున్నామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఐదు అంశాలే ప్రాధాన్యంగా ఈ అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేసినట్లు ఇంధన, ఐ అండ్ ఐ, ఏపీ సీఆర్డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ముఖ్యమంత్రికి తెలిపారు. 2018-19 నాటికి 10వేల మెగావాట్లు ఉన్న హరిత ఇంధన సామర్థ్యాన్ని 2021-22 కల్లా 18వేల మెగావాట్లకు చేర్చడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. హరిత ఇంధన కారిడార్ల ప్రాజెక్టుల్లో భాగంగా రూ. 1816 కోట్ల అంచనా వ్యయంతో 3వేల మెగావాట్ల సౌర విద్యుత్, 1000 మెగావాట్ల పవన్ విద్యుత్ తరలించే సామర్థ్యంతో పునరుత్పాదక ఇంధన తరలింపు పథకాన్ని రూపొందిస్తున్నట్లు ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కే విజయానంద్ తెలిపారు. టెలికాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, ప్రత్యేక కార్యదర్శి జీ సాయిప్రసాద్, విద్యుత్ శాఖ సలహాదారు కే రంగనాథం, ట్రాన్స్‌కో జేఎండీ దినేశ్ పరుచూరి, తదితరులు పాల్గొన్నారు.

## ..ఏం జరుగుతోంది?

అధినేత రాహుల్‌గాంధీని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఢిల్లీలో కలిసి చర్చలు జరిపారు. ఆ తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్ చాందీ ప్రకటించారు. దీంతో సీనియర్ నేతలు భగ్గుమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పొత్తుల వ్యవహారంలో ఆచితూచి స్పందించాలన్న సీనియర్ నేతల సూచనను ఇటు రాష్ట్ర పార్టీ బాధ్యులు, అటు కేంద్ర పార్టీ బాధ్యులెవరూ పట్టించుకోలేదని వారు మండిపడుతున్నారు. గత ఆరు నెలలుగా రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ కలిసి పని చేస్తాయన్న సంకేతాల నడుమ పార్టీ కార్యకర్తల్లో మనోబలం నింపుతూ వచ్చామని, ఇప్పుడు ఒంటరిగా పోటీ అంటే రానున్న ఎన్నికల తరువాత పరోక్షంగా కూడా అధికారంలో కొనసాగలేమన్న భావన కార్యకర్తలో ఏర్పడిందని సీనియర్ నాయకులు పేర్కొంటున్నారు. పొత్తుల వ్యవహారంలో తమను సంప్రదించి తమ సూచనలు పాటించి ఉంటే ఇప్పుడు కార్యకర్తల్లో ఆందోళన రేకెత్తేది కాదని వారు పేర్కొంటున్నారు. వారి సహాయం లేకుండా తాము ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యం కాదని కూడా స్పష్టం చేస్తున్నారు. దీంతో ఇక కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యం అనక తప్పడం లేదని వెల్లడిస్తున్నారు. పొత్తుల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ప్రకటించిన తరువాత మొదట కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి స్పందిస్తూ సీనియర్లకు గౌరవం లేదని ఒంటెత్తు పోకడల కారణంగా పార్టీ మరింత బలహీనమైందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో కార్యకర్తల మాటకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగడం సాధ్యం కాదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. దాంతో ఆయన త్వరలో పార్టీ మారనున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. తాజాగా మరో కేంద్ర మాజీ మంత్రి శతృచర్ల విజయరామరాజు సైతం కోట్ల వ్యక్తీకరించిన అభిప్రాయాలనే పేర్కొంటూ పార్టీని వీడటం గమనార్హం. ఆయన తరువాత మరో ఇద్దరు కేంద్ర మాజీ మంత్రులు కూడా పార్టీని వీడటానికి సిద్ధపడుతున్నారని స్పష్టమవుతోంది. వీరిలో ఒక మాజీ మంత్రి భర్త ఇప్పటికే వైసీపీతో చర్చలు జరిపి ఆ పార్టీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని వార్తలు వస్తున్నాయి. మరో కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్‌ను వీడిన తరువాత వైసీపీ, టీడీపీలో ఏ పార్టీలో చేరితే భవిష్యత్తు ఉంటుందన్న అంశంపై ఇంకా స్పష్టమైన అభిప్రాయానికి రాలేదని తెలుస్తోంది. కాగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వస్తున్న కేంద్ర మాజీ మంత్రులతో పార్టీ అధినేత రాహుల్‌గాంధీ కుటుంబానికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పార్టీ నుంచి ఎవరు బయటకు పోయినా వీరు బయటకు వెళ్లరన్న విశ్వాసం ఆ పార్టీ నేతల్లో ఉండేది. అలాంటి వారిలో కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి, శతృచర్ల విజయరామరాజు బయటకు రావడం, మరో ఇద్దరు కేంద్ర మాజీ మంత్రులు సైతం పార్టీని వీడేందుకు సిద్ధం కావడం వెనుక పార్టీ వ్యూహాత్మక అడుగులు ఉన్నాయన్న అనుమానాలు సైతం వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఓట్ల చీలిక కోసం కాంగ్రెస్ పార్టీ ఒంటరి పోరుకు సిద్ధమైందని వీరికి జనసేన పార్టీ కూడా తోడు కానుందన్న వైసీపీ విమర్శల నడుమ కేంద్ర మాజీ మంత్రులు ఒకరొకరుగా కాంగ్రెస్‌ను వీడుతుండటం వెనుక రాహుల్, చంద్రబాబుల రాజకీయ ఎత్తుగడ దాగి ఉందన్న సందేహాలు విశ్లేషకుల్లోనూ వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ప్రచారం జరుగుతున్నట్లుగా మరో ఇద్దరు కేంద్ర మాజీ మంత్రులు కాంగ్రెస్‌ను వీడితే ఇరు పార్టీల ఎత్తుగడ ఏంటన్నది స్పష్టత వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

## ..రైతు రుణాల మాఫీ

సొమ్మును తస్కరించే విధంగా ఉందన్నారు. ఈ సొమ్ముతో ధనవంతుల జేబులను నింపుతున్నారన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు అనేక రాయితీలు ఇస్తామని, నిరుద్యోగాన్ని తగ్గిస్తామన్నారు. మధ్యప్రదేశ్,రాజస్థాన్, హర్యానాలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ అమలు చేసిందన్నారు. ఆదివారం ఇక్కడ గాంధీ మైదాన్‌లో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని రక్షకుడిగా ఉండాల్సింది పోయి దొంగలా తయారయ్యారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో హరిత విప్లవం సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే తమ పార్టీ రైతులకు, వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ప్రక్రియను చేపట్టామన్నారు. ప్రతి వ్యక్తి అకౌంట్‌లో రూ.15 లక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీని ప్రధాని మోదీ నిలబెట్టుకోలేకపోయారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మిత్రపక్షాలతో పొత్తుపెట్టుకుని అధికారంలోకి వచ్చేందుకు కసరత్తు ప్రారంభమైందని, తమ సన్నాహాలకు ప్రజల మద్దతు విశేషంగా ఉందన్నారు. బిహార్ శాంతి భూమి అని, ఈ రోజు ఇక్కడ శాంతి భద్రతలు అడుగంటాయని, ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. రాఫెల్ ఫైటర్ జెట్స్ కొనుగోళ్ల కేసులో కేంద్రం అవినీతికి పాల్పడిందని, సమాధానం చెప్పకుండా ప్రధాని తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. బిహార్‌కు ఇచ్చినహామీలను మోదీ తుంగలో తొక్కారన్నారు. ఈ సదస్సులో మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్, చత్తీస్‌గడ్ సీఎం భూపేష్‌బాగేల్, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ తదితరులున్నారు.


## సీబీఐ బృందం నిర్బంధం

వెళ్లారన్నారు. పోలీసు కమిషనర్ ఇంటికి వెళ్లిన సీబీఐ అధికారులను సెంట్రీ పోలీసులు నిలిపివేశారు. ఈలోగా స్థానిక పోలీసులు కమిషనర్ ఇంటికి చేరుకున్నారు. అక్కడ కొంతమంది సీబీఐ అధికారులను తీసుకుని షేక్‌స్పియర్ శరాణీ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారిని బలవంతంగా ఎత్తుకుని జీపుల్లో తీసుకుని పోలీసులు వెళ్లారు. ఎన్నికల సంఘం అధికారుల సమావేశానికి కూడా రాజీవ్ కుమార్ రాలేదని సీబీఐ అధికారులు తెలిపారు. కోల్‌కతా పోలీసులు మాత్రం కమిషనర్ రాజీవ్ కుమార్ రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నారని తెలిపారు.

# క్రీడాభూమి

# కుర్రాళ్లు కుమ్మేశారు!

- నెరవేరిన ఐదు దశాబ్దాల కల
- చివరి వన్డేలో భారత్ విజయం
- రాణించిన మిడిలార్డర్
- ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ 4-1తో కైవశం




బ్యాటింగ్‌లో రాణించిన అంబటి రాయుడు (90), హార్దిక్ పాండ్య (45)

వెల్లింగ్టన్, ఫిబ్రవరి 3: టాప్ ఆర్డర్ 18 పరుగులకే కుప్పకూలింది! సీనియర్లంతా సింగిల్ డిజిట్‌కే పెవిలియన్‌కు క్యూ కట్టారు! అంతా అయిపోయింది..! నాలుగో వన్డే కంటే తక్కువ స్కోరుకే భారత్ ఆలౌట్ అవుతుందనుకున్నారంతా! టీవీ చూస్తున్న వారు వెంటనే ఆఫ్ చేసి మ్యాచ్ గురించే మరిపోయారు! 'ఎలాగు సిరీస్ గెలిచాం.. మ్యాచ్ ఓడినా ఫర్వాలేదు'లే అంటూ సర్దిచెప్పుకున్నారు! కానీ.. ఎవరి ఊహకు అందని విధంగా కీలక సమయంలో భారత మిడిలార్డర్ రాణించింది! నెమ్మదిగా ఆడుతూనే ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించింది! చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ జట్టుకు గౌరవ ప్రదమైన స్కోరును అందించింది! విజయంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా.. ఐదు దశాబ్దాల కలను నెరవేర్చింది. దీంతో టీమిండియా న్యూజిలాండ్ గడ్డపై 52 ఏళ్ల తర్వాత మొదటిసారి ఐదు మ్యాచ్‌ల వన్డేల సిరీస్‌ను 4-1తో గెలుచుకుంది.

వెస్ట్‌ప్యాక్ మైదానంలో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 35 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. 18 పరుగులకే కెప్టెన్ రోహిత్ శర్మ (2). శిఖర్ ధావన్ (6), శుభ్‌మాన్‌గిల్ (7), ఎంఎస్ ధోనీ (1) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. మరోవైపు హైదరాబాదీ ఆటగాడు అంబటి రాయుడు జట్టు బాధ్యతను భుజాన వేసుకున్నాడు. తమిళనాడు ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌తో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ నెమ్మదిగా ఆడుతూనే క్రీజులో పాతుకుపోయారు. చెత్త బంతులను బౌండరీలకు తరలించారు. ఈ క్రమంలోనే రాయుడు అర్ధ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. మరోవైపు గత మ్యాచ్‌లో ఆకట్టుకున్న విజయ్ శంకర్ (45) కివీస్ బౌలర్లపై విరుచుకుపడప్డాడు. ఈ క్రమంలోనే రనౌట్ అవుటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కేదార్ జాదవ్‌తో జతకట్టిన రాయుడు (90) త్రుటిలో సెంచరీని చేసే అవకాశాన్ని కోల్పోయాడు. మాట్ హెన్రీ బౌలింగ్‌లో కొలిన్ మున్రోకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అప్పటికీ భారత్ ఆరు వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసింది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్ పాండ్య వచ్చి రావడంతోనే కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. దీంతో మళ్లీ బంతిని అందుకున్న మాట్ హెన్రీ కేదార్ జాదవ్ (34) బౌల్డ్ చేశాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా హార్దిక్ పాండ్య (45) చెలరేగాడు. హార్దిక్ సాధించిన పరుగుల్లో ఐదు సిక్స్‌లు, 2 బౌండరీలుండడం విశేషం. మంచి ఊపులో హార్దిక్ నీషమ్ బౌలింగ్‌లో బౌల్ట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన భువనేశ్వర్ కుమార్ (6), మహమ్మద్ షమీ (10), యుజువేంద్ర చాహల్ (0, నాటౌట్) వెనువెంటనే అవుట్ కావడంతో భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ బౌలర్లలో మాట్ హెన్రీ 4, ట్రెంట్ బౌల్ట్ 3, జేమ్స్ నీషమ్ ఒక వికెట్ తీసుకున్నారు.

253 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కివీస్‌ను షమీ దెబ్బతీశాడు. 18 పరుగుల వద్ద హెన్రీ నికోలస్ (8)ని అవుట్ చేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ విలియమ్సన్‌తో కలిసి మరో ఓపెనర్ కొలిన్ మున్రో ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మున్రో (24)ని కూడా షమీ బౌల్డ్ చేసి పెవిలియన్‌కు పంపాడు. ఈ క్రమంలో కెప్టెన్‌తో జతకట్టిన రాస్ టేలర్ (1)ని పాండ్యా ఎల్‌బీగా అవుట్ చేశాడు. మరోవైపు టామ్ లాథమ్‌తో కలిసి విలియమ్సన్ (39) జట్టును 100 పరుగులు దాటించాడు. అయితే 25.4 ఓవర్‌లో కేదార్ జాదవ్ వేసిన బంతిని ఆడబోయి ధావన్ చేతికి చిక్కాడు. 105 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న జట్టును టామ్ లాథమ్ (37), జేమ్స్ నీషమ్ (44) ఆదుకునే ప్రయత్నం చేసినా లాథమ్‌ని చాహల్ పెవిలియన్‌కు పంపగా, నీషమ్ ధోని చేసిన అద్భుత రనౌట్‌కు క్రీజు వదిలాడు. ఆ తర్వాత వచ్చిన కొలిన్ డీగ్రాండ్ హోం (11), మిచెట్ సాంత్నార్ (22), టాడ్ అస్టిల్ (10), మాట్ హెన్రీ (17) నాటౌట్, ట్రెంట్ బౌల్ట్ (1) పోరాడం ప్రయత్నం చేసినా 44.1 ఓవర్లలోనే 217 పరుగులకు కివీస్ కుప్పకూలింది. దీంతో భారత్ 35 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత బౌలర్లలో యుజువేంద్ర చాహల్ 3, మహమ్మద్ షమీ, హార్దిక్ పాండ్యా తలా 2, భువనేశ్వర్ కుమార్, కేదార్ జాదవ్‌కు తలో వికెట్ దక్కింది. దీంతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ 4-1తో గెలుచుకుంది.



వన్డే సిరీస్‌తో టీమిండియా జట్టు సభ్యులు

### స్కోరు బోర్డు..

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (బీ) మాట్ హెన్రీ 2; శిఖర్ ధావన్ (సీ) మాట్ హెన్రీ (బీ) బౌల్ట్ 6; శుభ్‌మాన్ గిల్ (సీ) సాంత్నార్ (బీ) మాట్ హెన్రీ 7; అంబటి రాయుడు (సీ) మున్రో (బీ) మాట్ హెన్రీ 90; ఎంఎస్ ధోనీ (బీ) బౌల్ట్ 1; విజయ్ శంకర్ (నీషమ్/మున్రో) రనౌట్ 45; కేదార్ జాదవ్ (బీ) మాట్ హెన్రీ 34; హార్దిక్ పాండ్య (సీ) బౌల్ట్ (బీ) నీషమ్ 45; భువనేశ్వర్ కుమార్ (సీ) రాస్ టేలర్ (బీ) బౌల్ట్ 6; మహమ్మద్ షమీ (బౌల్ట్) రనౌట్ 1; యుజువేంద్ర చాహల్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు** : 15, **మొత్తం:** 252 (49.5 ఓవర్లలో ఆలౌట్)

**వికెట్ల పతనం:** 1-8, 2-12, 3-17, 4-18, 5-116, 6-190, 7-203, 8- 248, 9- 252, 10- 252.

**బౌలింగ్:** మాట్ హెన్రీ 10-1-35-4, ట్రెంట్ బౌల్ట్ 9.5-2-39-3, జేమ్స్ నీషమ్ 5-0-33-1, కొలిన్ డీ గ్రాండ్ హోం 7-0-33-0, కొలిన్ మున్రో 10-0-47-0, మిచెల్ సాంత్నార్ 3-0-18-0, టాడ్ ఆస్ట్లే 5-0-35-0.

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** కొలిన్ మున్రో (బీ) షమీ 24, హెన్రీ నికోలస్ (సీ) కేదార్ జాదవ్ (బీ) షమీ 8; కేన్ విలియమ్సన్ (సీ) ధావన్ (బీ) కేదార్ జాదవ్ 39; రాస్ టేలర్ (ఎల్‌బీ) హార్దిక్ పాండ్యా 1; టామ్ లాథమ్ (ఎల్‌బీ) చాహల్ 44; కొలిన్ డీ గ్రాండ్ హోం (ఎల్‌బీ) చాహల్ 11; మిచెల్ సాంత్నార్ (సీ) షమీ 9బీ) హార్దిక్ పాండ్యా 22; టాడ్ ఆస్ట్లే (ఎల్‌బీ) చాహల్ 10; మాట్ హెన్రీ (నాటౌట్) 17; ట్రెంట్ బౌల్ట్ (సీ) షమీ (బీ) భువనేశ్వర్ 1; **ఎక్స్‌ట్రాలు** : 3, **మొత్తం:** 217 (44.1 ఓవర్లలో ఆలౌట్)

**వికెట్ల పతనం:** 1-18, 2-37, 3-38, 4-105, 5-119, 6-135, 7-176, 8-194, 9-204, 10- 217.

**బౌలింగ్:** భువనేశ్వర్ కుమార్ 7.1-0-38-1, మహమ్మద్ షమీ 8-0-35-2, హార్దిక్ పాండ్యా 8-1-50-2, విజయ్ శంకర్ 4-0-19-0, యుజువేంద్ర చాహల్ 10-0-41-3, కేదార్ జాదవ్ 7-0-34-1.

## ఒత్తిడితోనే ఓడాం : విలియమ్సన్



ఐదో వన్డేలో భారత్ మా ముందుంచిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మా ఆటగాళ్లు ఒత్తిడికి గురవడంతోనే ఓడిపోయామని న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అన్నాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం విలియమ్సన్ మీడియాతో మాట్లాడుతూ భారత్ ఇక్కడి పిచ్‌పై చేయాల్సినదాని కంటే ఎక్కువ పరుగులే చేసింది. దీంతో ఒత్తిడికి గురయ్యాం. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత టాప్ ఆర్డర్‌ను 20లోపే పెవిలియన్‌కు పంపినా, రాయుడు రాణించడంతో వారు విజయం సాధించగలిగారు.

## కోహ్లీ సేన ఎక్కడైనా గెలవగలదు

- దిగ్గజ క్రికెటర్ సచిన్ తెండూల్కర్



కోల్‌కతా, ఫిబ్రవరి 3: ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఫేవరెట్ అనడంలో తనకు సందేహం లేదని మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెండూల్కర్ అన్నారు. కోహ్లీ సేనకు ప్రపంచంలో ఏ దేశంలోనైనా పోటీపడే గెలిచే సామర్థ్యం ఉందని కొనియాడారు. దక్షిణాఫ్రికా (5-1), ఆస్ట్రేలియా (2-1), న్యూజిలాండ్ (4-1)పై భారత్ ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లను కైవసం చేసుకున్న విషయాన్ని సచిన్ ఈ సందర్భంగా గుర్తుచేశాడు. క్రీడల్లో మహిళలు దేశానికి పేరు తీసుకొస్తున్నారన్నాడు. స్వప్న బర్మన్, ద్యుతి చంద్, మిమదాస్ మహిళల సాధికారతకు నిలువుటద్దాలని కొనియాడాడు. కాగా ఇటీవల ప్రదర్శనలు చూస్తే ప్రస్తుత భారత జట్టు ప్రపంచకప్‌లో ఫేవరేట్ అని, కప్ సాధించే అర్హత ఉందని పునరుద్ఘటించాడు.

---

## ఐడీబీఐలో వాటాల తగ్గింపునకు ఎల్ఐసీకి కాలపరిమితేమీ లేదు

- ఐఆర్‌డీఏఐ చైర్మన్ సుభాష్ కుంతియా స్పష్టీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 3: ఐడీబీఐ బ్యాంక్‌లో అత్యధిక శాతం వాటాలు కలిగివున్న ఎల్ఐసీ ఇప్పటికిప్పుడే అందులో 15 శాతం వాటాను తగ్గించుకునేందుకు ఎలాంటి కాలపరిమితి విధించలేదని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) తెలిపింది. ఈ విషయాన్ని ఐఆర్‌డీఏఐ చైర్మన్ సుభాష్ కుంతియా తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఐడీబీఐలో 51 శాతం వాటాలు కలిగిన ఉన్న ఇన్సూరెన్స్ దిగ్గజం కష్టాల్లో మునిగితేలుతున్న ఐడీబీఐ సంస్థ వ్యాపార కార్యకలాపాలు కొనసాగేందుకు వీలుగా 15 శాతం వాటా తగ్గించుకోవాలని సూచించినట్టు ఆయన పేర్కొన్నారు. 'ఐడీబీఐలో కొంత వాటాను తగ్గించుకోవాలని ఎల్ఐసీని కోరాం. అప్పుల ఊబిలో ఉన్న ఆ సంస్థ ఆర్థిక పరిస్థితిని గమనంలోకి తీసుకుని ఎల్ఐసీకి ఈమేరకు అనుమతి ఇచ్చాం. అందుకు అనుగుణంగా ఎల్ఐసీ 15 శాతం వాటా తగ్గించుకునేందుకు అంగీకరించింది' అని ఐఆర్‌డీఏ చైర్మన్ పీటీఐ ప్రతినిధికి తెలిపారు. ఐడీబీఐలో వాటాలు కలిగిన ఇన్సూరెన్స్ సంస్థకు ప్రస్తుతం 15 శాతం మాత్రమే వెనుకకు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. వాస్తవానికి ప్రభుత్వ ఆధీనంలో ఎక్కువ శాతం వాటా కలిగివున్న ఎల్ఐసీ వంటి సంస్థకు అంతకంటే ఎక్కువ వాటా వెనుకకు తీసుకునేందుకు తగిన పరిమితులు ఉన్నాయని ఆయన అన్నారు. గత ఏడాది జూన్‌లో ఐడీబీఐలో ఎల్ఐసీ 51శాతం వాటాలను సంపాదించింది. జనవరి 21 నాటికి ఐడీబీఐ రూ.5,030 కోట్లు ఎల్ఐసీ నుంచి అందుకుంది. అదేవిధంగా ఐడీబీఐని కొంత మేరకు టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో గతేడాది డిసెంబర్ 28 నాటికి ఎల్ఐసీ 14,500 కోట్ల రూపాయలు ఐడీబీఐకి అందజేసింది. 'ఐడీబీఐ నుంచి వాటాను తగ్గించుకోవడానికి ఎల్ఐసీకి ఇప్పటివరకు ఎలాంటి కాలపరిమితి విధించలేదు. ఇందుకు ఎంత సమయం పడుతుందో ఇప్పుడే చెప్పలేం. వారి వ్యాపార కార్యకలాపాలకు అనుగుణంగా వాటాల తగ్గింపుపై నిర్ణయం తీసుకోగలం' అని ఐఆర్‌డీఏ చైర్మన్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ సంస్థ కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీల వాటాలను 15 శాతం పెంచుకునేందుకు అనుమతి ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.


## వేలాది చర్మ సంబంధిత మందులు వెనక్కి

- లూపిన్ నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: చర్మ సంబంధానికి చెందిన వివిధ రకాల 24వేల బాటిళ్లు కలిగిన మందులను అమెరికా, ప్యూయర్టో రికో నుంచి వెనుకకు రప్పించారు. ప్రసిద్ధ మందుల తయారీ సంస్థ లూపిన్ వేలాది ఫ్లూయోసినోలోన్ ఎక్సటోనైడ్ అనే మందుల రకాలను వెనుక్కు రప్పించింది. యూఎస్‌ఎఫ్‌డీఏ అందించిన నివేదిక ప్రకారం..లూపిన్ సోమెర్‌సెట్ ఫ్లూయెసినోలోన్ ఎక్సటోనైడ్ అనే 60 మిల్లీలీటర్లు గల 0.01 యూఎస్‌పీ టాపికల్ సొల్యూషన్ కలిగిన మందులు 24,180 బాటిళ్లను యూఎస్‌లోని లూపిన్ ఫార్మాస్యూటికల్‌లోని నోవెల్ లేబోరేటరీ నుంచి వెనుక్కు రప్పించింది. నాణ్యత పాటించకపోవడం, నిర్దేశించిన ప్రమాణాలు లేకపోవడం వంటి కారణాలతో పాటు వాటిని ఉపయోగించే వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో సదరు మందులను వెనుక్కు రప్పించినట్టు తెలుస్తోంది.

## ఉద్యోగావకాశాలు పెరిగాయ్

- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూయార్క్, ఫిబ్రవరి 3: ఎన్డీఏ సర్కారు హయాంలో 'ఉద్యోగాలు లేని ఆర్థికాభివృద్ధి' నమోదైందంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తిప్పికొట్టారు. నిజానికి కేంద్రం అమలు చేసిన పలు పథకాలతో ఉద్యోగావకాశాలు పెరిగాయని అన్నారు. అనారోగ్య కారణంగా ప్రస్తుతం అమెరికాలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జైట్లీ ఆదివారం పీటీఐతో మాట్లాడుతూ, తన స్థానంలో పీయూష్ గోయల్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఉద్యోగ కల్పనపై ఎలాంటి సమాచారం లేదని వచ్చిన విమర్శలను కూడా తోసిపుచ్చారు. సాధారణ బడ్జెట్‌కు, మధ్యంతర బడ్జెట్‌కు చాలా తేడా ఉంటుందని వ్యాఖ్యానించారు. గత ఐదేళ్ల కాలంలో, దేశంలో ఎక్కడా నిరుద్యోగులు భారీ ధర్నాలుగానీ, నిరసన కార్యక్రమాలుగానీ చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఉద్యోగావకాశాలు పెరగకపోతే తప్పనిసరిగా నిరసన వ్యక్తమయ్యేదన్నారు. అలాంటి పరిస్థితి తలెత్తకపోవడం ఉద్యోగావకాశాలు పెరిగిన విషయాన్ని స్పష్టం చేయడం లేదా? అని ప్రశ్నించారు. గతంలో నిరుద్యోగ సమస్యపై భారీ ఉద్యమాలు జరిగాయని, గత ఐదేళ్ల కాలంలో అలాంటి సంఘటన ఒకటి కూడా లేదని వ్యాఖ్యానించారు. సాధారణంగా సార్వత్రిక ఎన్నికలు జరిగే ఏడాదిలో, రాబోయే ఫలితాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు ముందుగానే ఊహిస్తాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీనీ, బీజేపీనీ సమర్థంగా ఎదుర్కోలేమని తెలుసుకున్న ప్రతిపక్ష పార్టీలన్నీ తమ ఉనికి కోసం ఏకమవుతున్నాయని జైట్లీ ధ్వజమెత్తారు. నిజానికి గత ఐదేళ్ల కాలంలో, దేశంలో ఉత్పాదకత గణనీయంగా పెరిగిందన్నారు. అధికార గణాంకాలను పరిశీలిస్తే, గత 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగావకాశాలు పెరిగిన విషయం స్పష్టమవుతుందన్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత కూడా స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) ఏ విధంగా పెరిగిందని కొంత మంది ప్రశ్నిస్తున్నారని అన్నారు. డీమానిటైజేషన్ అమల్లోకి వచ్చిన మరుక్షణం నుంచే జీడీపీ పెరుగుతుందని తాను చెప్తునే ఉన్నానన్నారు. నిజానికి ఏ దేశంలోనూ పెద్ద నోట్ల రద్దు తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు లేదా ఆర్థికాభివృద్ధికి సంబంధించిన గణాంకాలు లేవని అన్నారు. అందుకే, ఒక మాజీ ప్రధాని (మన్మోహన్ సింగ్) జీడీపీలో రెండు శాతం పతనం నమోదవుతుందని అనుమానం వ్యక్తం చేస్తే, ప్రతిపక్ష పార్టీలన్నీ ఆ మాటలే వల్లెవేస్తున్నాయని విమర్శించారు. యుగాంతం గురించి ఎవరైనా ప్రవక్త చెప్తే ఏ విధంగా నమ్ముతారో, మన్మోహన్ సింగ్ ఆలోచనలను కూడా ప్రతిపక్ష పార్టీలు అదే విధంగా నమ్ముతున్నాయని ఎద్దేవా చేశారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశంలోని 86 శాతం నగదు రిజర్వ్ బ్యాంక్‌కు చేరిందన్నారు. కేంద్రం చేపడుతున్న చర్యలన్నీ భారత ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు, వృద్ధిరేటు పెరుగుదలకు ఉపయోగపడుతున్నదని జైట్లీ అన్నారు. పలు ఆర్థిక పరమైన నిర్ణయాలు అద్భుత ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. తత్ఫలితంగా ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.

## రూ.5,300 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ

- ఎన్నికల నేపథ్యంలో వేచిచూసే ధోరణిలో మదుపరులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఈ ఏడాది లోక్‌సభకు జరుగనున్న ఎన్నికల ప్రభావం భారత కేపిటల్ మార్కెట్లపై ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)పై అప్పుడే ప్రభావం చూపారు. ఈ ఏడాది జనవరి ముగింపు నాటికి విదేశీ మదుపరులు రూ.5,300 కోట్లను ఉపసంహరించుకున్నారు. అంతకు ముందు గతేడాది డిసెంబర్‌లో కేపిటల్ మార్కెట్లలో రూ.17,000 కోట్ల పెట్టుబడులు పెట్టిన విదేశీ మదుపరులు అంతకుముందు అక్టోబర్‌లో ఏకంగా రూ.38,900 కోట్ల పెట్టుబడులు పెట్టారు. భారతీయ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టినవారి సమగ్ర డేటా ప్రకారం ఈ ఏడాది జనవరిలో ఎఫ్‌పీఐలు సగటున రూ.5,264 కోట్లు ఈక్విటీల నుంచి, రూ.97 కోట్లను రుణ సంస్థల నుంచి వెనుకకు తీసుకోవడంతో ఎఫ్‌పీల ఉపసంహరణ మొత్తం రూ.4,361 కోట్ల వరకు చేరుకుంది. భారత్‌లో రానున్న కొద్ది మాసాల్లో సాధారణ ఎన్నికలు జరుగనున్నాయి. పెట్టుబడులపై రానున్న రోజుల్లో ఎలాంటి ప్రభావం చూపనుందోనన్న ప్రమాద ఘంటికల నేపథ్యంలో విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు అని జియోజిట్ ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. భారత్‌లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల ప్రభావంతో వచ్చిన సంకేతాలతో వేచిచూసే ధోరణితో పాటు వారు తమ నిర్ణయాన్ని తెలియజేసినట్టు మోర్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్, సీనియర్ అనలిస్ట్ మనేజర్ రీసెర్చ్ హిమాంశు శ్రీవాస్తవ పేర్కొన్నారు. విదేశీ మదుపరులు తీసుకున్న ఈ అసాధారణ నిర్ణయం రానున్న సాధారణ ఎన్నికలతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుదలపై ప్రభావం చూపవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా ముడిచమురు ధరల్లో హెచ్చుతగ్గుదల, డాలర్‌తో రూపాయి విలువ బలహీనపడడం, ప్రపంచ వాణిజ్యంలో ఎదురవుతున్న ఆటుపోట్లు విదేశీ మదుపరులు తమ పెట్టుబడులు ఉపసంహరించుకునేందుకు దోహదం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే ప్రభావం మరికొంత కాలం వరకు కొనసాగే అవకాశం కూడా లేకపోలేదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

# వాణిజ్యభూమి



## మార్కెట్ పయనం ఎటు?

- మధ్యంతర బడ్జెట్ ప్రభావం ఎంత?

ముంబయి, ఫిబ్రవరి 3: స్టాక్ మార్కెట్ వచ్చే వారం ఏ విధంగా ఉంటుంది, ఏ దిశగా అడుగులు వేస్తుందనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. గత వారం మార్కెట్ కుదుటపడిన లక్షణాలు కనిపించినప్పటికీ, అదే పరిస్థితి ఎంత వరకూ స్థిరపడుతుందనేది అనుమానంగానే ఉంది. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు ప్రపంచ మార్కెట్లతోపాటు భారత్ స్టాక్ మార్కెట్‌ను కూడా ఏ దిశలో నడిపిస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం అమెరికాలో వైద్య సేవలు పొందుతున్న అరుణ్ జైట్లీ స్థానంలో లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఎన్నో పథకాలను, కీలక నిర్ణయాలను ప్రకటించారు. అయితే, రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను సిద్ధం చేయడంతో, నిరర్థక ఆస్తులు పెరుగుతాయని, జాతీయోత్పత్తికి దోహద పడే అంశాలు తగ్గుతాయని నిపుణుల అభిప్రాయం. ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నిల ఫలితాలు, రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పలు సంక్షేమ పథకాలను ప్రకటించిన కారణంగా తలెత్తే బడ్జెట్ లోటు స్టాక్ మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. మరోవైపురైతులకు ధన రూపేణా చెల్లింపులు చేస్తామంటూ మధ్యంతర బడ్జెట్ ద్వారా కేంద్రం ప్రకటించింది. దీంతో, రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా కేంద్రం క్లిష్టతర చర్యలతో పరిస్థితిని గందరగోళంలోకి నెడుతున్నదని, నిర్దిష్ట ప్రణాళికా లక్ష్యాలకు తిలోదకాలిస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో 3.5 శాతం తేడా వచ్చే అవకాశాలున్నాయని పీయూష్ గోయల్ తమ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 3.3 శాతంగా ఉండవచ్చని చెప్పారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మధ్యంతర బడ్జెట్‌ను రూపొందించడంతో, ప్రధాన లక్ష్యాలకు మరోసారి నీళ్లొదిలారని అటు ప్రతిపక్ష పార్టీల నేతలు, ఇటు ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రత్యేకించి తెలంగాణ ప్రభుత్వ తరహాలో రైతులకు నగదు రూపేణా లబ్ధిచేకూర్చే అంశాన్ని, అలాగే పన్ను మినహాయింపులను కల్పించే విషయాన్ని మోదీ ప్రభుత్వం పరిశీలించడమేగాక, నేరుగా మధ్యంతర బడ్జెట్‌లోనే ఈ అంశాలను చేర్చించింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల దృష్టిని ఆకట్టుకునే విషయాలపైనే బడ్జెట్ అంచనాలు కేంద్రీకృతమయ్యాయని అంటున్నారు. ప్రత్యేకించి ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ప్రధాన రాష్ట్రాల్లో నియంత్రణ కోల్పోవడంతో కేంద్ర సర్కారు ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందనే వాదన వినిపిస్తున్నది. దీంతో మార్చి నాటికి ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో సుమారు 3.5 శాతం తేడా వచ్చే అవకాశం ఉందని, ఇది గతంలో సర్కారు వేసిన అంచనా 3.3 శాతం కన్నా అధికమవుతుంది. రైతులకు నేరుగా ఆర్థిక లబ్ధి చేకూర్చాలన్న ప్రణాళికలు దేశ ఆర్థిక లోటుకు మరిన్ని సవాళ్లు విసిరే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది. సమీప భవిష్యత్తులో ప్రభుత్వం తన ఆర్థిక వనరులు పెంచుకునే అవకాశాలు తగ్గే ప్రమాదం కనిపిస్తున్నది. నిజానికి ఎన్డీఏ సర్కారు 2017లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపింది. ప్రత్యేకించి పలు సంస్కరణలకు తెరలేపి పన్ను విధానంలో లోటుపాట్లు, బ్యాంకుల్లో అవినీతిని అరికట్టేందుకు పలు చర్యలు చేపట్టింది. అయితే, ఇవి అప్పటికప్పుడు సత్ఫలితాలను ఇచ్చే అంశాలు కావు. దీర్ఘకాలంలో దేశ ఆర్థిక రంగానికి విస్తృత ప్రయోజనాలు చేకూర్చేలా వున్నాయనడంలో ఎలాంటి అనుమానం లేదు.


జమ్మూకాశ్మీర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

# ఉగ్రవాదం వెన్ను విరిచాం

❖ సర్జికల్ స్ట్రైక్స్‌తో మా వైఖరి ప్రపంచానికి చాటిచెప్పాం
❖ ప్రధాని నరేంద్ర మోదీ

శ్రీనగర్, ఫిబ్రవరి 3: పాకిస్తాన్ ఆధీన రేఖను దాటి తాము జరిపిన సర్జికల్ స్ట్రైక్ (మెరుపుదాడులు)తో ఉగ్రవాదంపై భారతదేశం అనుసరిస్తున్న కొత్త నీతి, రీతిని ప్రపంచానికి తెలియజేసిందని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఉగ్రవాదులపై పోరాటం చేస్తూ కన్నుమూసిన నజార్ అహ్మద్ వాని, జమ్మూకాశ్మీర్‌కు చెందిన ఔరంగజేబు తదితరులకు ఆదివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన నివాళి అర్పించారు. ఇతరుల కలలు, ఆశయాలను చంపేవారు పెద్ద పిరికివాళ్లని, ప్రజల కలల సాకారానికి పోరాడే వారు నిజమైన హీరోలని ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తూ అమాయక యువతను పొట్టనబెట్టుకున్న ప్రతి ఉగ్రవాదికి తగు విధంగా సమాధానం చెబుతామని ఆయన చెప్పారు. జమ్మూకాశ్మీర్‌లోని ప్రతి యువకుడికి తాను హామీ ఇస్తున్నానని, ప్రతి టెర్రరిస్టుకు తగువిధంగా బుద్ధి చెబుతామని ప్రధాని మోదీ అన్నారు. రాష్ట్రంలో ఉగ్రవాదుల వెన్ను విరిచామని అన్నారు. నిరాయుధులైన కాశ్మీర్ యువతను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తూ వారిని పొట్టనబెట్టుకుంటున్న ఉగ్ర మూకలపై యావత్ భారతదేశం చాలా కోపంగా ఉందని అన్నారు. దేశం కలలను సాకారం చేసేందుకు యువత పాటుపాడుతుండగా వారిని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పాక్ ఆధీన రేఖ వద్ద తాము జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ ఉగ్రవాదంపై తాము అనుసరించే నూతన పంథాని ప్రపంచానికి తెలియజేసిందని, ఇదే తమ కొత్త విధానం, కొత్త సంప్రదాయం అని ఆయన వ్యాఖ్యానించారు. శాంతియుత, అభివృద్ధి కాశ్మీర్‌ను చూడాలన్న దివంగత ప్రధాని వాజపేయి ఆశయం మేరకు ఈ రాష్ట్రంలో అందరితో కలిసి.. అందరి సంక్షేమం నినాదంతో ముందుకు పోతున్నామని అన్నారు. ఆయన కలలను సాకారం చేయడానికి చేపట్టాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ఏడువేల కోట్లతో చేపట్టబోయే వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే బండిపూర్‌లో ఒక బీపీఓ కేంద్రాన్ని ప్రారంభించారు. కాశ్మీరీ యువతకు ఉపాధి కల్పనకు ఈ కేంద్రం దోహదం చేస్తుందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. అంతకుముందు ఆయన శ్రీనగర్ నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో ముచ్చటించారు. లక్షలాది కోట్ల రూపాయలు విదేశీ విద్యాసంస్థలకు తరలిపోతున్నాయని, దానిని అరికట్టడానికి భారత్‌కు చెందిన విద్యాసంస్థలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని ఆయన ఈ సందర్భంగా వారికి హామీనిచ్చారు. అలాగే దేశంలో పేదరికాన్ని నిర్మూలించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే దీనికి మనందరం కలిసికట్టుగా ఉండాల్సిన అవసరం ఉందని నమ్ముతున్నట్టు ఆయన చెప్పారు. టూరిజం పరిశ్రమ రోజురోజుకు అభివృద్ధి చెందుతోందని, మనదేశాన్ని సందర్శించిన విదేశీయుల సంఖ్య 75 లక్షల నుంచి కోటికి పెరిగిందని, అయితే టూరిస్టుల పట్ల ప్రజల వైఖరి మారాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు.

# విద్యార్థులందరినీ త్వరలోనే కలుస్తాం

## అమెరికాలో భారత రాయబారి శ్రింగ్లా



వాషింగ్టన్ డీసీ, ఫిబ్రవరి 3: అక్రమ వీసాలతో అమెరికాలో ప్రవేశించారనే అభియోగాలపై అరెస్టయిన భారతీయ విద్యార్థుల విషయంలో భారత ప్రభుత్వ ఒత్తిడి ఫలించిందని అమెరికాలోని భారత రాయబారి హర్షవర్ధన్ శ్రింగ్లా ఆదివారం ఇక్కడ తెలిపారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు సోమవారం నాటికి అరెస్టయిన విద్యార్థులలో దాదాపు అందరిని కలుసుకుంటారని ఆయన ధ్రువీకరించారు. 'మిచిగాన్‌లోని ఫార్మింగ్‌టన్ హిల్స్‌లో గల యూనివర్శిటి ఆఫ్ ఫార్మింగ్‌టన్ నకిలీ యూనివర్శిటి కేసులో చాలా మంది భారతీయ విద్యార్థులు ఇరుక్కోవడం మమ్మల్ని ఆవేదనకు, బాధకు గురిచేస్తోంది. మా విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడానికి మేము చాలా వేగంగా కదిలి పని చేస్తున్నాం' అని శ్రింగ్లా ఒక వార్తాసంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ చెప్పారు. 'అమెరికా అధికారులు నిర్బంధించిన భారతీయ విద్యార్థులలో మెజారిటీ విద్యార్థులను త్వరలోనే కలుస్తాం లేదా కలవడానికి షెడ్యూలు ఖరారు అవుతుంది' అని ఆయన తెలిపారు.

### విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బంది కలగొద్దు

అమెరికాలో నిర్బంధానికి గురైన భారతీయ విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలి, వారి భవిష్యత్తుకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు విదేశీ వ్యవహారాల శాఖకు సూచించారు. అమెరికాలో అరెస్టయిన భారతీయ విద్యార్థులకు ఎలాంటి సమస్య రాకుండా చూసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడాలని ఉప రాష్ట్రపతి సెక్రటేరియట్ అధికారులను ఆదేశించారు. అధికారులు ఆదివారం విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో చర్చలు జరిపారు. అమెరికాలో హోంలాండ్ అధికారులు అరెస్టు చేసిన విద్యార్థులకు న్యాయం జరిగేలా చూసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది అడిగి తెలుసుకున్నారు. భారత విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బంది రాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని వెంకయ్య నాయుడు విదేశీ వ్యవహారాల శాఖకు స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన అన్ని విషయాలను భారత ప్రభుత్వం చాలా జాగ్రత్తగా గమనిస్తోంది.. ఇప్పటికీ నిర్బంధంలో ఉన్న వారిలో 30 మంది విద్యార్థులను స్థానిక భారత కౌన్సిలర్ అధికారులు కలిశారనీ, మిగిలినవారితో మాట్లాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు ఉప రాష్ట్రపతి కార్యాలయానికి తెలియజేశారు. నిర్బంధంలో ఉన్న విద్యార్థులకు సంబంధించిన సమాచారం, ఇతర వివరాలు అందించేందుకు 24/7 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయటం జరిగిందని, నిర్బంధంలో ఉన్న విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులకు కూడా న్యాయ సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు ఉపరాష్ట్రపతికి తెలియజేశారు. మోసం చేసిన రిక్రూటర్లను, మోసపోయిన విద్యార్థులను వేరువేరుగా చూడాలని కోరాం.. విద్యార్థుల వివరాలు తెలుసుకుని ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు ఉప రాష్ట్రపతి కార్యాలయానికి తెలియజేశారు.

# హామీలను అమలు చేయకపోతే.. పద్మభూషణ్‌ను తిరిగిచ్చేస్తా

❖ సామాజిక కార్యకర్త అన్నా హజారే హెచ్చరిక ❖ ఐదో రోజుకు ఆమరణ దీక్ష
❖ లోక్‌పాల్ ఏర్పాటు చేసే వరకూ విరమించే ప్రసక్తి లేదని ఉద్ఘాటన



రాలేగావ్ సిద్ధీ (మహారాష్ట్ర), ఫిబ్రవరి 3: ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారాన్ని తిరిగి ఇచ్చేస్తానని సామాజిక కార్యకర్త అన్నా హజారే ఆదివారం నాడు ఇక్కడ మోదీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రానున్న కొన్ని రోజుల్లోనే లోక్‌పాల్, లోకాయుక్తపై ఇచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టుకోవాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్రం విఫలమయితే పద్మభూషణ్‌ను తిరిగి ఇచ్చేస్తానని ఆయన తెగేసి చెప్పారు. అవినీతి నిర్మూలనకు జాతీయ స్థాయిలో లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త అన్నా హజారే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ఐదవ రోజుకు చేరుకుంది. అన్నా హజారే దీక్షకు మద్దతుగా పరిసర గ్రామాల్లోని రైతులు, ఇతర వర్గాల ప్రజలు జాతీయ రహదారిపై రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అహ్మద్‌నగర్-పుణె జాతీయరహదారిపై ప్రజలు పెద్ద ఎత్తున చేరి అన్నా హజారే ఆమరణదీక్షకు మద్దతు ప్రకటించారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లోనే లోకాయుక్తలను ఏర్పాటు చేశారు. ఈ లోకాయుక్తలను ఏర్పాటు చేయని రాష్ట్రాల్లో కూడా వీటిని నెలకొల్పాలని అన్నాహజారే మద్దతు దారులు కేంద్రాన్ని కోరారు. దీని కోసం రాష్ట్రాలపై వత్తిడి తేవాలన్నారు. ఆందోళన కారుల వల్ల ఆరు కి.మీ మేర రోడ్డుపై వాహనాలను నిలిచిపోయాయని సుపా పోలీసు స్టేషన్ సీఐ రాజేంద్ర భోంస్లే చెప్పారు. ఈ సందర్భంగా 110 మంది ప్రదర్శనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత ఐదు రోజులుగా నిరాహారదీక్ష చేయడం వల్ల అన్నా హజారే 3.8 కిలోల బరువుతగ్గినట్లు వైద్యులు చెప్పారు. సోమవారం అహ్మద్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఐదు వేల మంది రైతులు, ప్రజలు అన్నాహజారే పోరాటానికి సంఘీభావం తెలుపుతూ నిరసన తెలియచేయనున్నారు. రాలేగావ్ సిద్ధీ గ్రామంలో ఆదివారం రైతుల సభ జరిగింది. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్సీపీ అధికార ప్రతినిధి నవాబ్ మాలిక్ తమ నేతపై తప్పుడు అభియోగాలు మోపడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా శాంతియుతంగా ఉండాలని, ఎటువంటి ఆందోళనలు చేయవద్దని అన్నాహజారే అనుచరులను కోరారు. అంతకు ముందు అన్నా హజారేను కలుసుకునేందుకు వచ్చిన రాష్ట్ర మంత్రి గిరీష్ మహజన్‌ను కలుసుకునేందుకు హజారే నిరాకరించారు. అంతకు ముందు అన్నాహజారే విలేఖర్లతో మాట్లాడుతూ మహారాష్ట్రలో సీఎంవో కార్యాలయాన్ని కూడా లోకాయుక్త చట్టం పరిధిలోకి తెస్తూ చట్టం తేవడాన్ని అభినందించారు. ఇది మంచి పరిణామమన్నారు. కాగా కేంద్రం తన డిమాండ్లకు తలొగ్గి లోక్‌పాల్ ఏర్పాటు చేసేవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ఉన్నత స్థానంలో రాజకీయాధికారాన్ని చలాయించే నేతలు, ఉన్నతాధికారులపై వచ్చే అభియోగాలపై లోక్‌పాల్ దర్యాప్తు చేస్తుంది. ఈ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా అన్నా హజారే డిమండ్ చేస్తున్నారు.

# కొలిక్కి వస్తున్న జయరాం కేసు విచారణ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫార్మా కంపెనీల అధినేత చిరుగుపాటి జయరాం హత్య కేసులో కృష్ణా జిల్లా నందిగామ పోలీసుల విచారణ ఓ కొలిక్కి వచ్చింది. సోమవారం నాటికి పూర్తి వివరాలు అందిస్తామని, అప్పటివరకు తామేమీ చెప్పలేమని కృష్ణా ఎస్పీ సర్వేశ్రేష్ఠ త్రిపాఠి చెబుతున్నారు. నందిగామ పోలీసులు హైదరాబాద్ వెళ్లి అమెరికా నుంచి అక్కడికి చేరుకున్న జయరాం సతీమణి పద్మశ్రీ వాంగ్మూలం నమోదు చేశారు. అయితే తాను మొదటి నుంచి అమెరికాకే పరిమితమైనందున అసలు ఇక్కడ ఏమిజరిగిందో తనకేమీ తెలియదని ఆమె చెప్పినట్లు తెలిసింది. ఇక్కడ ప్రాణరక్షణ లేనందున అమెరికాకు తిరిగి వెళ్లేందుకు తాను సిద్ధమౌతున్నానన్నారు. ఇక వీరి వ్యాపార లావాదేవీలను ఎవరు చూడాల్సివస్తుందో వేచిచూడాల్సి ఉంది. పోస్టుమార్టంలో తెలిసిన ప్రాథమిక ఆధారాలను బట్టి కుక్కలను చంపటానికి వినియోగించే మందుతో నమ్మకంగా జయరాంపై విషప్రయోగం చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేస్తున్నారు. ఒక బృందం హైదరాబాద్‌లో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.



# వెంటాడుతున్న బ్రెగ్జిట్ భయం

అల్లర్లు జరిగితే ఇంగ్లాండ్ రాణి దంపతులను సురక్షితంగా తరలింపు?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలిగే పక్షంలో ఇంగ్లాండ్‌లో అల్లర్లు చెలరేగితే బ్రిటన్ రాజకుటుంబం భద్రతకు, క్షేమంగా తరలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఒప్పందం ప్రకారమైతే, వచ్చే నెల 29వ తేదీన బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలి. దీనినే బ్రెగ్జిట్ అంటారు. ఇప్పటికే బ్రెగ్జిట్‌పై బ్రిటన్ ప్రభుత్వంలో అనిశ్చితి నెలకొంది. ప్రచ్ఛన్నయుద్ధకాలంలో కూడా సోవియట్ నుంచి దాడి ఎదురైతే, బ్రిటన్ రాజకుటుంబాన్ని క్షేమంగా తరలించడంపై ప్రణాళిక ఖరారైనట్లు ఒక మీడియా కథనం వెలువడింది. సండే టైమ్స్ పత్రిక ఈ కథనాలను ప్రచురించింది. బ్రెగ్జిట్ డెడ్‌లైన్‌లోగా యూరోపియన్ యూనియన్‌తో ఇంగ్లాండ్ ఒప్పందం కుదుర్చుకోని పక్షంలో బ్రిటన్‌లో అల్లర్లు తలెత్తే అవకాశం ఉందని దర్యాప్తు ఏజన్సీలు అనుమానిస్తున్నాయి. ముందు జాగ్రత్తగా బ్రిటన్ రాణి, ఆమె భర్తను లండన్ వెలుపలకు తరలించేందుకు అవకాశం ఉంది. అల్లర్లు తలెత్తితే శాంతి భద్రతల నిమిత్తం స్కాట్‌లాండ్ పోలీసులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని లండన్ పోలీసులు ప్రణాళికను ఖరారు చేశారు. కాగా మార్చిలోగా బ్రెగ్జిట్‌నుంచి వైదొలుగుతామనే నిర్ణయంతో ఉన్నట్లు ప్రధాని మే ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే.

### కొత్త ఉత్సాహంతో చర్చలు

లండన్: బ్రెగ్జిట్ ఒప్పందంపై యూరోపియన్ యూనియన్ నెగోషియేటర్లతో భేటీ అయినప్పుడు తన వద్ద తమ ప్రజాప్రతినిధులు ఇచ్చిన తాజా తీర్పు, నవీన ఆలోచనలు అనే ఆయుధాలు ఉంటాయని బ్రిటన్ ప్రధానమంత్రి థెరిసా మే ఆదివారం పేర్కొన్నారు. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని పునఃచర్చకు పెట్టకూడదని యూరోపియన్ యూనియన్ అధికారులు ఒత్తిడి చేశారు. అయితే బ్రెగ్జిట్ ఒప్పందంలోని సర్వసమ్మతం కాని అవరోధాలను వదిలించుకోవడానికి చేస్తున్న కృషిలో భాగంగా తాను బ్రిటన్, నార్తర్న్ ఐర్‌ల్యాండ్ కోసం పోరాడుతూనే ఉంటానని థెరిసా మే 'సండే టెలిగ్రాఫ్'లో రాశారు. 'మేము పరస్పరం కలిసి ఉండి, ఒకే స్వరంతో మాట్లాడితే మేము సరయిన మార్గంలో ముందుకు వెళ్లగలమనే విశ్వాసం నాకు ఉంది' అని ఆమె పేర్కొన్నారు. ఐర్లాండ్‌తో సరిహద్దు గురించి మాట్లాడకూడదనే ఉద్దేశంతో అవరోధం కల్పిస్తూ నిబంధన పెట్టారు. అయితే, యూరోపియన్ యూనియన్ కస్టమ్స్ నియమాలకు బ్రిటన్ కట్టుబడి ఉండాల్సి వస్తుందని బ్రెగ్జిట్ ఒప్పందానికి మద్దతు ఇస్తున్న వారు భయపడుతున్నారు. ఈ నిబంధనపై తిరిగి చర్చలు జరిపేందుకు థెరిసా మే బ్రసెల్స్‌కు వెళ్లాలనే వైఖరికి అనుకూలంగా గత వారం బ్రిటన్ పార్లమెంటు సభ్యులు ఓటు వేశారు. అప్పుడే బ్రెగ్జిట్ ఒప్పందానికి ఆమోదం లభిస్తుందని సూచించారు. గత నెలలో బ్రిటన్ పార్లమెంటు బ్రెగ్జిట్ ఒప్పందాన్ని దాదాపు తిరస్కరించింది. 'యూరోపియన్ యూనియన్ వద్దకు బ్రెగ్జిట్ ఒప్పందంపై తిరిగి చర్చించడానికి వెళ్లేందుకు హౌస్ ఆఫ్ కామన్స్‌లో మెజారిటీ ద్వారా ఒక సురక్షితమయిన మార్గం దొరికిందని నాకు ఇప్పుడు విశ్వాసం కలిగింది' అని థెరిసా మే 'సండే టెలిగ్రాఫ్'లో రాశారు.

# క్రికెట్ బుకీలపై దాడులు

తూర్పుగోదావరిలో రూ.11 లక్షల నగదు స్వాధీనం ❖ రాష్ట్రంలోనే అతిపెద్ద దాడి: ఎస్పీ విశాల్ గున్ని


క్రికెట్ బెట్టింగ్ ముఠా వివరాలను తెలియజేస్తున్న ఎస్పీ విశాల్ గున్ని

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3: తూర్పుగోదావరి జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ ముఠాను జిల్లా పోలీసులు అరెస్టుచేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుండి రూ.11 లక్షలకు పైగా నగదు, సెల్‌ఫోన్లు, ఇతర సామాగ్రి తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ విశాల్ గున్ని కాకినాడలోని తన కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఎస్పీ విశాల్ గున్ని వాట్సాప్‌కు సుమారు 10 నెలల క్రితం క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి విశ్వసనీయమైన సమాచారం అందింది. ఈసమాచారాన్ని ఆయన రాష్ట్ర డీజీపీకి తెలియజేశారు. డీజీపీ ఆదేశాలతో ఎస్పీ కాకినాడ లా అండ్ ఆర్డర్ డీఎస్పీ రవివర్మ, కాకినాడ సీసీఎస్ డీఎస్పీ పల్లపురాజుల సారథ్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. శనివారం మధ్యాహ్నం సుమారు 2.30గంటల సమయంలో ఎస్పీ విశాల్ గున్నికి బెట్టింగ్ జరుగుతున్నట్టు సమాచారం అందింది. ఆయన వెంటనే అప్రమత్తమై ఆదేశాలు జారీచేయడంతో డిఎస్పీలు రవివర్మ, పల్లపురాజు, కాకినాడ త్రీటౌన్ సీఐ శ్రీనివాసరావు ప్రత్యేక బృందాలతో కాకినాడ నగరం సూర్యనారాయణపురంలో చీకట్ల ఈశ్వరరావు అనే వ్యక్తి నివాసంపై దాడిచేశారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఈశ్వరరావు, అతనికి సహకరిస్తున్న ఆత్మూరి శివనాగవెంకటేశ్వర గుప్తను పోలీసులు అరెస్టుచేశారు. వారి నుండి క్రికెట్ బెట్టింగ్‌కు ఉపయోగించే ప్రత్యేక లైన్‌బాక్స్, ఒక ల్యాప్‌టాప్, ప్రింటర్, ఎల్ఈడీ టీవీ, క్రికెట్ బెట్టింగ్‌కు వినియోగిస్తున్న రూ.1.71 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో కాకినాడ రెవెన్యూకాలనీ, సాయిబాబా గుడి వీధిలో ఉన్న ఓ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. అక్కడ బెట్టింగ్ నిర్వహిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దండు గోపాలకృష్ణంరాజును అరెస్టుచేసి, ఒక లైన్ బాక్స్, నగదు కౌంటింగ్ మిషన్, రూ.9,55,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో రాజమహేంద్రవరం బెస్ట్‌ప్రైస్ ఎదురుగా ఉన్న శ్రీసాయి హెవెన్స్ అపార్ట్‌మెంట్ ప్లాట్ నంబర్ 504పై పోలీసులు దాడిచేశారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న కుప్ప ప్రవీణ్‌కుమార్ (సికింద్రాబాద్), మేకల కళ్యాణ్ (భీమవరం), ఎ జగదీష్‌ప్రసాద్ (భీమవరం), కలిదిండి శివధర్మతేజను అరెస్టుచేశారు. వారి నుండి 4లైన్ బాక్సులు, 124 సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, టీవిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు దాడుల్లో కలిపి మొత్తం ఏడుగురిని అరెస్టుచేసి, రూ.11లక్షల 26వేల 900 నగదు, 180 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ విశాల్ గున్ని తెలిపారు. నిందితుల్లో కుప్ప ప్రవీణ్‌కుమార్ గత మూడు సంవత్సరాలుగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చిందన్నారు. వీరితో మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టుచేయాల్సి ఉందని, వారు బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఉన్నట్లు తెలిసిందని చెప్పారు. వారిని అరెస్టుచేసేందుకు ప్రత్యేక బృందాలను పంపించామన్నారు. బెట్టింగ్ నిర్వహణ కోసం ఢిల్లీ, సోలాపూర్, రాజస్థాన్, ముంబాయ్, హైదరాబాద్‌లలో లభ్యమయ్యే ప్రత్యేక లైన్ బాక్సులను నిందితులు తీసుకువచ్చారన్నారు. ఒక్కొక్క లైన్ బాక్స్‌లో 20కు పైగా సెల్‌ఫోన్లు అనుసంధానమై ఉంటాయని, వాటితో దేశ, అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తారని తెలిపారు.

# టీడీపీలోకి ఆదిశేషగిరిరావు!

7న ముహూర్తం ❖ సూపర్‌స్టార్ కృష్ణ ఆశీస్సులతోనే..


తెనాలి, ఫిబ్రవరి 3: సూపర్‌స్టార్ కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు తెలుగుదేశం పార్టీలోకి చేరేందుకు లైన్ క్లియరైంది. ఈమేరకు ప్రముఖ సినీహీరో ఘట్టమనేని కృష్ణ స్వగ్రామమైన గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో టీడీపీ నేతలు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఆర్టీసీ చైర్మన్ వర్లరామయ్య ఆదిశేషగిరిరావుతో జరిపిన చర్చలు ఫలించాయి. తన సోదరుడు కృష్ణ ఆశీస్సులతో ఈ నెల 7న తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు ఆదిశేషగిరిరావు ప్రకటించారు. ఆదివారం ఉదయం బుర్రిపాలెం వచ్చిన బుద్దా వెంకన్న, వర్ల రామయ్య, తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, తదితరులు ఆదిశేషగిరిరావుతో సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బుద్దా వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా పింఛన్లు ఒక్కసారిగా 2వేల రూపాయలకు పెంచిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆదిశేషగిరిరావు ముఖ్యమంత్రిని అభినందించడానికే కలిశారని తెలిపారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

# డ్వాక్రా మహిళల్ని ఆదుకోవడం నా బాధ్యత

## నమ్మకానికి టీడీపీ.. అపనమ్మకానికి వైకాపా ప్రతీకలు

❖ రాజకీయాలకు అతీతంగా పసుపు-కుంకుమ
❖ సభలను భగ్నం చేసేందుకు వైకాపా కుట్రలు
❖ ఆటోవాలాలకు అండగా నిలవాలి
❖ టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ శ్రేణులతో సీఎం చంద్రబాబు



ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 3: సరిగ్గా 25ఏళ్ల క్రితం తాను నెలకొల్పిన డ్వాక్రా సంఘాలను పరిరక్షించుకుంటూ సభ్యులైన మహిళలను వారి పెద్దకొడుకుగా, ఒక అన్నగా ఆదరించాల్సిన, ఆదుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నమ్మకానికి ప్రతీక తెలుగుదేశం పార్టీ అయితే, అపనమ్మకానికి ప్రతీక వైకాపా అని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా పింఛన్ల పండుగ అయితే రాజకీయాల కతీతంగా పసుపు-కుంకుమ అన్నివర్గాల పేదల పండుగ అని వర్ణించారు. అయితే వైకాపా నేతలు ఈ కార్యక్రమాన్ని భగ్నం చేసే కుట్రలు పన్నుతున్నారంటూ హెచ్చరించారు. మొన్న జన్మభూమి సభల్లో, నిన్న పసుపు-కుంకుమ సభలో అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ, ఎక్కడికక్కడ ప్రజలే వారికి తగిన బుద్ధి చెపుతారన్నారు. ఉండవల్లిలోని తన నివాస గృహం నుంచి చంద్రబాబు ఆదివారం పార్టీ ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పెంపు అనుత్పాదక వ్యయం కాదని, ఇక పసుపు-కుంకుమ ఉత్పాదక వ్యయమంటూ మహిళలు డబ్బు దుర్వినియోగం చేయరన్నారు. అందుకే రాష్ట్రంలో తన అక్కాచెల్లెళ్లైన 95లక్షల మందికి రూ. 24వేల కోట్లు ఇస్తున్నామన్నారు. చెక్కులు చెల్లవనే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, రేపటి నుంచే డబ్బులు తీసుకోవచ్చన్నారు. ప్రస్తుతం రూ. 2,400 కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ చేశామంటూ ఒక అన్న ఇచ్చిన కానుకగా మహిళ సంతృప్తి, అలాగే వృద్ధులు పెద్దకొడుకు ఇచ్చాడనే ఆనందం పొందుతున్నారని చెప్పారు. తెలుగుదేశంపై నమ్మకంతోనే రైతులు ముందుకొచ్చారని, కాబట్టే బ్రహ్మాండమైన నగరాన్ని నిర్మించగలుతున్నామన్నారు. జీవితకాల పన్ను తొలగింపుతో అటు ఆటోడ్రైవర్లు, ఇటు ట్రాక్టర్ల యజమానుల్లో ఆనందానికి అవధుల్లేవని, వీరికి టీడీపీ అన్నివిధాలా అండగా నిలుస్తుందన్నారు. బీజేపీయేతర రాష్ట్రాలపై ప్రధాని మోదీ నిర్లక్ష్యం చూపుతున్నారని, నిధులు ఇవ్వకపోగా ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో కుట్రలు చేస్తున్నారని, హిందూ, ముస్లింల మధ్య ఉద్రిక్తతలు పెంచుతున్నారన్నారు.

# మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టిపోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

సోమవారం, 4 ఫిబ్రవరి 2019




వైద్య సేవలు అందజేస్తున్న డాక్టర్ అపర్ణ

# పట్టుదలే పెట్టుబడి

**చదువుకోవాలన్న తపన.. కష్టాలకోర్చి కృషి చేసే మనస్తత్వం.. లక్ష్యం చేరుకోవాలన్న పట్టుదల.. ఉంటే చాలు, జీవితంలో ఏదైనా సాధించవచ్చు.. అందుకు పేదరికం ఎంతమాత్రం అడ్డుకాదని నిరూపించింది డాక్టర్ అపర్ణ. వివరాల్లోకి వెళితే..**

నేనొక పేదకుటుంబంలో జన్మించాను. వైద్య విద్య చదవడం నా స్థోమతకు మించిందే అయినప్పటికీ దాన్ని సాధించాలన్న పట్టుదలే నన్ను వైద్య విద్యలో సులువుగా రాణించేలా ప్రేరేపించింది అంటోంది డాక్టర్ అపర్ణ..

ప్రస్తుత రోజుల్లో తమ పిల్లల్ని డాక్టర్‌లు, ఇంజనీర్‌లుగా చూడాలన్న ధ్యేయంతో ధనవంతులు, మధ్యతరగతి కుటుంబీకులు లక్షలు వెచ్చిస్తూ ఐఐటీ ఫౌండేషన్‌ల పేరుతో బోధన చేస్తున్న కార్పొరేట్ పాఠశాలల్లో చేర్చి పిల్లల వయసుకు సరిపడా బోధింపజేయాల్సిన విద్యకన్నా ఒత్తిడితో కూడుకున్న విద్యాబోధన చేయిస్తున్నారు. కేవలం చదువు తప్ప వేరే ప్రపంచం తెలియకుండా చాలామంది వారి పిల్లల్ని పెంచుతున్నారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చాలామంది విద్యార్థులు వారి ప్రతిభను చాటుతూ అనేక రంగాల్లో రాణిస్తున్నారు. అలాంటి వారిలో అపర్ణ కూడా ఒక వ్యక్తి.

అనంతపురం జిల్లా నల్లమాడలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించింది అపర్ణ. తల్లి అంగన్‌వాడీ కార్యకర్త, తండ్రి ఓ ఉపాధి కూలీ. అపర్ణ చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా వుండటంతో ఎంత కష్టమైనా తమ బిడ్డ చదువుకు వెనుకాడలేదు ఆ తల్లిదండ్రులు. కొంచె భారం అనిపిస్తే తమ స్థాయి చాలా తక్కువ, ఇలాంటి పరిస్థితిలో పిల్లల్ని చదివించడం ఎందుకబ్బా అని యుక్త వయసు రాగానే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేసేసి చేతులు దులుపుకునే తల్లిదండ్రులెందరో వున్నారు. అయితే అపర్ణ తల్లిదండ్రులు అలా ఆలోచించకుండా వారి తాహతుకు మించిన భారమైనా పిల్లల చదువుకోసమే వారు తపించారు. వారి శ్రమకు అనంతపురం జిల్లాలో పేదల కల్పతరువుగా వున్న ఆర్డీటి (రూరల్ డెవలప్‌మెంట్) సంస్థ ఇచ్చిన చేయూత, ప్రోత్సాహం మరువలేనిదని డాక్టర్ అపర్ణ తెలిపింది.

అపర్ణ చదువు నల్లమాడలోని బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి వరకు కొనసాగింది. 2009-10వ సంవత్సరంలో పదో తరగతిలో అపర్ణ 559మార్కులతో ఉత్తీర్ణతను సాధించింది. పై చదువులు చదివే ప్రతిభ ఉన్న విద్యార్థినీ విద్యార్థులను ఇంటర్, ఆపై చదువులు చదివించడానికి ఆర్డీటి సంస్థ వారు ఆర్డీటి సెట్ అనే ఎంట్రెన్స్ పరీక్షను నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచిన అపర్ణను ఇంటర్మీడియట్ విజయవాడలోని ఇబ్రహీంపట్నంలో వున్న శ్రీచైతన్య కళాశాలలో చదవడానికి ఆర్డీటి అవకాశం కల్పించింది. అందు కోసం అయ్యే ఖర్చులన్నీ ఆర్డీటి సంస్థే భరించింది. ఇంటర్‌లో 949మార్కులు సాధించిన అపర్ణ ఎంసెట్ కోచింగ్ కూడా ఆర్డీటి సహకారంతోనే తీసుకుంది. ఇంటర్‌తో పాటు ఎంసెట్ కోచింగ్‌కి కూడా ఆర్డీటీ ద్వారానే అవకాశం వచ్చింది. ఎంసెట్‌లో 4639ర్యాంకును సాధించిన అపర్ణ మొదటి ప్రయత్నంలోనే వైద్య విద్యకు అర్హత సాధించింది. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో ఆమెకు సీటు లభించింది. ఇలా విద్యలో రాణించేవారి ప్రతిభను గుర్తించి పైచదువులకయ్యే మొత్తం ఖర్చును భరిస్తున్న ఆర్డీటి సంస్థ అపర్ణకు కూడా వైద్య విద్య పూర్తి అయ్యేందుకు అయ్యే ఆర్థిక వనరులను, పుస్తకాలు, మెస్ బిల్లులు అన్నీ సమకూర్చి ఒక పేదింటి ఆణిముత్యం డాక్టర్ అయ్యేందుకుప్రధాన భూమిక పోషించింది. 2108 ఏప్రిల్‌లో మెడిసిన్ పూర్తి చేసుకుని నల్లమాడ గ్రామంలో మొట్టమొదటి వైద్యురాలిగా కాలు మోపింది పేదింటి బిడ్డ డాక్టర్ అపర్ణ..




వైద్య పట్టా పొందిన అపర్ణ

**నా కలను నెరవేర్చింది ఆ సంస్థే..**

ఆర్డీటి సంస్థ నావెంట లేకుంటే డాక్టర్‌ని అవ్వడం కలగా మిగిలేది.. నా తండ్రి రామచంద్ర ఒక పేపర్‌బాయ్. ఇంటింటికీ పేపర్ వేయడం అయిపోగానే ఉపాధి హామీ పనులకెళ్తారు. నా తల్లి రమణమ్మ, అంగన్‌వాడీ వర్కర్. నాకిద్దరు చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. వారు తొమిదోతరగతి చదువుతున్న అనూష, ఏడోతరగతి చదువుతున్న అమృత, ఐదోతరగతి చదువుతున్న నా తమ్ముడు గిరినంద్. నేను ఇంటికి పెద్ద కూతుర్ని. మాకు ఊర్లో ఓ చిన్న ఇల్లు వుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్న ఇంట్లో నేను, నా చెల్లెళ్ళు, తమ్ముడిని పెద్ద చదువులు చదివించడమంటే తలకు మించిన భారమేనని చెప్పొచ్చు. అయినా కూడా బాగా శ్రమిస్తూ పైసా పైసా కూడబెడుతూ మా తల్లిదండ్రులు మమ్మల్ని చదివిస్తూ వారిస్తున్న ప్రోత్సాహం మాటల్లో చెప్పలేనిది. అదేవిధంగా మేము దేవుడిలా భావించే విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటి సంస్థ సహకారం లేకపోతే నేను డాక్టర్‌ని అయ్యుండేదాన్ని కాదు. నేను మెడిసిన్‌కి అర్హత సాధించగానే కళాశాలలో అందరితో సమానంగా వుండాలని మా గ్రామంలోని కొందరు పెద్దలు కూడా కొన్ని వస్తువులు సమకూర్చి నాకు వెన్నుదన్నుగా నిలిచారు. వైద్య విద్యను అభ్యసించేవారిలో ధనవంతుల పిల్లలే అత్యధిక శాతం వుంటారు. వారందరితో సమానంగా వుంటూ వైద్య విద్యను పూర్తి చేయడానికి నా తండ్రి పడిన శ్రమ మరువలేనిది. ఇప్పుడు జనరల్ సర్జన్‌గా లేదా పీడియాట్రిక్ (చిన్నపిల్లల వైద్యం)లో పీజీ చేయాలనే కోరిక వుంది. ఇన్నాళ్ళూ నా చదువుకోసం అహర్నిశలూ శ్రమించిన నా తల్లిదండ్రులకు నా పీజీ విద్య కోసం మళ్ళీ కష్టపెట్టాలా అనే బాధ కూడా వుంది. ఎలాగైనా పీజీ పూర్తి చేయడానికి ఫ్రీ సీట్ తెచ్చుకోవాలన్న పట్టుదలతో ప్రయత్నిస్తున్నా.. కోచింగ్‌కు వెళ్ళాలంటే లక్షలతో కూడుకున్న పని. పీడియాట్రిషన్‌గా చిన్న పిల్లలకు వైద్యసేవలందించాలన్న కోరిక నెరవేరేవరకు రేయింబవళ్ళు కష్టపడి చదువుతా.. నాలక్ష్యమే నాకు దారి చూపుతుందన్న నమ్మకం నాకుంది. అని ధీమాగా చెబుతోంది అపర్ణ.

ప్రతిభ వుండాలే కానీ చదువుకు పేదరికం అడ్డుకాదని అపర్ణలాంటి వారెందరో నిరూపిస్తున్నారు. చదువుకోవడానికి డబ్బులేదు, పేదవాళ్ళం అనేవి కేవలం సాకు మాత్రమే అనిపిస్తోంది ఇలాంటివారిని చూసినప్పుడు. సాధించాలన్న లక్ష్యం వుంటే చాలు ఆ లక్ష్యమే దారిచూపుతుందన్న నమ్మకం ముందుకు నడిపిస్తుందని నిరూపిస్తోంది అపర్ణ. నిరుపేద కుటుంబంలో పుట్టిన అపర్ణలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని పేదరికం అనేదాన్ని పక్కకు నెట్టి చదువులో రాణించాలి. అదే విధంగా వైద్య విద్యను పూర్తి చేసుకుని చిన్నపిల్లల డాక్టర్‌గా సేవ చేయాలని ఆశిస్తున్న అపర్ణ లక్ష్యం నిజం అవ్వాలని కోరుకుందాం.. ఆశీర్వదిద్దాం.. ఆల్ ది బెస్ట్ అపర్ణ..



వైద్య విద్యలో అర్హత సాధించగానే ఆర్డీటి వ్యవస్థాపకుడి చిత్రపటం అందజేసి అపర్ణను సత్కరించిన పెద్దలు




డా.. అపర్ణ కుటుంబం


**- నల్లమాడ బాబ్‌జాన్,**
8500083799


# మేకప్ చేసే మాయ





ముదురు రంగు మేకప్ షేడ్స్ సహజ స్వరూపాన్ని వైదొలిగేలా చేసి, తేలికైన రంగులు ఎక్కువ కనిపించేలా చేస్తాయి. డైగ్నల్ లైన్ ఆకృతిలో షేడ్స్ వేయడం ద్వారా బుగ్గలు సన్నగా ఉన్నాయనే భ్రాంతిని మేకప్ ద్వారా కలిగించవచ్చు. ముక్కు మధ్య భాగానికి ఇరువైపులా పౌడర్‌ను, కింది వైపుగా తుడవాలి. మేకప్‌తో కళ్లను పెద్దగా కనిపించేలా చేయడం ద్వారా మిగిలిన ముఖం చిన్నదిగా కనిపిస్తుంది. ఇవన్నీ మేకప్ ద్వారా సాధ్యమే.. అందుకే మేకప్ లేకుండా ప్రముఖుల ఫొటోలను చూస్తే మనం ఆశ్చర్యానికి గురవుతాం. ఇంతలా కాకున్నా ఇంట్లో పాటించే చిన్న చిన్న చిట్కాల ద్వారా ముఖాన్ని సన్నగా, అందంగా కనిపించేలా మార్చుకోవచ్చు.



- చర్మం రంగుకన్నా ఎక్కువ రంగులో ఒకటి లేదా రెండు కాంటూర్ రంగులు లేదా మాట్ బ్రోంజర్ షేడ్స్‌ను.. ఒంటి రంగు కంటే తక్కువగా ఉండే హైలైటర్స్‌ను ఎంచుకోవచ్చు. మేకప్‌లలో క్రీమ్ లేదా పౌడర్స్‌లను ఏదైనా ఎంచుకోవచ్చు. లేదా రెండింటి కలయికను కూడా ఎంచుకోవచ్చు. వీటిని ఉపయోగించే ఫార్ములాతో సంబంధం లేకండా, మేకప్ బ్రష్‌ను ఉపయోగించి సరిగ్గా కలపాలి. ఎందుకంటే చారలుగా వచ్చే కాంటౌర్ మేకప్ అందంగా రాకపోవడానికి ఒక ప్రధాన కారణమవుతుంది.
- చెంపను కేంద్రంగా చేసుకుని చెవికి పైన డైగ్నల్ లైన్‌లో కాంటౌర్ షేడ్స్‌ను వేయాలి. సెల్ఫీస్ దిగేటప్పుడు ముఖం ఎలా పెడతారో అలా బుంగమూతి పెట్టడం ద్వారా చెంపపై షేడ్స్ వేయడానికి ఒక ఖచ్చితమైన స్థలాన్ని గుర్తించవచ్చు, వేసుకోవడానికి సులువుగా ఉంటుంది. కాంటౌర్ షేడ్స్‌ను ఎక్కువగా వేసుకోవడం వల్ల దవడ ఎముకలు పదునుగా కనిపిస్తాయి. దవడ ఎముకల పైభాగమంతటా హైలైటర్‌ను స్వైప్ చేస్తూ కాంటౌర్ బయటకు తీసుకురావాలి.
- ముక్కు సన్నగా కనిపించడానికి ముక్కు మధ్య భాగం వంతెనకు ఇరుపక్కల కాంటౌర్ పౌడర్‌ను దిగువకు స్వైప్ చేయాలి. దీనిని ముక్కు పుటాల వద్ద ఆపేయాలి. ముక్కు మధ్య భాగ వంతెనపై హైలైటర్‌ను దిగువ వైపుకు వేయాలి.
- పదునైన గవద భాగం కోసం ఆ ప్రాంతం మొత్తం బ్రోంజర్‌ను వేసుకోవాలి. కాంటౌర్ షేడ్ అతుకులు లేకుండా రావడానికి మిశ్రమాన్ని సరిగా కలపాలి.
- కళ్లు, కనుబొమ్మలను హైలైట్ చేయాలి. కళ్లను ఐ లైనర్, షాడో, మస్కారాలతో పెద్దగా చేయడంతో ముఖం చిన్నగా కనిపిస్తుంది. అలాగే ముఖం నిండుదనాన్ని సమతుల్యం చేయడానికి కనుబొమ్మల వంపు అధికంగా ఉండేట్లు చేయాలి.
- పెదవులు లావుగా ఉంటే ముఖం నిండుగా కనిపిస్తుందని ఉద్ఘాటించి చెప్పొచ్చు. పెదవులు సహజంగా కనిపించేలా లేతరంగు బామ్ లేదా గ్లోస్ పెట్టుకుని వదిలేయాలి.
- ముఖం మధ్య భాగాన్ని, కనుబొమ్మల మధ్య భాగాన్ని ముక్కు మధ్య భాగాన వంతెన లాంటి ప్రాంతాన్ని, ఎగువ పై పెదవి భాగాన్ని, గవద భాగాన్ని హైలైట్ చేయాలి. ఇది ముఖం వెడల్పు తక్కువగా కనిపించేలా చేస్తుంది.
- తరువాత నుదురు, కళ్లు, చెవులు మధ్య గల స్థలంలో కలిపి ఉంచిన కాంటౌర్ షేడ్స్‌ను వేయడం మరిచిపోకూడదు. ఇలా చేయడం వల్ల ముఖం చిన్నగా ఉండి అందర్లోనూ కొట్టొచ్చినట్లు కనిపిస్తారు.

★

# వంటగది శుభ్రత తప్పనిసరి



ప్రతి కుటుంబంలో ఇంట్లో ఏ గది ఉన్నా లేకపోయినా వంటగది శుభ్రత తప్పనిసరి. అది ఇంట్లోవారి సంబంధ బాంధవ్యాలతో పాటు ఇంట్లో వారి శుభ్రత, క్రమ పద్ధతిని కూడా ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా ఇంటి ఆరోగ్యం ఈ గది మీదనే ఆధారపడి ఉంటుంది. వంటగదిని సక్రమంగా నిర్వహించడం ఇల్లాలికి ఛాలెంజింగ్ జాబ్ అనే చెప్పాలి. ఆరోగ్యవంతమైన కుటుంబం.. శుభ్రమైన వంటగదితోనే సాధ్యం. అందుకు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే సరి..

- రోజూ ఉదయాన్నే స్నానం చేసిన తర్వాత, కనీసం ఉదయాన్నే మొహం, కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కున్న తర్వాత మాత్రమే వంటగదిలోకి వెళ్లాలి. ఇది అలవాటుగా మారితే అనేక అనారోగ్యాలను దూరంగా పెట్టవచ్చు.
- వంటగదిలో తగినంత వెలుతురు, గాలి వచ్చేలా ఉండాలి. గాలి రావడానికి, వెళ్లడానికి వీలుగా కిటికీలను తీసి ఉంచాలి.
- స్టౌ ఉంచిన ప్లాట్‌ఫామ్‌ను, నేలపై పడిన నూనె మరకలను, ఆహారపదార్థాలను ఎప్పటికప్పుడు తుడిచేయాలి. వీటిని అలాగే వదిలేస్తే బాక్టీరియాలకు ఆవాసంగా మారతాయి. అలాగే ప్లాట్‌ఫామ్‌పై వెనిగర్ చల్లి తుడిస్తే బాక్టీరియా చనిపోతుంది.
- వంటగది చెత్తడబ్బాలోని వ్యర్థాలను పారేసి సరిపెట్టుకోకుండా.. చెత్తడబ్బాను రోజూ శుభ్రంగా కడగాలి.
- క్లీనింగ్ కెమికల్స్‌ను ఆహారపదార్థాలు, వంటదినుసులకు దగ్గరగా ఉంచకూడదు. వీటిని విడిగా ఉంచాలి.
- వంటగదిని రోజూ సాధారణంగా శుభ్రం చేయడంతో పాటు పూర్తిస్థాయిలో శుభ్రం చేయడానికి ఒక కేలండర్‌ను మెయిన్‌టైన్ చేసుకోవడం మంచి పద్ధతి. అయితే ఖచ్చితంగా వారానికి ఒకసారి పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలి.
- అలాగే ఏరోజుకారోజు మిగిలిపోయిన ఆహారపదార్థాలను ఫ్రిజ్‌లో తోయకుండా పడేయాలి.
- పురుగుపట్టిన ఆహార దినుసులను కూడా ఎప్పటికప్పుడు పారవేసి శుభ్రం చేసుకోవాలి.
- వంటగది సింక్‌లో అరకప్పు ఉప్పు చల్లి, నిమ్మచెక్కతో రుద్ది పది నిముషాల తర్వాత స్క్రబ్బర్‌తో రుద్ది కడగాలి.
- వంటగదిలో వాడే టవల్స్ ఎప్పుడూ శుభ్రంగా ఉండాలి. ఎప్పటికప్పుడు వీటిని డిటర్జెంట్స్‌తో ఉతికి, బాగా ఎండ తగిలే చోట ఆరేయాలి.




- కటింగ్ బోర్డ్, చాకులను వారానికి ఒకసారి బ్లీచింగ్, వెనిగర్ కలిపిన వేడినీటిలో వేసి శుభ్రం చేయాలి. కూరగాయలను ప్లాస్టిక్ కటింగ్ బోర్డుపై తరగినప్పుడు కూరగాయలతోపాటు చిన్న చిన్న ప్లాస్టిక్ రేణువులు కూడా ఆహారంలో కలుస్తాయి. కాబట్టి ఉడెన్ కటింగ్ బోర్డు వాడడం మంచిది.
- చిన్న కప్పులో బోరిక్ యాసిడ్ వేసి వంటగది మూలల్లో ఉంచితే బొద్దింకలు ఇంట్లోకి రాకుండా ఉంటాయి.
- ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయకూడదు. ఎందుకంటే ప్లాస్టిక్ తయారీలో ఉపయోగించే రసాయనాలు, విషపదార్థాల అవశేషాలు ఆహారపదార్థాలను విషపూరితం చేస్తాయి.

★

# 'చదువులతల్లి'కి చక్కటి కానుక!

*రాళ్లు-రప్పలు.. వన్యప్రాణులు-విష కీటకాల సంచారం.. భీతి గొలిపే అటవీ ప్రాంతం.. అయినా ఎలాంటి భయం లేకుండా ఆ బాలిక రోజూ రెండు గంటల పాటు ఒంటరిగా నడుస్తూ బడికి చేరుకొంటుంది.. బాగా చదువుకొని డాక్టర్‌గా నిరుపేదలకు సేవచేయాలన్నదే ఆ 'చదువుల తల్లి' సంకల్పం.. అందుకే- ఆ సంకల్ప బలం ముందు ఎలాంటి కష్టాలనైనా ఆమ అనాయాసంగా ఎదుర్కొంటూ బడిబాట పట్టింది.. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో ఎలాంటి రవాణా సౌకర్యానికి నోచుకోక ఆమె అటవీ ప్రాంతం గుండా నడుచుకొంటూ బడికి హాజరవుతోంది. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా పల్చిల్ గ్రామంలోని శాంతారామ్ శంకర్ జాదవ్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న నిఖితాకృష్ణ మోరె రోజూ ఉదయం 8-45 గంటలకు నడక ప్రారంభించి కొండలు, గుట్టలు ఎక్కుతూ పాఠశాలకు చేరుకొంటుంది. శనివారం నాడైతే ఒంటిపూట బడి కావడంతో ఉదయం 8 గంటలకే ఇంటినుంచి బయలుదేరుతుంది. చదువులో రాణించి డాక్టర్ కావాలన్న పట్టుదలతో ప్రతిరోజూ 14 కిలోమీటర్ల మేరకు నడుస్తుంది. బడికి వెళ్లేందుకు తమ కుమార్తె ఇంతటి కష్టాలు పడుతున్నా నిరుపేద తల్లిదండ్రులు ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి. చదువుపై ఇంతటి ఆసక్తి, అనురక్తి ఉన్న నిఖిత గురించి స్థానిక దినపత్రికలో వచ్చిన వార్తాకథనాన్ని చదివి పూణెకు చెందిన 'సిటీ కార్పొరేషన్' మేనేజింగ్ డైరెక్టర్ అనిరుద్ధ దేశ్‌పాండే చలించిపోయారు. వెంటనే ఆయన నిఖితను, ఆమె తల్లిదండ్రులను, పాఠశాల హెడ్‌మిస్ట్రెస్‌ను పూణెకు పిలిపించారు. బడికి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు నిఖితకు ఎలక్ట్రిక్ సైకిల్‌ను దేశ్‌పాండే అందజేశారు. రెండు గంటలు ఛార్జింగ్ చేస్తే వంద కిలోమీటర్ల వరకూ ఈ సైకిల్‌పై వెళ్లవచ్చు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో వెళ్లే ఈ సైకిల్‌ను అందుకున్నాక నిఖితలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. బడికి వెళ్లేందుకు ఇపుడు ఎలాంటి సమస్యలు లేనందున చదువుపై మరింత దృష్టి సారిస్తానని ఆమె చెబుతోంది. ఇంతటి సాయం అందుతుందని తాను కలలో కూడా ఊహించలేదని ఉబ్బితబ్బిబ్బయింది. నిఖిత గురించి తెలుసుకొని కొథ్రూడ్‌కు చెందిన ఉన్నతోద్యోగి విద్వత్ ప్రకాశ్ చిత్రే మరో సైకిల్‌ను నిఖితకు అందజేశారు. నిఖిత ఎంతో ప్రతిభావంతురాలైన విద్యార్థిని అని, బడికి వచ్చేందుకు ఎన్ని సమస్యలున్నా ఎవరితోనూ చెప్పేది కాదని పాఠశాల హెడ్‌మిస్ట్రెస్ వినీత పవార్ గుర్తు చేస్తున్నారు. చదువుపై తప్ప ఇతర విషయాలపై ధ్యాస లేని నిఖిత మిగతా విద్యార్థులందరికీ స్ఫూర్తి కలిగించిందని ఆమె ప్రశంసలు కురిపించారు.*



## శ్రీనరసింహ శతకము

సీ॥ తాపసార్చిత! నేను పాపకర్ముఁడనంచు
నాకు వంకలు పెట్టఁబోకు సుమ్మి
నాటికి శిక్షలు నన్నుఁజేయుటకంటె
నేడు సేయుము నీవు నేస్తమనక
అతిభయంకరులైన యమదూతలకు నన్ను
నొప్పగింపకుమయ్య యురగశయన!
నీ దాసులను బట్టి నీవు దండింపంగ
వద్దు వద్దెనరెంత పెద్దలైన
తే॥ తండ్రివై నీవు పరపీడఁ దగులఁజేయ
వాసిగల పేరుకపకీర్తి వచ్చునయ్య!
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: మునిజన వందితుడవైన ఓ నరసింహ ప్రభూ! నేను పాపాలు చేసేవాణ్ణని ముద్రవేయవద్దు. నన్ను శిక్షించాలని వుంటే, మరణ సమయంలో ఎందుకు? ఇప్పుడే శిక్షించు. యమ దూతలు చాలా కఠినాత్ములు. వారికి నన్నప్పగించకు. నీ భక్తుల్ని నీవు శిక్షిస్తే ఎంతవారైనా అడ్డుపెట్టరు. నీవు తండ్రివంటివాడవు. నీవు ఇతరుల్ని పీడిస్తే నీ కీర్తికే మచ్చ.



# అనంతం

52 -గోపరాజు నాగేశ్వరరావు

గోపీనాయక్ చెప్పింది అక్షరాలా నిజం!

అక్కడ-

గొలుసు కొండలకి పులులు పహారా కాస్తుంటాయి.

విష సర్పాలు బుసలుకొడుతూ సూదికళ్ళతో చూస్తుంటాయి.

అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉంటాయి.

వింత పక్షుల రెక్కల కరకు చప్పుళ్ళూ- యుద్ధవిమానాల్లా ఆకాశంలో గుంపులు గుంపులుగా తిరిగే రాబందులూ- అలికిడి వినిపిస్తే 'ఖస్సు'న లేచి పడగలెత్తే భయంకర సర్పాలూ...

మరో ప్రపంచంలా ఉంది!

''ఈ తావరఁవ్ పోలీసోళ్ళగూడా తెలవదా?''అని, రాగ్యా నడిగారు ఎవ్వరో.

''తెలవదు''అన్నాడు రాగ్యా.

వాళ్ళు యింతింత కళ్ళుచేసుకొని గొలుసు కొండల్నే చూస్తూ అడుగులు వేస్తున్నారు.

గొలుసుకొండల్లో చాలా గుహలున్నాయి.

గుహల్లోనుంచి దూరంగావెళ్ళే రహస్య మార్గాలున్నాయి!

రాగ్యా, గోపీనాయక్ దారిచూపిస్తూ, వాళ్ళ నొక పెద్ద గుహలోకి తీసుకొని వెళ్ళాడు.

ఆ గుహ చాలా విశాలంగా ఉంది.

అప్పటికే అలిసిపోయిన అడవి పుత్రులు గుహలో ఎక్కడివాళ్ళక్కడ నేలమీదే కూలబడి పోయారు.

ఇప్పుడు తెలుస్తున్నది వాళ్ళకి గాయాల బాధ!

కొంతమంది అడవి పుత్రులు గుహనుంచి బైటికివెళ్ళి ఏవో ఆకులు మూటకట్టుకొని తెచ్చారు.

రెండు అరచేతుల మధ్య ఆకుల్ని నలిపి, బలంగా గాయాల మీద పోసి ఆకులతోనే కట్లుకడుతున్నారు.

కొంత సమయం గడచిపోయింది.

అడవి పుత్రులు ఆకలితో నకనక లాడటం గోపీనాయక్ గమనించాడు. అనుచరులను పిల్చి వాళ్ళకేదో చెప్పాడు.

దృఢంగా ఉన్న యువకులు అడవికి వెళ్ళారు. కొద్ది సమయంలోనే కాయలూ పండ్లూ తెచ్చి వాళ్ళకిచ్చారు.

అడవి పుత్రుల ఆకలి చల్లారింది. స్థిమితంగా కూర్చొని ఆలోచనల్లో పడ్డారు!

జరిగిందంతా గొర్తొచ్చి వాళ్ళ కడుపు దహించుకొనిపోతోన్నది!

బాణావతు, నగ్గూరాం, కాళీచరణ్ పోలీసు కాల్పుల్లో మృతి చెందారని రెడ్డియానాయక్ తండాకి కబురు అంది ఉంటుందా?

లక్ష్మీబాయి భర్తచనిపోయిన విషయం తెలిస్తే తట్టుకోగలదా?

వాల్యా తండ్రి కావాలని అడిగితే ఏం సమాధానం చెప్తుంది?

చాంద్నీ ఆత్మహత్య చేసుకున్నదని తెలిస్తే వాళ్ళు తట్టుకోలేరు.

ప్రశాంతంగా వున్న అడవి పుత్రుల జీవితాల్లో కొద్ది గంటల్లోనే ఎన్నెన్ని విషాధ ఘట్టాలకు తావు కలిగిందో!

అంతా జరిగింది పాలక వర్గాలవల్ల కదూ!

అన్ని ఘోరాలకు కారణమై చివరికి వాళ్ళు సాధించేది ఏమిటి?



అడవి పుత్రులకేమీ పాలుపోవటం లేదు.

రాగ్యా, గోపీనాయక్ మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నారు.

ఇప్పుడు తక్షణ సమస్య తండా వాళ్ళదే!

కసితోవున్న పోలీసులు రెడ్డియానాయక్ తండామీద ఏ క్షణంలో అయినా విరుచుకుపడతారు. వృద్ధులు, స్త్రీలు, పిల్లలని కూడా చూడరు. లాఠీలతో కొడతారు. తండాని ధ్వంసం చేస్తారు.

ఈ విషయం వాళ్ళు ఊహించగలరో, లేదో!

తండాలోవున్న వాళ్ళని వెంటనే రక్షించాలి. వాళ్ళక్కూడా గొలుసుకొండ గుహల్లనే ఆశ్రయం ఇవ్వాలి.

ఉద్రేకాలు చల్లబడేదాకా రెడ్డియానాయక్ తండావాళ్ళు పోలీసులకు చిక్కకుండా తప్పించుకోవటం చాలా అవసరం.

అశ్రద్ధచేస్తే ప్రాణాలుకూడా పోవచ్చు!

ఏం చెయ్యాలి?

వాళ్ళనెలా రక్షించాలి?

రాగ్యా ఎందుకో అక్కడ్నించి లేచివెళ్ళి దూరంగా కూర్చున్నాడు.

మధ్యమధ్యలో గోపీనాయక్ వైపూ, గాయాలతో విలవిల్లాడుతున్న అడవి పుత్రుల వైపూ మార్చిమార్చి చూస్తున్నాడు.

గోపీనాయక్ బాధనెలా భరిస్తున్నాడో కానీ, అతని కాలికి బలమైన గాయమే అయ్యింది. ఎవ్వరూ చూడకుండా గాయంమ్మీద పసరు పిండుతుంటే రాగ్యా అప్పుడు చూసాడు!

అతని కళ్ళల్లోనుంచి జలజలా కన్నీళ్ళు రాల్తున్నాయి.

ఇదంతా జరిగింది తనవల్లనే అన్న న్యూనతతో కృంగిపోయాడు.

కొంత సమయం గడిచిపోయింది.

పసరు ప్రభావంతో గాయం బాధ కొంచెం ఉపశమించింది. అప్పుడు మళ్ళీ గోపీనాయక్‌కి రెడ్డియానాయక్ తండాలోవున్న స్త్రీలు, వృద్ధులు, పిల్లలూ గుర్తొచ్చారు!

ఎవ్వరో ఒకరు వెంటనే బయల్దేరి, అక్కడికి వెళ్ళాలి.. పొంచివున్న ప్రమాదం గురించి హెచ్చరించి వాళ్ళనా తండానుంచి రక్షించి తేవాలి. ఆలస్యమైతే ఏ క్షణంలో ఐనా పోలీసులు విరుచుకొని పడతారు!

ఇప్పుడేం చెయ్యాలి?

తనే వెళ్ళొచ్చుకానీ, కాలి గాయం బాధతో త్వరగా నడిచే అవకాశం లేదు. గొలుసుకొండల దగ్గిరికి నడవటమే కష్టమైంది.. కాలంతా పూర్తిగా వాచిపోయింది.

గోపీనాయక్ రాగ్యా వైపు చూశాడు!

గుహలో ఓ మూలగా రాతి గోడకి చేరగిలబడి శూన్యంలోకి చూస్తూ, రాగ్యా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్నాడు!

రాగ్యా పరిస్థితి అతనికి అర్ధమైపోయింది!

వాడో స్వయంకృతాపరాధి! నిర్భాగ్యుడు!!

కోరుకున్న చాంద్నీని, అమితంగా ప్రేమించే కన్న తండ్రినీ పోగొట్టుకున్నాడు. స్నేహంలో వంచించబడ్డాడు. అత్యాశకుపోయి అనర్ధాలను కొనితెచ్చుకున్నాడు!

ఇప్పుడు బాధపడుతున్నాడు!

చేసిన తప్పువల్ల అన్యులు పడే బాధకన్నా, తన తప్పుతెలుసుకొని బాధపడే వాడి బాధే- మహాబాధ!

రాగ్యా ఇప్పుడు అలాంటి స్థితిలోనే ఉన్నాడు.

అతన్ని ఓదార్చాలా? వొద్దా?

ఏడువ నివ్వాలి. ఓదార్చకూడదు!

గుండె ద్రవిచేలా ఏడిస్తే, అంతరాళాల్లో గడ్డకట్టి వేధించే బాధ అశ్రుకణాలపై కారి, జారిపోతాయి! హృదయం తేలికపడుతుంది!

ఓదారిస్తే, మరో దారిలేక అశ్రుకణాలే అణుబాంబులై విస్ఫోటిస్తోంది!

ఒక్కో సందర్భంలో ఓదార్పు ఎన్ని దుష్ఫలాలనిస్తుందో!

(ఇంకా ఉంది)



# రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండుటచే మానసికానందాన్ని పొందుతారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. నిన్నటివరకు వాయిదా వేయబడిన కొన్ని పనులు ఈ రోజు పూర్తిచేసుకోగలుగుతారు. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
ఆకస్మిక ధనలాభయోగముంటుంది. కుటుంబంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలుంటాయి. అంతటా అనుకూల వాతావరణమేర్పడుతుంది. స్త్రీలు సౌభాగ్యాన్ని పొందుతారు. బంధు, మిత్రులు కలుస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. స్త్రీల మూలకంగా శత్రుబాధలనుభవిస్తారు. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురిచేస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి పట్టుదల పనికిరాదు. పగ సాధించు ప్రయత్నాన్ని వదిలివేయడం మంచిది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏ మాత్రం అశ్రద్ధ పనికిరాదు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో వుంటారు. స్త్రీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రులతో కలుస్తారు. క్రీడాకారులు, రాజకీయ రంగాల్లోవారు ఉత్సాహంగా ఉంటారు. స్త్రీలు సంతోషంగా కాలక్షేపం చేస్తారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
ఋణప్రయత్నాలు తొందరగా ఫలిస్తాయి. స్థానచలన సూచనలుంటాయి. శుభకార్యాల మూలకంగా ధనవ్యయం అధికమవుతుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. అనారోగ్యమేర్పడకుండా జాగ్రత్త అవసరం.


● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఆరోగ్యం గూర్చి జాగ్రత్తపడుట మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. కుటుంబ కలహాలకు దూరంగా వుంటే మేలు. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం. డబ్బును పొదుపుగా వాడతారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
క్రొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. ప్రతి విషయంలో వ్యయ, ప్రయాసలు తప్పవు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. వృత్తిరీత్యా క్రొత్త సమస్యలనెదుర్కొంటారు. బంధు, మిత్రులతో కలహాలేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
పిల్లలవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు. అధికారులతో గౌరవింపబడతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. అనారోగ్య బాధలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. నూతన వ్యక్తులు పరిచయమవుతారు.

## మాటాట

నిర్వహణ: సుధామ 1862



| అడ్డం | ఆధారాలు | నిలువు |
|---|---|---|
| 2. పువ్వులు పరచినదారి | | 1. నూరు పద్యాల కృతి 3. పెద్ద కెరటం |
| 5. దీనికి లేని దురద కత్తిపీటకా? | | 4. మునిమాణిక్యం ఈ కథలు రాశారు |
| 7. పట్టుదల | | 6. నవమి తరువాత |
| 8. మందుడు | | 7. చిలుకను బంధించి ఉంచే చోటు |
| 9. దూది కణము | | 10. జన్మ |
| 10. పుడమి మధ్యలో లేదు | | 11. సౌందరనంద కవుల్లోని లక్ష్మీకాంతం ఇంటిపేరు |
| 12. కలర్ | | 13. కడివెడంత ఈ కాయ కత్తిపీటకు లోకువట! |
| 14. ఒక నృత్య విశేషము | | |

**మాటాట-1861 సమాధానాలు**

| అడ్డం | | నిలువు | |
|---|---|---|---|
| 1. శనివారము | 9. రేఖ | 2. వాహనం | 7. శంఖము |
| 5. బాబా | 10. రాజీ | 3. అంబా | 10. రాదారి |
| 7. శంక | 12. ముని | 4. కోక | 11. దేవుడు |
| 8. లావు | 14. ఏడుకొండలు | 6. బాలాజీ | 13. నిధులు |

# హనుమ - శీలము

లక్కరాజు వెంకట పూర్ణచంద్రరావు

''**నా** దృష్టి పరస్త్రీ సుఖాదులందాసక్తము కాదు. అయిననూ నాకు ఎట్టి దుష్టభావన కలుగలేదు'' అని-

**''మనోహి తేతుస్సర్వేషా మింద్రియాణాం ప్రవర్తనే**
**శుభాశుభా స్వవస్థా సుతచ్చమే సువ్యవస్థితమ్''**

మనసే కదా అన్ని ఇంద్రియములను నిర్దేశించునది. అట్టి మనస్సు నా యందు చలించక స్థిరముగానున్నది. ఎప్పుడైనా స్త్రీలను స్త్రీలలోనే కదా వెతుకవలసినది అని జితేంద్రియుడైన హనుమ తలపోసెను. నాలుగంగుళములు కూడా విడువక గాలించి చూచాను జానకీమాత ఎక్కడనూ కానరాలేదు, రాక్షస బాధలు భరించలేక మరణించియుండునా, అమ్మ ఆచూకీ తెలుసుకొనక యే విధముగా తిరిగి వెళ్ళి వానరులను కలుసుకొనెదను? గాన నిచ్చటనే ప్రాయోపవేశము చేయుదునే అని పరి పరి విధముల విచారించసాగెను. ఏ కార్య సాధకునికైననూ నిరుత్సాహము పనికిరాదని, ఉత్సాహమే సకల జయములకూ మూలమని బుద్ధిమంతులైన హనుమ భావించెను.

***శ్లో॥ అనిర్వేదః శ్రియోమూ మనిర్వేదః పరం సుఖమ్***
***అనిర్వేదోహి సతతం సర్వార్థేషు ప్రవర్తకః***

***కరోతి సఫలం జంతోః కర్మ యత్తత్ కరోతిసః***
***తస్మాదనిర్వేదకృతం యత్నం చేష్టేహ ముత్తమమ్***

ఉత్సాహమే మనుజునికి అన్ని కార్యములలో జయము చేకూర్చునది. కనుక ఉత్సాహ పూర్వకముగనే ఉత్తమమైన ప్రయత్నమునే కొనసాగించెదరని ధీరుడైన హనుమ, రావణ రక్షిత లంకలోనున్న ప్రదేశములను వెదకెదనని నిర్ణయించుకొనెను. ఈ రీతిగా నిరంతరము ఔత్సాహికులై జీవించవలెనని మానవాళికి ఒక నిర్దిష్టమైన సందేశానిచ్చాడు స్వామి.

నిరుత్సాహము మనిషిని అనేక రకములుగా కృంగదీసి, దుఃఖములకు కారణహేతువవుతుంది. యుద్ధభూమిలో జవాను నిరుత్సాహపడితే తాను పరాజయము పొందుటకుగాని శత్రువుల చేతిలో చిక్కటంగాని జరుగుతుంది.

అందుకే స్వామి వివేకానంద చెప్పినట్లుగా 'ఫియర్ ఈజ్ ఈక్వెల్ టు డెత్'. నిరుత్సాహము మరణముతో సమానము.

ఎల్లప్పుడూ ఎవరైతే ధైర్యంగా సమస్యలను ఎదుర్కొనగలరో జయము వారినే వరిస్తుంది. ఒక విద్యార్థి పరీక్షలో ఉత్తీర్ణుడు కాకపోతే నిరుత్సాహపడి చివరకు అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. అట్లుగాక ధైర్యంగా ఎదుర్కొని తిరిగి పరీక్ష వ్రాసి ఉత్తీర్ణత పొందవచ్చు. అదే ఉత్సాహవంతుల లక్షణం. 'సక్సెస్ ఆఫెన్ కమ్స్ హూ డేర్స్ టు యాక్ట్' అనే సామెత చాలామందికి తెలిసే వుంటుంది. చాలామంది రాజకీయ నాయకులు ఒకచోట ఎన్నికలలో ఓడినవారు, మరొక చోట జయము పొందుతూ వుంటారు. దీనికి కారణం వారు ఓడినందులకు విచారపడకుండా, దైన్యంతో క్రుంగిపోకుండా ఉండడమే అదేవారి జయమునకు దారితీస్తుంది. అదే స్వామి లోకానికి తెలియజేసిన సందేశము.

హనుమ తత్వంలో అతి ముఖ్యమైన అంశం సేవాతత్వం. శ్రీరామచంద్రమూర్తికి నమ్మినబంటు, ఆయన పాదసేవకుడు. అశోకవనములోనున్న సీతామాతను చూసి, శ్రీరామ ప్రభువు చెప్పిన గుర్తులను బట్టి ఆమె సీతయే అని నిర్ణయించుకొన్న తరువాతనే-

***రోష ప్రముకై రిషుభిర్జ్వలద్భిరివ పావకైః***
***తేనాహం ప్రేషితో దూతస్త్వత్సకాశ మిహాగతః***

రామ రావణ యుద్ధమందు మండుచున్న అగ్ని వంటి బాణములతో రావణుని వధించగల శక్తిమంతుడైన శ్రీరామునిచే పంపబడిన దూతగా నీ వద్దకు వచ్చితిని అని ఎంతో నిరాడంబరత్వముగా స్వామి పలికిన పలుకులు, ఇంకనూ నేను సుగ్రీవుని మంత్రిని హనుమంతుడను వానరుడను, ఈ మహా సముద్రమును దాటి లంకలో ప్రవేశించితిని అని ఏ రకమైన అహంకామూ లేక మాట్లాడిన మాటలు సీతా మాతను ఊరడింపజేసినవి. మానవునకు సహజమైన అహంభావము, ప్రలోభములను పక్కకు నెట్టగల ధైర్యము, సామర్థ్యము గల దూతలు తమ కార్యమును జయప్రదముగా సాధించగలుగుతారు. అటువంటి ధృతిమతిగల హనుమని సుందరకాండ ద్వారా తెలియబరిచినాడు మహర్షి.

- సమాప్తం

# మల్లాది రామకృష్ణశాస్త్రి కథలు

మల్లాది రామకృష్ణశాస్త్రి

**మ**నిషన్నవాడికి ప్రేమించడం చేతకావాలని, అలా చేతగాని దద్దమ్మలంటే ఆయనకంత అక్కసని తెలుస్తుంది.

శాస్త్రిగారి కథల్లో సంభాషణలన్నీ చతుర సంభాషణలే! పదాల విరుపులు అతి రమ్యంగా ఉంటాయి. ఖుదావంద్ కథలో ఈ సంభాషణ విందాం!

'శకుంతల ఉలిక్కిపడి తల ఎత్తింది. ఏమిటని ఆ చూపులు నన్ను ప్రశ్నించింది. నేను అర్థం కానట్టు చూసీ చూడనట్లు ఊరుకోగా'

''ఏమిటది?'' అని పలికింది.

''ఏం లేదు.. ఎక్కడ్నించో గాలివచ్చి-''

''నాలుగ్గోడల సందునా గాలి ఎట్లా విసురుతుంది?''

''విసరదు - మసలుతుంది!''

''మసలేగాలికి అంత అదరిపాటుతనం ఉండదు.''

''ఐదవతనంతోపాటు అదరిపాటుతనమూను.''

''ఐదు వరాలిచ్చిన ఆ ఐదవరాలి పేరే మిర?''-అదీ సంగతి!

''ఈ గోరంత గొప్పే మాకు ఎల్లకాలం చాలును'' అంటూ ముగించిన గోరంత గొప్ప- కథలోని పాత్రలన్నీ రామకృష్ణశాస్త్రిగారి ఊహాకల్పితాలు కావు.. ఆయన మనోవాంఛితాలు!

''నన్ను తలచుకోరా అని పుటక యిచ్చాడు-నదులను సేవించరా అని ఈ దేహం ఇచ్చాడు'' అని తలపోస్తూ, తన సంపాదనలో

**వినమరుగైన..**

## సోమంచి రామం

పొట్ట గడిచాక మిగిలినదంతా యితరులకిచ్చే రామాంజయ్య, ''సీతమ్మ వారంతటి ఆడకూతురుకి అబద్ధమాడాలనిపించిందని, జైలుకెళ్లి వచ్చి, వాపోయే- పరోపకారి రంగడు, గోపాలస్వామి మౌనోపదేశంతో భక్తుడైపోయిన సాహెబు యిస్మాయిల్- గోవుల్ని కంటికి రెప్పలా చూచుకునే కోమటి సుబ్బయ్య-

సాధువిచ్చిన విభూతి ప్రసాదంతో వాడలోని చినదానికి జన్మించి, పెరిగి పెద్దదై, జ్ఞానాంబగా మారిన పిల్ల.

వీళ్లందర్నీ చూస్తుంటే-ఇంత మంచితనమున్న వాళ్లు ఆ ఊళ్లో ఉంటే-యింకా ఊరికేం కావాలి?

ఏ కులం వారైతేనేం-ఏ మతం వారైతేనేం-మంచి తనమున్న మనుషులే ముఖ్యమని చాటిచెప్పే గోరంత గొప్ప కథ కొండంత నీతిని చెప్తోంది.

రామకృష్ణశాస్త్రిగారి కథలకు- పాత్రలకు కుల మత భేదాల వాసనలు గిట్టవు. శాస్త్రిగార్కి, బందరుకు విడదీయలేని, విడదీయరాని అనుబంధముంది. బందరును విడిచివెళ్లినా, ఆయన మనసు బందరు చుట్టూ తిరుగుతూనే ఉంటుంది.

అందుకే -బందరు గొడుగుపేటలో ఏటా జన్మాష్టమినాడు చమ్మకొడుతూ, దరవు అందుకొంటూ- ఉట్టికొట్టడం, గరుడకంబం చడ్డీ వేయడం- స్వామి వారి వాహనం ఊరేగించడం- ఈ వింతలన్నీ పాటలతో సహా మన కళ్లముందు కలకాలం నిలిచేలా నిలిపిన కథ వినవేడుకగా చెప్పారు. అలాగే కనుమరుగైపోతున్న అలనాటి ముచ్చట్లు- పల్లె జీవనాలు- మనకు తెలియాలంటే ఆనందకాననం-లాంటి కథలు చదవాల్సిందే!

శాస్త్రిగారి కథల నిండా విచిత్ర పదప్రయోగాలు, పదాలు దొర్లుతాయి. కాఫీ-సాయి, మన కారు వాళ్లు, నెల మసలింది, ఉపధానం, ఉపానహృద్వయి, శ్వేతకాష్టం యిత్యాదులు.

కథల శీర్షికలూ అలాగే ఉంటాయి. ఛాందోగ్యం, దోదమ్మి, పంచసాయకం, తార్కికరక్ష.. శాస్త్రిగార్కి పదక్రీడలంటే వల్లమాలిన అభిమానం.

**అమ్మక చెల్ల నా మనసమ్మక చెల్లదు**
**రకానికో కోరకాన్ని గికురించు**
**సకి మోము గ -నాలేని-నా..**

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నైనా చెప్పవచ్చు!

అందుకే ఆయన కథలు ఆ తరం వాళ్లకు అమృతోపమానాలు. అత్యంత ఆదరణీయాలు. అద్భుత స్వప్నాలు. ఆరాధనీయాలు. సాగర గర్భంలో ఆణిముత్యాల సరసన ఆలిచిప్పలూ స్థావర మేర్పరచుకుంటాయి. కాని శాస్త్రిగారి కథా సాగరంలో ఆలిచిప్పలుండే ఆస్కారమే లేదు. ఎందుకంటే ఏ కథ కా కథ ఓ ప్రత్యేకతను సంతరించుకునే ఆణిముత్యమే!

అందుకే ఆయన కథలు ఆనాటికీ, ఈనాటికీ, ఏనాటికీ పఠనీయాలు, స్మరణీయాలు, కలకాలం పదిలపర్చుకోవాల్సిన సాహితీ కవనాలు, సాహితీ మంజీరాలు.

-సమాప్తం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి సోమవారం, 4 ఫిబ్రవరి 2019



# స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

207

న్యాయశీలురు, ఆదరణీయుల నాదరించడం వలన సమాదరణీయుల నుండి ప్రేమభావం వ్యక్తమవుతుంది. ఆ ప్రేమభావన వృద్ధి చెంది వారి ఎడల బంధుత్వ భావం ఏర్పడుతుంది. అలా మిత్రత్వ భావన తరువాత వరుణ = ఇతరులను తనవారిగా చేసికొనే భావన జనిస్తుంది. అట్టివానికి జనులను ఎంచుకొని వారిని తనవారిగా చేసుకొనే కళ కూడా సిద్ధిస్తుంది. అప్పుడు అతడికెవరూ శత్రువులే వుండరు. ఈగుణాలతో బాటు ఆ వ్యక్తికిదానశీలత కూడ జతకూడితే ఆ మహాజనుడు 'ఋతే స విందతే యుద్ధః సుగోభిర్యాత్యధ్వనః'

''యుద్ధం సంభవించకుండానే తాను సాదించదలచిన పనలను సాధించగలరు. తన మార్గంలో సులభంగా పయనింపగలడు. ఈ మంత్రార్థాన్నే మరో సందర్భంలో ఇలా వర్ణించింది.

యం రక్షంతి ప్రచేతసో వరణో మిత్రో అర్యమా నొ చిత్స దభ్యతే జనః

''చైతన్య ప్రదయకుడగు వరుణుడు (లోకోపకార భావన) మిత్రుడు (మైత్రీభావన) అర్యముడు (గౌరవనీయ భావన) ఎవరికిరక్షకులుగా ఉంటారో అతడు ఎప్పుడైనా ఎవరిచైనైనా ప్రతిఘటింపబడతాడా?'' ఎన్నటికి జరుగదు సరికదా 'అరిష్టః సర్వ ఏధతే' -''తాను ఎవరిచేతనూ పీడింపబడకుండ అన్ని విధాల పురోభివృద్ధి పొందుతాడు''. అట్టి అహింసా ప్రవృత్తిగలవానికి అన్ని మార్గాలు సరళమైపోతాయి. ఎన్ని బాధలు ఎదురుండినాఅవి దూరంగా తొలగిపోతాయి. ఆయన జీవన మార్గంలో సరళమూ, సుఖప్రదమూ అయిన సాధనోపాయాలే తటస్థపడతాయి. ఏ ఆపద ఆ వ్యక్తినిబాధింపదు సరికదా అవి తమంత తామే నష్టమైపోతాయి. ఈ మాట ఏదో విషయ ప్రతిపాదన కోసం చెప్పింది కాదు. సాక్షాత్తు ఋగ్వేదమే-

సుగః పంథాః అనృక్షర ఆదిత్యాస ఋతం యతే! నా త్రావ ఖాదోఅస్తివః

''ఓ అదితిపుత్రా! ఋతానుసారంగా (సృష్టి ధర్మాలు, దైవాజ్ఞలు, దైవనియమాలు) నడుచుకొనే వానికి అన్ని మార్గాలు సుఖదాయకమ్మై, ఆటంకశూన్యమై ఉంటాయి. ఆ మార్గాలలో అతడికి ఏ హాని సంభవించదు'' అని ఉద్ఘాటించింది.

పై ఋగ్వేద మంత్రం వరుణ, మిత్ర మరియు అర్యములను ప్రచేతస్సులుగా పేర్కొంది. ప్ర+ చేతస్సులు = ఉత్తమ చైతన్యాన్ని లేదా జ్ఞానాన్ని ఇచ్చేవారని అర్థం. ఈ ప్రచేతస్సు శబ్దం కేవలం గుణవాచకమని భావించినా లేదా ఆగుణం కలిగినగుణివాచకంగా భావించినా రెండు పక్షాలలో కూడా ఉత్తమ జ్ఞానం లేదా చైతన్యాన్ని కలిగించేవారని అర్థం.

ఉత్తమమైన జ్ఞానం లేదా చైతన్యం కలిగించేవారు బుద్ధిమంతులైనవారిలోవ జ్ఞానాన్ని లేదా చైతన్యాన్ని నింపుతారు. ఎప్పటికప్పుడు వారిని శ్రద్ధాళువులుగా ఉంచుతారు. వారిలో సద్గుణాలను అలవరచుకోవాలనే ఉత్సాహాన్ని కలిగిస్తారు. ఆ విధంగా ప్రేరితులై సత్కర్మాచరణకు పూనుకొన్న జనులు కీర్తి ప్రతిష్ఠలను పొందుతారు. ప్రస్తుతత మంత్రాలలో వరుణ, మిత్ర, అర్యమ శబ్దాలకు ముందు 'సరాతి, సజోషమ్' అనే పదాలు విశేషణాలుగా చెప్పబడ్డాయి. అంటే 'దాత' 'ప్రేమి' అని అర్థం ఎవడుదానశీలుడో అతడందరినిప్రేమిస్తాడు. తనతోడివారు కూడా దాతలుగా ప్రేమశీలురుగా ఉండాలని అతడు కోరుకొంటాడు. దానివలన అతడు శత్రువునుసహితం మిత్రుడుగా చేసుకొంటాడు. ప్రేమభావనకు వశపడని ప్రాణి ఎక్కడుంటుంది? కాబట్టిడ మంత్రంలో చెప్పబడిన అర్యమ (ధర్మం -న్యాయం, మిత్ర (స్నేహశీలత), వరుణ (ఇతరులను తనవారిగ చేసికొనే సౌజన్యం) దివ్య గుణాలను మానవులు ప్రయత్నపరులై అలవరచుకొని జీవన సాఫల్యాన్ని పొందెదరుగాక!

**సంఘటనా యజ్ఞానికి ఆయుధం పట్టుకో**

**మంద్రా కృణుధ్వం ధియ ఆ తనుధ్వం నావమరిత్రపరణీం కృణుధ్వమ్।**

**ఇష్కృణుధ్వమాయుధారం కృణుధ్వం ప్రాంచం యజ్ఞం ప్ర ణయతా సఖాయః॥**

భావం:- మానవ సమాజాన్ని ఐకమత్యంగా ఉంచే యజ్ఞాన్ని చేయి. ఆ కృషిలో నీవు మృదువైన అనగా ఇతరులకు బాధ కలిగించని పనులనే చేపట్టుము. నీ బుద్ధిని అన్ని కోణాలలో విస్తరింపచేసి నిపుణంగా పనులను చేయుము. పడవను తెడ్డలతో నిపుణంగా నడిపినట్లుగా మానవ సమాజమనే పడవను సురక్షితంగా నడుపు. అవసరమయితే ఆయుధాలను సిద్ధంగా ఉంచు. ఆ ఆయుధాలను స్వయంగా నిర్మాణం చేయి. నీతో సమానమైన ఆలోచనా ధార గలిగిన మిత్రుల సహకారంతో మహోన్నతంగా ఐక్య సంఘటనా యజ్ఞాన్ని నిర్వహించు.

వివరణ:- విభిన్న మనస్తత్వాలుగల సమాజంలోని మానవులందరిని ఐకమత్యంగా ఉంచడం సామాన్య విషయం కాదు. అసామాన్యమైన ఆ ఐక్య సంఘటనను వేదం ఒక వైదిక యజ్ఞంగా అభివర్ణిస్తూంది. కాని ఒక వైదిక యజ్ఞంలో వినియోగించే సామగ్రికంటే ఈ మానవైక్య సంఘటనా యజ్ఞానికి ఉపయోగించే సామగ్రి చాల భిన్నంగా ఉంటుంది. విభిన్నమైన మరియు ఆరువిధాలైన ఆ ప్రధాన యజ్ఞసామగ్రిని ఈ విధంగా వేదమద్భుతంగా ఇలా వివరిస్తూంది.

1. మంద్రాకృణుధ్వమ్:- మంద్ర= అల్పమైన స్థాయిగల కర్మను చేయుమని ఈ వాక్యానికి శాబ్దికార్థం. 'చేసే కర్మ అల్పస్థాయిలో చేయుమనికాదు, అంటే చేసే కర్మ తీవ్రస్థాయిగా చేయవలదని మాత్రమే దీని భావం. 'వేదం ఈ మాట ఎందుకు చెప్పిందంటే - సమాజంలో ఎంతమంది మనుష్యులుంటారో అన్నిరకాల మనస్తత్వాలుంటాయి. అట్టి వారినందరిని ఒక లక్ష్యాన్ని సాధించేందుకు సిద్ధంగా ఒక త్రాటిమీద నడిపించగలగడం సామాన్యమైన పని కాదు. అది కత్తిమీద సాము వంటిది. అట్టి పనిని అట్టి ఐక్యసంఘటనలో పాలుపంచుకొనేవారి మనస్సులకు నాయకుడు తాను చేసే ఏ పని కూడ గాయం తగిలేలా ఉండరాదు. అలా ఉంటే వారంతా నొచ్చుకొని ఐక్యసంఘటన కార్యంనుండి విముఖులైపోతారు.

*ఇంకావుంది...*

# గృధ్ర గోమాయు సంవాదము

116

మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

పూర్వం నైమిశారణ్య ప్రాంతంలో ఒక గృహస్థుడు ఉండేవాడు. అతనికి ఒక్కడే పుత్రుడు. దురదృష్టవశాత్తు ఆ బాలుడు చిన్న వయసులోనే మరణించాడు. అతని బంధువులంతా రోదిస్తూ ఆ శిశువు శవాన్ని తీసుకుని శ్మశానానికి వచ్చారు. వారు అక్కడ ఆ మృత పిల్లవాని చేష్టలు మాటలు గుర్తు తెచ్చుకొని మరల దుఃఖించసాగారు. వారికి ఆ మృతుని శరీరం అక్కడ వదలి వెళ్ళడానికి కాళ్ళు రాక అక్కడే ఉన్నారు.

ఆ సమయంలో వారి ఏడ్పులు విని ఒక గ్రద్ధ అక్కడికి వచ్చి వారితో ఇలా అంది - ''ఓ మానవులారా! ఆ మృతుని ఇక్కడ వదిలివెళ్ళండి. ఇలా మరణించిన వారిని చాలా మందిని ఇక్కడే వదిలివెళ్ళారు. ఈ లోకంలో చావుపుట్టుకలు ఒకదాని వెంట ఇంకొకటి జరుగుతాయి. తమ ఆయువు తీరగానే ప్రతీప్రాణి ఈ శరీరాన్ని విడిచి వెళ్ళవలసిందే. ఈ శ్మశానం నక్కలతో, రాబందులతో మానవ అస్థికలతో నిండి ఉంది. ఇక్కడ ఎంతసేపు నిలిచినా ఏమీ ప్రయోజనం లేదు. మనకు ప్రియమైనవాడైనా శత్రువైనా చివరకు ఇక్కడి రావలసిందే. చనిపోయిన వాడు మరల జీవించడు. కనుక బాలుని మీద మమకారం విడిచి పెట్టి వెనక్కి తిరుగండి''. అప్పుడు ఆ బంధువులు నిరాశతో అక్కడి నుండి బయలుదేరారు.

ఇంతలో ఒక నల్లని నక్క అక్కడికి వచ్చి వారందరినీ ఆపి ఇలా అంది - ''అయ్యో ఈ మనుష్యులు ఎంత కఠినులు. మూర్ఖులారా! ఇంకా ప్రొద్దు పోలేదు. పిల్లవాని మీద మమకారం వదలకండి. ఆ బాలుడు ఎప్పుడైనా బ్రతికి లేవవచ్చు. ఎందుకు నిర్దాక్షిణ్యంగా ఈ బాలుని ఒంటరిగా శ్మశానంలో వదిలిపెట్టి వెళ్ళిపోతారు. పశు పక్షులకు తమ పిల్లల మీద అంత ప్రేమ ఉంటుందే మరి మీకు ఆ మాత్రం ప్రేమలేదా? పిల్లలు మనలను పెద్దవారయి పోషించినా, పోషించకపోయినా ఎంతో ప్రేమగా వారిని పెంచుతాము. ఇంకొంచెం సేపు వేచి చూడండి. ఏ అద్భుతమైనా జరిగి బాలుడు బ్రతుకవచ్చు. ఈ బాలుడు ఎంతో చక్కగా ఉన్నాడు. ఇలాంటి బాలుని ఎలా వదిలి వెళ్ళగలుగుతున్నారు''?

నక్క మాటలు విని బంధువులు తిరిగి మృతబాలుని దగ్గరకు వచ్చారు. అప్పుడు వారితో గ్రద్ధ ఇలా అంది- ''మళ్ళీ వెనక్కు వచ్చారా! అతను పంచేంద్రియశూన్యుడు. కట్టెలాగ బిగుసుకు పోయాడు. ఈ కట్టెకోసం దుఃఖిస్తారెందుకు? శరీరం పోతే అదృష్టం దురదృష్టం కూడా పోతాయి. అందుకే ఇతను మీకు దుఃఖాన్ని మాత్రమే మిగిల్చాడు. కనుక శోకాన్ని దైన్యాన్ని వదలండి. పుత్రుని మీద మమకారాన్ని విడిచిపెట్టండి. ప్రాణి తాను చేసిన మంచి, చెడ్డ పనుల ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. ధనవంతుడైనా దరిద్రుడైనా, పండితుడైనా, మూఢుడైనా అందరూ ఏదో ఒక రోజు ఈ శరీరాన్ని వీడి పోవలసిందే. పోయిన వారు మరల బ్రతుకరు. కనుక వారి కోసం శోకించడం ఎందుకు? అందరినీ ఏదో ఒక సమయంలో మృత్యువు తన ఒడిలోకి తీసుకుంటుంది.''

అప్పుడు నక్క ఇలా అంది- '' ఈ గ్రద్ధది అల్పబుద్ధి అందుకే పిల్లవాడి మీద మీకు ప్రేమ లేకుండా చేస్తున్నది. దీని మాటలతో ప్రభావితులై మీరు బాలుని వదిలి వెళుతున్నారు కదా। దూడలకోసం ఆవులకుండే దుఃఖం కూడా మీకు లేదే. మిమ్మల్ని చూస్తూ ఉంటే నాకు దుఃఖం



పొర్లుకు వస్తోంది. ఇష్టసిద్ధికై నిరంతరం ప్రయత్నం చేయవలసిందే. అప్పుడు దైవానుగ్రహం వలన అది ఫలిస్తుంది. దైవానుగ్రహం మానవ ప్రయత్నం వల్లనే సిద్ధిస్తుంది. ఈ బాలుడు మీ శరీరంలోంచి వచ్చిన వాడు మీ వంశానికి కర్త. అటువంటి వానిని ఇలా ఒంటరిగా ఎలా వదిలి వెళ్తారు? సూర్యుడు అస్తమించి సంధ్యాసమయం వచ్చే వరకు ఇక్కడ ఉండండి. ఆ తర్వాత ఏం చేయ్యాలో ఆలోచించండి.''

అప్పుడు గ్రద్ధ ఇలా అంది - ''నేను పుట్టి ఇప్పటికి వేయి సంవత్సరాలైంది. ఇంతకాలంలో చచ్చిన స్త్రీకాని, పురుషుడు కాని మళ్ళీ బ్రతకటం నేను చూడలేదు. కొందరు పురిట్లోనే చచ్చిపోతారు. కొందరు బాల్యంలో పోతారు. ఇంకొందరు యౌవనంలో పోతారు. ఈ స్థావర జంగమ ప్రకృతిలో ముఖ్యమైనది అయువే. ఎంతోమంది శోకిస్తూ ఇక్కడికి వచ్చి పోతూ ఉంటారు. ఈ బాలుడు ఇప్పుడు తేజోహీనుడు. కట్టెలా అయిపోయాడు. మీరెంత ఏడ్చినా అతను లేచి వస్తాడా? ఈ శవం మిమ్మల్ని కళ్ళు విప్పి చూడదు. నోరువిప్పి మాట్లాడదు. మరెందుకు ఈ ప్రయాస? నా మాటలు కఠినంగా మీకు అన్పించవచ్చు. కాని అవి సత్యాలు''. గ్రద్ధ మాటవిని బంధువులు ఇంటివైపు మరలారు.

అప్పుడు శీఘ్రంగా నక్కవారి వద్దకు వెళ్ళి ఇలా అంది. ''పితరులకు పిండ ప్రదానం చేయవలసిన ఈ కుమారునికి వదిలి ఎలా వెళ్ళగలుగుతున్నారు? ఎవరైనా మహాత్ముడు మీ భాగ్యం వలన ఇక్కడికి వచ్చి ఈ బాలుని బ్రతికించ వచ్చు. ఏ దేవత అయినా మీ మీద కరుణ చూపించవచ్చు.'' నక్కమాటలు విని రోదిస్తున్న బంధువులు మరల బాలుని దగ్గరకు వచ్చి నిలబడ్డారు.

వారిని చూసి గ్రద్ధ ఇలా అంది. ''దైవ ఆజ్ఞ చేత అతను దీర్ఘ నిద్ర పోయాడు. ఇక లేవడు. మహాధనవంతులు, మేధావులు కూడా యమపురికి వెళ్తారు. బంధువులు పోయిన వారిని ఇక్కడ వదిలి ఏడుస్తూ వెనక్కి వెళ్ళిపోతారు. ఇది జీవన ధర్మం. ఇతడు ఇక జీవిస్తాడు అన్న నమ్మకం ఏమీ లేదు. వేలకొలది నక్కలు తమ శరీరాలను వదిలినా ఈ బాలుని జీవింపచేయలేవు. ఈశ్వరుడు, బ్రహ్మ, విష్ణువు - వీరిలో ఏవ్వరైనా వరమిస్తే ఇతను జీవిస్తాడు. లేకపోతే జీవించడు. కంటితో చూడలేని వాడు ఎట్టి చలనం లేని వాడు అయిన ఇతడు మరణించి ఉన్నాడు.


*-ఇంకావుంది*

# యోధుడు ఎలా ఉండాలంటే...

**ప్రశ్న. ఏకలవ్యుని కులం మరియు కుటుంబం యొక్క నేపథ్యం కాకుండా ఇతర బలమైన కారణాలు ఏమైనా ద్రోణాచార్యులకు ఉన్నాయా?**

ప్రొఫెసర్ డి.నికొలస్ మాటల్లో ''యోధుడు యుద్ధం చేయటానికే కాక తన ప్రాణాలను సైతం ధారపోయడానికి సిద్ధంగా ఉండాలి.'' ఒక యోధునికి ప్రతిదీ ప్రాణానికి అపాయం కలిగించేదే. ప్రతి తలుపు, ప్రతి పొద, ప్రతి కొమ్మ వెనుక ప్రమాదం పొంచి ఉంటుంది. కానీ ఆ ప్రమాదంలో చిక్కుకోవడానికి యోధుడు సిద్ధంగా ఉండాలి''. వర్తమాన కాలంలో సైన్యంలో చేరదలుచుకున్న వ్యక్తి ఎటువంటి ప్రమాదకరమైనా పరిస్థితిని ఎదుర్కోడానికి సిద్ధమేనని పత్రంపై సంతకం చేయవలసి ఉంటుంది.

హిందూమత ఔన్నత్యం



డా॥ గరికపాటి ఆనంద్
9966059562

10

ఏకలవ్యుడి సామర్థ్యాలపట్ల గట్టి నమ్మకం ఉన్నా, అతని వల్ల తనకి, తన పరివారానికి, తన చుట్టూ ఉన్నవారికి అపారమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని తెలిసి కూడా, అతని కోర్కెను మన్నించడం ద్రోణాచార్యులకు సరియైన మార్గమా? ఇటువంటి కారణాల వల్లే కర్ణునికి అస్త్రవిద్య నేర్పడానికి ద్రోణాచార్యులు నిరాకరించాడు. ఏకలవ్యుని బొటనవ్రేలిని గురుదక్షిణగా అడగడం అమానుషం. విలువిద్యలో అర్జునుడు తన ఆధిపత్యాన్ని నిలుపుకోవాలన్న ఉద్దేశ్యమే ఈ కోరిక వెనుక దాగి ఉన్న కారణమని కొందరు వాదిస్తారు. ఇది ఒక కారణమే కావచ్చు కానీ మరికొన్ని ఆధారాలు పరిశీలిస్తే ఆ వ్యక్తి తన కుమారుడైనా గాని అతని వ్యక్తిగత శ్రేయస్సు కంటే ద్రోణాచార్యునికి సామాజిక శ్రేయస్సే ముఖ్యమని సూచిస్తోంది.

ద్రోణాచార్యులు మహాశక్తివంతమైన, సర్వనాశనకారి అయిన బ్రహ్మాస్త్రాన్ని బ్రాహ్మణుడు అయిన తనకొడుకు అశ్వత్థామకి కాకుండా క్షత్రియుడైన అర్జునునికి యిచ్చాడు. ఎందుకంటే అంత శక్తివంతమైన అస్త్రం తగిన సమయాల్లోనే ఉపయోగించాలన్న వివేకం మరియు నిగ్రహం గలవాడు కనుక అర్జునునికి ప్రాముఖ్యత యిచ్చాడు. ద్రోణాచార్యుడు తన కుమారునికి అస్త్రప్రయోగం మాత్రమే నేర్పించాడు కానీ దాని ఉపసంహారం నేర్పించలేదు. కానీ తన పక్షం వారిని రక్షించుకోవడానికి సర్వనాశనకారి అయిన అస్త్రాన్ని ఎలా ఉపసంహరించడమని తెలియకపోతే అది వ్యర్థమే అవుతుంది. ఆ విధముగా తన స్వప్రయోజనాల కంటే మానవ కళ్యాణమే ముఖ్యమనే భావనని ప్రదర్శించాడు. యుద్ధం ప్రారంభం కాక ముందు ప్రాణనష్టం జరుగుతుందని యుద్ధం చేయడానికి నిరాకరించినప్పుడు అర్జునుని క్షమత పట్ల ఉన్న అతని విశ్వాసాన్ని నిర్ధారణ చేసింది.

ద్రోణాచార్యుని వివేచనాశక్తి మరియు ఉద్దేశాలను శంకించి ప్రశ్నించేవారు, అస్త్రాలు మరియు వాటి వల్ల కలిగే అపాయం గురించిన జ్ఞానంలో అతనితో సమానంగా లేక అతని కంటే అధికులని నిరూపించుకోవాలి. ఎందుకంటే అర్జుననిపై సరియైన గుణశీలాల నిర్ణయం చేసిన అతని మేధస్సు, మానవజాతి కళ్యాణానికే అది ఉపయోగపడాలన్న అతని సంకల్పం మరియు వ్యక్తిగత ప్రయోజనాల కంటే మానవకళ్యాణం ముఖ్యమని భావించే త్యాగగుణం కలిగియుండాలి.

తన శిష్యులు గొప్ప యోధులు అయ్యేలా శిక్షణ ఇచ్చే గురువు లేదా ఆచార్యుడు ద్రోణాచార్యులు.

అతను కవిత్వం లేదా తత్వశాస్త్రం యొక్క బోధకుడు కాదు. అతను ఒక సైనిక క్రమశిక్షణతో కూడిన సైనికుడు. సైనిక సంకేత భాష మరియు కఠినత్వానికి గల కారణాలను అర్థం చేసుకోవడం, సైన్యానికి బయట ఉండే వ్యక్తులకు కష్టం. ఎందుకంటే వాటి గురించి సైన్యానికి, బయట ఉండే వ్యక్తులకు బహిరంగ పరచవలసిన అవసరం లేదు. క్రమశిక్షణారాహిత్యంతో వ్యవహరించే విధానాలు మరియు శిక్షలు పౌర విభాగం కన్నా సైనిక విభాగంలో చాలా వేరుగా ఉంటాయి. ఉదాహరణకు ఒక సంస్థలో ఒక ఉద్యోగి సమావేశానికి ఆలస్యంగా వెళితే, మె దటిసారి అతను లేదా ఆమె మీద ఎలాంటి చర్య తీసుకోరు. తక్కువ సమయంలో ఇలా పలుమార్లు జరిగినా, సంస్థ ఎలాంటి క్రమశిక్షణ చర్య తీసుకునే ముందు తాము ఏర్పాటు చేసుకున్న విధానాలు అంటే, నచ్చ చెప్పటం, తరువాత వ్రాతపూర్వక హెచ్చరికలు ఇవ్వడం పాటించాలి, ఇది కొంతమంది కలిపి ఆలస్యానికి గల కారణాలను ఉద్యోగి నుండి నేరుగా విని, తీసుకునే చర్య. ఇది జరగడానికి నెలల సమయం పడుతుంది.

సైన్యంలో ఒక శిక్షణార్థిఉదయం కవాతు కోసం 5 నిముషాల పాటు ఆలస్యమైతే, అతని యొక్క పై అధికారి అతనిని 8 లేదా 10 మైళ్ళు పరుగెత్తమని శిక్ష వేయవచ్చు. కఠిన శిక్షకు కారణాలు చాలా ఉన్నాయి. శిక్షణార్థి మళ్ళీ అదే తప్పు పునరావృతం చేయకూడదు. ఈ శిక్ష చూసిన ఇతర శిక్షణార్థులు ఆలస్యం చేసేసాహసం చేయరు. వారు అర్థం చేసుకోవలసింది, యుద్ధం మరింత కఠినమైన పరిస్థితులను తెస్తుంది. పైఅధికారి ఆ శిక్ష వేయడానికి ఎలాంటి సైనిక నియమాన్ని ఉల్లంఘించకపోతే, అతని చర్యలు సమర్థనీయం.

ఒకవేళ ద్రోణాచార్యుడు, నిస్సహాయంగా ఉన్న, హానిచేయని ఒక కుక్కను చంపడం అనేది ఆ కాలంలోని సైనిక నియమం లేదా ధర్మానికి వ్యతిరేకం అని నిశ్చయిస్తే, వారికి కఠినమైన శిక్ష వేగంగా అమలు చేయడం అవసరం అనుకుందాం. అతను ఆ శిక్ష వేయకపోతే, అతను చూసిన వాటి కన్నా దారుణంగా, తనను తాను ఆ చర్యలకు బాధ్యునిగా కనుగొంటాడు, కేవలం చర్చ కోసం, ఆ కుక్క యజమాని ఉన్నారని, సమీపంలో నిలబడి ఉంటే దాని పర్యవసానం ఊహించండి, ద్రోణాచార్యులు అర్జునుడిని అత్యుత్తమ యోధునిగా చేస్తాననే మాట ఇవ్వడం వల్ల ఇలా చేస్తున్నాడనే ఒక పోటీ వాదనను ఇప్పుడు మనం పరిగణనలోకి తీసుకుందాం. పైన పేర్కొన్న వాదన చాలా బలహీనంగా ఉంది. ఎందుకంటే ఈ భావన ప్రకారం ద్రోణాచార్యుడు విశ్వాసం, ఏకలవ్యుని అంత సామర్థ్యం ఉన్న యోధులు ఎవరూ లేరు అని. అందువల్ల, ద్రోణాచార్యులు అతడిని శక్తి హీనుడిని చేస్తే, అర్జునుడికి తను ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చగలడు అని వారి వాదన. ద్రోణాచార్యుడు ఆ సమయంలో తెలియని శత్రువు వైపు నిలబడిన యోధుల సామర్థ్యాలను తక్కువగా అంచనా వేసేటంత తెలివితక్కువవాడు కాడు. వేలాదిమంది కర్ణులు వచ్చినా కూడా పాండవులను గెలవలేరని శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికి చెప్పాడనేది గమనించదగిన ముఖ్య విషయం. ఏకలవ్యుడు ఏ విధంగానూ కర్ణునికి సరితూగడు.

ఈ పరిస్థితికి ఒక దృక్కోణం ఉంది. ద్రోణాచార్యుడు, భీష్ముడు లేక కృపాచార్యుడు దుర్యోధనుని ఆజ్ఞలను పాటించడానికి బద్ధులై ఉన్నారు కానీ వారి సలహాలు పాటించాల్సిన అవసరం అతనికి లేదు. ద్రోణాచార్యుడు కేవలం అధికారుల సూచనలను అనుసరిస్తున్నాడని మనము నమ్మినట్లైతే, అప్పుడు పై అధికారి అయిన దుర్యోధనుడు ఏదైనా మతపరమైన నియమాలు అనుసరిస్తున్నాడా లేక కేవలం తన స్వప్రయోజనాలేనా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. రాజరికం, ఏకపక్ష పాలన, బహుపక్ష పాలన లేక నియంతృత్వం గాని పాలకుని ప్రదమ లేక మె ట్టమె దటి ఆసక్తి వారికి అనుకూలమైన శాసనాలు స్వీకరించడంలో లేక వారికి అనుకూలమయ్యేటట్లు శాసనాలు చేయడంలో ఉంటుంది. అవసరమైతే మతపరమైన నియమాలని ఉల్లంఘిస్తారు. పాలకులు తమ స్వప్రయోజనాల అంశాన్ని నిర్లక్ష్యం చేయలేరు.

*ఇంకావుంది...*

# సుందరకాండ

దేవతలచేత ప్రశంసింపబడిన స్వామి తాను తన ప్రభువును ప్రశంసిస్తున్నాడు. అందుకే-

***ఏవం సీతాం తదా దృష్ట్వా హృష్టః పవన సంభవః***
***జగామ మనసా రామం ప్రశశంస చ తం ప్రభుమ్***

పవన సంభవుడైన స్వామి సీతాదర్శనాన్ని చేసికొన్నాడు. ఆనందాన్ని పొందేడు. ఉపాసకునకు ఉపాస్య దేవతా దర్శనమైంది. వెంటనే మనో లక్షణంతో రామచంద్రమూర్తి దగ్గరకు వెళ్ళేడు. ఇటువంటి భార్యను పొందినందుకు ఆయనను ప్రశంసించేడు.

నిజానికి ఇక్కడితో సుందరకాండ పూర్తిఅయింది. అంటే మానసిక ఉపాసన పూర్తిఅయింది.

లలితా స్వరూపంగా సీతా సాక్షాత్కారమైంది. ఇక్కడికి దర్శనాన్ని కలిగించడం ఆ ఆనందాన్ని స్వామి అనుభవించటం ఈ రెండు విషయాల్ని వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణము సుందరకాండలోని 15, 16 సర్గలలో నిక్షిప్తం చేసేరు. ఈ 15,16 సంఖ్యల శ్రీ విద్యావిషయంలో ఆ తల్లిని గురించి చెప్పే పంచదశి, షోడశి విద్యలకు ప్రతీకలు. ఆ విద్యాదర్శనం లలితా దర్శనమే.

ఈ సర్గలలో సీతాదర్శనము- లలితాదర్శనమే. అందుకనే సుందరకాండనంతను పారాయణ చేసే అవకాశం లేనివారు 15వ సర్గ చివర వరకు చేసినా సుందరకాండ పారాయణ చేసిన ఫలితం దక్కుతుంది. 15, 16 సర్గలను పారాయణ చేసినా ఆ తల్లి అనుగ్రహం కలుగుతుంది. పారాయణను చేసేటప్పుడీ భావన మాత్రముండాలి. అటువంటి సీతను చూసిన స్వామికి-

***సముహూర్తమివ ధ్యాత్వా బాష్పపర్యాకు లేక్షణః***
***సీతామాశ్రిత్య తేజస్వీ హనుమా న్విలలాపహ.***

కంటనీరు పెట్టుకొని ఏడ్చేడట. మహర్షి ఏడ్చేడని అనలేదు. ఏడుస్తూన్నట్లున్నాడట. ఇది భగవద్దర్శనమైన తరువాత స్థితి. ఇది ఏడుపు కాదు. అవ్యక్తానందం. అందుకే కంటి వెంట బాష్పములు. ఇక్కడ భ్రాంతి లేదు. భ్రాంతిలో గంతులు. స్వస్థితిలో ఆనందం ఇప్పుడు స్వామి స్థితి ఇది.

***మాన్యా గురు వినీతస్య లక్ష్మణస్య గురుప్రియా***
***యది సీతా పి దుఃఖార్తా కాలో హిదురతిక్రమ్***

లక్ష్మణునకు గురువైన రామచంద్రమూర్తికి ప్రియురాలైన సీతాదేవియే దుఃఖం వలన ఆర్తురాలయితే కాలం దాట రానిది కదా! దానికి అందరూ లొంగవలసినదే కదా!

ఇక్కడ- వీనీతుడయిన అంటే సామీప్యమును పొంది ఉన్న శేష లక్షణం కల లక్ష్మణునకు గురువుఅయిన అంటే పరబ్రహ్మతత్త్వమయిన శ్రీరామునకు గురుప్రియా అత్యంతము ఇష్టురాలయిన పరాశక్తి రూపమైన సీత- అని భావము. అట్టి తల్లియే ''దుఃఖార్తాయది'' దుఃఖార్త అయితే- అంటే కాలేదనే భావం. ఇదీ బాధ- ఇదీ ఆనందం- రెంటియందు బాష్పములు. సరే-

ఆలోచిస్తున్నాడు. నిజాలు తెలుస్తున్నాయి.

ఈమెవలన కదా! మహావీరుడైన వాలి మరణించేడు

ఈమె వలన కదా! చతుర్దశ సాహస్రకమైన సైన్యంతో ఖరదూషణాదులు మరణించేరు. ఈమె నిమిత్తంగానే కదా! సుగ్రీవునకు వానర దుర్లభమైన ఐశ్వర్య ప్రాప్తి కలిగింది- అంతెందుకు-

***సాగరశ్చమయా క్రాంతః శ్రీమాన్ నదనదీపతిః***
***అస్యాహేతో ర్విశాలాక్ష్యాః పురీచేయం నిరీక్షితా.***

***విశాలాక్ష్యై నమః*** అని లలిత స్తుతి. అంటే-

తన కటాక్షమునకు పాత్రముకాదగినవాడు ఎక్కడ ఉన్నా తన దృష్టిని అంత వరకూ ప్రసరింపజేసి దృఙ్మాత్రము చేతనే వానిని రక్షించునది. కనుకనే- ఈమె అనుగ్రహం వలననే కదా! నదనదీపతి అయిన సాగరుణ్ణి నేను దాటేను. లేకుంటే యిది నా ప్రజ్ఞ! అనుకొన్నాడు. అందుకే అక్కడ సురసను చూసి ''దాక్షియణి నమో స్తుతే''అన్నాడు. అంటే- ఇంతమందీ ఆ తల్లిని ఉపాసించి నవాళ్ళే అన్నమాట.

*ఇంకావుంది...*

# పరమహంస బోధామృతము

206. వరి పొలముల నడుమ నుండు కాలువలలో చేపలను బట్టుటకు వెదురుమావులను బెట్టుదురు. వాని ద్వారములనుండి తళతళలాడుచు నీరు ప్రవహించుచుండుట జూచి చిఱుచేపలు అందు మహోల్లాసముతో బ్రవేశించును. కాని యందొకసారి ప్రవేశించిన వెనుక మఱల నవి తప్పించుకొని పోజాలవు. అటులనే అవివేకులగువారు మాయాసంసార సుఖములచే మోహితులై సంసారమున బ్రవేశింతురు. సంసార జాలమున సులభముగా బ్రవేశింపగలరు గాని వెలువడజాలరు, పాపము! వెదురు మానవులందు చేపలవలెనే వీరును అందు దగుల్కొని దరిగానక బద్ధులైయుందురు.

207. సంసారబద్ధుల కెన్నడును తెలివిరాదు. ఎన్ని దుఃఖములపాలైనను, ఎన్ని యాతనల బడినను, ఎన్నిసార్లు వంచింపబడినను వారు తెలివి తెచ్చుకొనరు. ఒంటెను జూచితిరా? దానికి ముండ్ల తుప్పలనిన ఇష్టము. వాని నది మేసిన కొలదియు ముట్టె నుండి నెత్తురు కాఱుచుండును. ఐననేమి? వానిని దినుట మానదే! సాంసారికుడు ఎన్నియో యిడుమల గుడుచును. ఎన్నియో పాట్లుపడును. ఐననేమి? కొలదినాళ్లకే అన్నిటిని మఱచును. బహుశః వాని భార్య చనిపోయి యుండవచ్చును. ఇంతలోనే మఱల పెండ్లియాడునుగదా! ఒకవేళ వాని బిడ్డ చనిపోయి యుండవచ్చును, అందులకాతడేడ్చును. కాని కొలదినాళ్లు ఐనంతనే ఆ విషయము నంతయు మఱచిపోవును. బిడ్డ చనిపోవుటచే ఘోర దుఃఖము ననుభవించిన స్త్రీ మఱల నూతన వస్త్రములను ఆభరణములను దాల్చి కులుకుచున్నది! కుమార్తెకు పెండ్లిచేసి తల్లిదండ్రులు దారిద్ర్య పీడితులగుచున్నారు. ఐననేమి? ఏటేటను బిడ్డలను గనుచునే యుందురు. ఇక వ్యాజ్యెములచే ధ్వంసమగుచున్నను వానిని నడిపించుచునేయుందురు. ఉన్న బిడ్డలకు అన్న వస్త్రములు లేకున్నను ఏటేట కానుపులు! ఒక్కొక్కప్పుడు వీని (సంసారబద్ధుని) గతి కొండెలు కను బట్టుకొనిన పాముగతిని బోలును. అది దానిని మ్రింగనుజాలదు, విడువను జాలదు. ఆతడు ఒక వేళ సంసారము అసారమనియు, అంబాళవు పండువలె సంసారమునంతయు తొక్కయు టెంకయునే కాక అనుభవింపదగిన గుంజు ఏమియులేదనియు గ్రహించిన గ్రహించుగాక, సంసరమోహమును త్యజించి భగవంతునిపైకి బుద్ధిమఱల్చునా? మఱల్పడే! సంసార తాపత్రయము నుండి తొలగించి వానికి సత్సాంగత్యము కలుగజేసితిమా, నిరుత్సాహియై, దిగులు చెంది, చిక్కిపోవనారంభించును. మాలిన్యమున బుట్టిపెరుగు పురుగును గైకొని బియ్యపు గూనలోనుంచిన యెడల అది యచట బ్రదుకలేక చచ్చునుగదా!

208. ఒకసారి పెరుగు తోడుపెట్టిన కుండలో పాలుపోసి యుంచుటకెవ్వరును సాహసింపరు, పాలు విఱిగిపోవునేమోయను భయము వారిని బాధించును. ఆ కుండను వంట చేయుటకును వినియోగింపరు, నిప్పు మీద బెట్టిన విచ్చిపోవునేమో యని జడియుదురు. కాబట్టి అది యించుమించుగా నిరుపయోగమన్నమాట! అట్లే అనుభవశాలియగు సద్గురువెప్పుడును సాంసారికునకు అమూల్యమగు సద్బోధలను జేయవెఱచును. ఏలన వానికి అపార్థములను గల్పించి నీచమగు స్వకార్యములను సమర్థించుకొనజూచుట నిశ్చయము. కొంచెము శ్రమపడవలసిన సత్కార్యములందు గురువాతని నియోగింపజాలడు. ఏలన తన మంచితనమునుబట్టి గురువు తనవలన ఏదియో లాభము పొందజూచుచున్నాడని యాతడు తలచినను తలపవచ్చును.

209. ప్రారబ్ధకర్మమును సంస్కారములును అడ్డుతగులు చుండుటచే నరుడు సంసారమును త్యజింపదలచినను త్యజింపజాలడు. ఒక రాజు నొకప్పుడొకయోగి తన కడ గూర్చుండి భగవద్ధ్యానము చేయుమనెను. అందులకు రాజిట్లనెను: ''అయ్యా! అది అసాధ్యము. నేను మీ సన్నిధి నుండవచ్చును, కాని నా భోగకాంక్ష యెచ్చటికి బోవును నాయెద్దనే యుండునుగదా! నేనీ అడవిలో నుండిన యెడల బహుశః ఇక్కడనే ఒక రాజ్యమేర్పడవచ్చును. నేను నా భోగమునను భవింపక తీరదుగదా!''

*ఇంకావుంది...*

ఆంధ్రభూమి
చిత్రభూమి
జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!
సోమవారం 4, ఫిబ్రవరి 2019


## 14న వస్తుంది వింక్ గాళ్



వింక్ గాళ్ ప్రియాప్రకాశ్ వారియర్, రోషన్ నటించిన 'లవర్స్ డే' చిత్రం ప్రేమికుల దినోత్సవం 14న రిలీజ్‌కు సిద్ధమైంది. తెలుగు, మలయాళంతోపాటు కన్నడ, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్నది. క్రేజీ డైరెక్టర్ ఒమర్ లులు దర్శకత్వం వహించిన చిత్రాన్ని తెలుగులో నిర్మాతలు ఎ గురు రాజ్, సిహెచ్ వినోద్‌రెడ్డి సుఖీభవ సినిమాస్ బ్యానర్‌పై అందిస్తున్నారు. నిర్మాతలు గురురాజ్, వినోద్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న చిత్రానికి బన్నీ అందిస్తున్న సహకారాన్ని మర్చిపోలేం. సినిమాను తెలుగు ప్రేక్షకులకి దగ్గరగా చేసేందుకు, ప్రేక్షకులకు సంపూర్ణమైన వినోదాన్ని అందించేందుకు ప్రీప్రొడక్షన్ పనులను క్వాలిటీతో రూపొందించాం. ప్రియవారియర్‌కు తెలుగులో ఉమ (ప్రముఖ దర్శకుడు రేలంగి నర్సింహారావు తమ్ముడి కూతురు), మరో ప్రధాన పాత్రను పోషించిన నూరిన్‌కు సింగర్ లిప్సిక డబ్బింగ్ చెప్పారు. లవర్స్‌డే చిత్రంలో మొత్తం ఎనిమిది పాటలున్నాయి. గీత రచయితలు చంద్రబోస్, చైతన్యప్రసాద్, శివగణేష్, శ్రీజో, శ్రీసాయికిరణ్ సాహిత్యాన్ని అందించారు. ఇందులో ఓ పాట థియేటర్లలో ప్రేక్షకులకు సర్‌ప్రైజ్‌గా ఉంటుంది' అని తెలిపారు.



## ఎవ్వరేమన్నా.. నేనే డైరెక్టర్

మణికర్ణికకు నేనే దర్శకురాలిని అంటూ కుండబద్దలు కొట్టింది కంగనా రనౌత్. మణికర్ణిక చిత్రం విడుదలై హిట్టు టాక్ సాధించటంతో -అంతకుముందున్న వివాదం మళ్లీ రాజుకోవడం తెలిసిందే. దర్శకత్వ విభాగంలో 70శాతం క్రెడిట్‌ను కంగన తీసుకోవడంపై క్రిష్ అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. సినిమా ఎడిటింగ్ సమయంలోనూ ఆమె మూర్ఖంగా ప్రవర్తించారంటూ తీవ్రమైన కామెంట్లే చేశాడు. అయితే, క్రిష్ తమ చిత్రానికి నష్టం కలిగించే ఉద్దేశంతోనే అలా ఆరోపణలు చేస్తున్నాడంటూ చిత్ర నిర్మాత కమల్ జైన్ వివరణ ఇచ్చాడు. ఈ వివాదంపై తాజాగా కంగన సైతం స్పందించింది. 'మణికర్ణికకు నేనే దర్శకురాలిని. ఈ విషయంలో ఎలాంటి మార్పు లేదు. క్రిష్ నన్ను అటాక్ చేయడం సరికాదు. ఒకవేళ ఆయన చెప్పిందే నిజమైతే నిరూపించుకోవచ్చు. మీడియాకు ఎక్కడం వల్ల ఎలాంటి లాభాలూ ఉండవు' అని వ్యాఖ్యానించింది. 'నా పాత్రను తీసేశారని ఒకరు, కట్ చేశారని ఇంకొకరు ఆరోపణలు చేస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే. నటిగా, ఫిల్మ్‌మేకర్‌గా మూడు జాతీయ అవార్డులను నా కష్టంతో సాధించుకున్నా. మీరూ ఆ స్థాయికి రండి. అంతేగానీ, వేరొకర్ని చూసి ఏడిస్తే ఏం లాభం' అని ప్రశ్నించింది.

## కోర్టుకైనా వెళ్తాం

### దండుపాళ్యం నిర్మాత వెంకట్

బెనర్జి, వెంకట్, ముమైత్‌ఖాన్, సంజీవ్‌కుమార్, రంగనాథన్ కీలక పాత్రధారులుగా కె.టి.నాయక్ దర్శకత్వంలో 'దండుపాళ్యం 4' చిత్రం అదే టైటిల్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రీకరణ పూర్తిచేసుకుని ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాల్లో వున్న ఈ సినిమా మార్చిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత వెంకట్ తెలిపారు. ఈ చిత్రానికి దండుపాళ్యం ట్రయాలజీకి ఎలాంటి సంబంధం లేదు. ఈ సందర్భంగా శనివారం హదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో నిర్మాత వెంకట్ మాట్లాడుతూ- ఇటీవల సినిమాను సెన్సార్‌కు అప్లై చేశాము. కంటెంట్ పరంగా సినిమాలో ఏదన్నా సమస్య వుంటే ఆ సన్నివేశాన్ని, డైలాగ్‌ని తొలగించడం జరుగుతుంది. సినిమా చూసిన సెన్సార్ బోర్డు సినిమాలోని కొన్ని సీన్లు తొలగించాలని లేదంటే రిజెక్ట్ చేస్తామని చెప్పారు. సినిమాలో సమస్య ఏంటో చెప్పకుండా రిజెక్ట్ చేస్తాననడం



మొదటిసారి చూశా. వాళ్లు రివైజ్ కమిటీకి వెళ్లమన్నారు. కోర్టుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నా. ఎట్టి పరిస్థితుల్లో సినిమాను మార్చిలో విడుదల చేస్తామని ఆయన తెలిపారు.



## గోవాకు వెళ్తున్న బ్యూటీలు

బ్లాక్ అండ్ వైట్ పిక్చర్స్ పతాకంపై బాలు దర్శకత్వంలో వెలగపూడి హిమబిందు తొలి చిత్రాన్ని నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. త్రిథా చౌదరి, ధన్య బాలకృష్ణ, సిద్దీ ఇద్నానీ, కోమలి ప్రసాద్ ప్రధాన తారాగణంగా వస్తున్న సినిమా తొలి షెడ్యూల్ ఇటీవల పూర్తైంది. ఫిబ్రవరి రెండోవారంలో కీకల సన్నివేశాలు, పాటలు, పోరాట దృశ్యాల చిత్రీకరణకు చిత్రబృందం గోవా వెళ్లనుంది. ఈ సందర్భంగా దర్శకుడు బాలు మాట్లాడుతూ 'మహానగరంలో నివశించే నలుగురు అమ్మాయిల కథే ఈ సినామ. స్వతంత్ర భావాలున్న నలుగురి జీవితాల్లో ఏం జరిగిందనేది ఆసక్తికరం. జనవరిలో హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్ పూర్తి చేశాం. గోవాలో మొదలుకానున్న సెకెండ్ షెడ్యూల్‌లో రెండు పాటలు, కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నాం. నెలాఖరుకు గోవా షెడ్యూల్ పూర్తవుతుంది. మార్చిలో హైదరాబాద్‌లో మూడో షెడ్యూల్ ప్లాన్ చేశాం. మేలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం. వినోదాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రంలో కథానుగుణంగా వచ్చే మలుపులు ప్రేక్షకులను ఆకుట్టుకుంటాయి' అన్నారు.

## ఆ మాటంటే ఊరుకోను

ఈ మాటన్నది ఎవరో కాదు విద్యాబాలన్. పద్నాలుగేళ్ల సినీ కెరీర్‌లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించింది విద్యాబాలన్. మహిళా ప్రాధాన్యత పాత్రలైనా, బరువైన పాత్రలకైనా మొదటిగా గుర్తుకొచ్చేది విద్యాబాలనే. శరీరాకృతితో సంబంధం లేకుండా ఆమెకు ఎన్నో అవకాశాలు వస్తున్నాయి. అయితే, ఆ విషయం మీదే ఈమధ్య ఓ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావన తెచ్చింది. 'హార్మోన్ సమస్య కారణంగా బరువు పెరుగుతున్నా. శరీరం తగ్గడానికి చేయని ప్రయత్నం లేదు. అది తెలుసుకోకుండా నేను వ్యాయామం చేయనని కొందరు ఎగతాళి చేస్తుంటారు. అలాంటి కామెంట్లను సహించను. బరువు తగ్గడానికి నేను కష్టపడుతున్నానో లేదో మీకు తెలుసా? మీరు చూశారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. చాలాకాలంగా తన ఫొటోలు చూసుకోవడమే మానేశానని, అవి చూసుకున్నపుడు ఇంకా బరువు పెరుగుతున్నానన్న బాధ తనను వెంటాడుతుందని అంటుంది. అందుకే బరువు తగ్గడం కంటే ఆరోగ్యాన్ని పరిరక్షించుకునే మార్గాలపైనే దృష్టి పెట్టానంటోంది విద్యాబాలన్. గణిత శాస్త్ర నిపుణురాలు శకుంతల బయోపిక్‌లో విద్య నటించనుంది.



## ఒక్కటే లైఫ్..



సూపర్‌గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్‌రామ్ నిర్మిస్తోన్న చిత్రం 'ఒక్కటే లైఫ్'. హ్యాండిల్ విత్ కేర్ అనేది ఉపశీర్షిక. ఎం.వెంకట్ దర్శకుడు. శృతి యుగల్ హీరోయిన్. చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుంది. ఫిబ్రవరిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు నిర్మాతలు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ టెక్నాలజీ పేరుతో పరుగులెడుతోన్న నేటితరం హ్యూమన్ రిలేషన్స్, ఎమోషన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రమిది. సూపర్‌గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి అబ్బాయి జితన్‌రమేష్ హీరోగా నటిస్తున్నారు. అమ్రీష్ అందించిన పాటలకు ఆదరణ బాగుంది. అన్నివర్గాల ప్రేక్షకులను ఈ సినిమా అలరిస్తుంది అన్నారు. నిర్మాత నారాయణ్‌రామ్ మాట్లాడుతూ దర్శకుడు సినిమాను తెరకెక్కించిన విధానం హైలెట్‌గా నిలుస్తుంది. హరీష్‌రావు మా ట్రైలర్‌ను విడుదలచేయడం ఆనందంగా ఉంది. ట్రైలర్‌లు, పాటలు చాలాబాగా వచ్చాయి. 'ఒకటే లైఫ్' సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాము' అన్నారు.



## 8న నేనే ముఖ్యమంత్రి

వైష్ణవి ఫిలింస్, ఆలూరి క్రియేషన్స్ పతాకాలపై అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. దేవిప్రసాద్, వాయుతనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రల్లో మోహన్ రావిపాటి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఈనెల 8న గ్రాండ్‌గా విడుదలవుతోంది. ఈ సందర్భంగా వైష్ణవి ఫిలింస్ అధినేత అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ- ఈ చిత్రం ద్వారా సమకాలీన రాజకీయ అంశాల గురించి చర్చించాం. అన్నివర్గాలకు నచ్చే అంశాలతోపాటు అందర్నీ ఆలోచింపజేసేలా సన్నివేశాలు, సంభాషణలు ఉంటాయి. సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యత ఉంది. ప్రేక్షకులకు కూడా నచ్చుతుందన్న నమ్మకంతో ఉన్నాం అన్నారు. నిర్మాత ఆలూరి సాంబశివరావు మాట్లాడుతూ నేటి సమాజం యొక్క రాజకీయ పరిస్థితులకు అద్దంపడుతూ ఈ చిత్రాన్ని నిర్మించాము. మా దర్శకుడు పర్‌ఫెక్ట్ ప్లానింగ్‌తో ఎక్కడా ఇబ్బంది లేకుండా సినిమాని పూర్తిచేశారు. ఇప్పటికే విడుదలైన పాటలకు, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈనెల 8న సినిమాను రిలీజ్ చేస్తున్నామన్నారు.



## సుక్కూ టీంతో శౌర్య



దర్శకుడిగా భారీ చిత్రాలను తెరకెక్కిస్తున్న బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ తన నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో మరో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. డైరెక్షన్ టీంలో తనవద్ద పని చేస్తున్న యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తున్న సుక్కూ, ఇతర నిర్మాణ సంస్థలతో కలిసి సినిమాలు రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ శరత్ మరార్ కలయికలో ఓ చిత్రాన్ని ప్లాన్ చేశారట. ఈ సినిమాలో నాగశౌర్య హీరోగా నటించనున్నాడు. సుక్కూ వద్ద దర్శకత్వ శాఖలో పని చేసిన కాశీవిశాల్ ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నాడు. చిత్రానికి సంబంధించిన వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

## అదీ లెక్క...

ఎప్పుడు ఏ హీరోయిన్ స్టార్ ఎలా తిరుగుతుందో ఇండస్ట్రీలో ఎవ్వరూ చెప్పలేరు. ఆదినుంచి స్టార్ హీరోయిన్ రేంజ్‌నే కొనసాగిస్తున్నా -నిన్న మొన్నటి వరకూ పూజా హెగ్డెకు పెద్దగా డిమాండ్ లేదు. అరవింద సమేత చిత్రం హిట్టుపడటంతో పూజా డిమాండ్ అమాంతంగా పెరిగిందట. దాంతో పారితోషికంగా కూడా బాగానే డిమాండ్ చేస్తోందని అంటున్నారు. తెలుగులో ఒక్కసారిగా ఎన్టీఆర్, మహేశ్‌బాబు, ప్రభాస్‌తో సినిమాలు దక్కించుకున్న పూజ -వీర రాఘవ హిట్టుతో రేంజ్ పెంచేసింది. ప్రస్తుతం మహేశ్‌బాబుతో చేస్తోన్న 'మహర్షి' చిత్రానికి రెండు కోట్ల పారితోషికం డిమాండ్ చేసిందని అంటున్నారు. అటుతిప్పి ఇటుతిప్పి 1.75 కోట్ల పారితోషికం ఫిక్సయినట్టు ఇండస్ట్రీ టాక్. హిట్టు సినిమాతో డిమాండ్ పెరిగిన కారణంగానే పారితోషికం పెంచిందని కొందరంటుంటే, మహర్షి చిత్రం కోసం ఎక్కువ డేట్లు కేటాయించాల్సి రావడంతో ఎక్కువ తీసుకుంటోందని ఇంకొందరంటున్నారు. ఏదేమైనా పూజ టైం నడుస్తోంది. ఆమె ఖాతాలో మహర్షి కూడా హిట్టుపడితే -పారితోషికం మరింత పెంచే అవకాశం లేకపోలేదనీ అంటున్నారు. ఆ తరువాత ఎలాగూ ప్రభాస్‌తో భారీ బడ్జెట్ చిత్రం ఉండనే ఉంది. ఇదీ పూజ లెక్క.

## ఈ యాత్ర నాకో స్పెషల్



దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవిత చరిత్రలో ఆయన చేపట్టిన పాదయాత్ర ఎంతో ప్రాముఖ్యతను సంపాదించుకుంది. ఆ పాదయాత్రలోని కీలక ఘట్టాలు ఆధారంగా రూపొందించిన సినిమా 'యాత్ర'. మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పాత్రలో నటించారు. 70 ఎం.ఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన 'యాత్ర' ఈనెల 8న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో సుధీర్‌బాబు మాట్లాడుతూ 'విజయ్, విష్ణు, శశి నా క్లోజ్ ఫ్రెండ్స్. వారు, నేను ఇండస్ట్రీలోకి వస్తామనుకోలేదు. ఇప్పుడు అందరం బయోపిక్స్ చేస్తున్నాం. నేను పుల్లెల గోపీచంద్ బయోపిక్ చేస్తున్నాను. విష్ణు యన్.టి.ఆర్. బయోపిక్ చేశాడు. ఇప్పుడు విజయ్, శశి వై.ఎస్.ఆర్‌గారి బయోపిక్ చేస్తున్నారు. ఈ సినిమా ఒక ఇన్‌స్పిరేషనల్ మూవీ. అందరికీ తప్పకుండా నచ్చుతుంది. వై.ఎస్.ఆర్. ఫ్యాన్స్‌కే కాదు.. ఇతర ప్రేక్షకులకూ నచ్చుతుంది. ఎంటైర్ యూనిట్‌కు అభినందనలు' అన్నారు.

నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ వారంరోజులుగా స్నేహితుడు శశి యు.ఎస్‌లో సినిమాను ప్రమోట్ చేస్తూ బిజీగా ఉన్నారు. శ్యామ్‌దత్‌వల్లే ఈ సినిమా చేస్తున్నాం. ఆయనే ఈ సినిమా కథను మమ్ముట్టి వద్దకు తీసుకెళ్లారు. మమ్ముట్టి మా కథను నమ్మడమేకాదు.. గొప్ప సహకారం అందించారు. అందుకు ఆయనకు థాంక్స్. మా సినిమాటోగ్రాఫర్ సత్య, మ్యూజిక్ డైరెక్టర్ కె, ఆర్ట్ డైరెక్టర్స్ రామకృష్ణన్, మోనిక, ఎడిటర్ శ్రీకర్‌ప్రసాద్ బ్యాక్‌బోన్‌లా నిలిచారు. సీతారామశాస్త్రి ఐదు పాటలను ఐదు సిచ్యువేషన్స్‌కు తగ్గట్టు రాశారు. పెంచలదాస్‌కు థాంక్స్. డైరెక్టర్ మహి మంచి మనసున్న వ్యక్తి. ప్రతి కుటుంబం సినిమాలో వై.ఎస్.ఆర్ ఆత్మ, స్ఫూర్తిని చూడొచ్చు అన్నారు.

మహి.వి.రాఘవ్ మాట్లాడుతూ మమ్ముట్టికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఆయనతో పనిచేసే అవకాశం ఇచ్చినందుకు థాంక్స్. కథ మాత్రమే నాది. అక్కడినుండి సినిమాగా రూపొందే క్రమంలో నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎందరో సహకారం అందించారు. అందరికీ థాంక్స్. నేను డైరెక్టర్‌గా మారడానికి కారణం విజయ్, శశి కారణం. యాత్ర హానెస్ట్‌గా ఉండే సినిమా అన్నారు. మమ్ముట్టి మాట్లాడుతూ నేను తెలుగు మాట్లాడలేను. కానీ అర్థం చేసుకుంటాను. కానీ సినిమాకోసం కష్టపడి నేర్చుకున్నా. తెలుగు భాష అంటే చాలా ఇష్టం. ఇలాంటి సినిమా చేసిన ప్రతి ఒక నటీనటులకు, సాంకేతిక నిపుణుడికి థాంక్స్. 21 ఏళ్ల తర్వాత తెలుగులో సినిమా చేయడానికి చాలా ఎగ్జయిట్ అయ్యాను. రాజశేఖర్‌రెడ్డి జీవితంలో చేసిన పాదయాత్ర అనే ఘటనకు సంబంధించిన కథ. ఆయన స్క్రిప్ట్‌తో కన్విన్స్ అయ్యాను. తెలుగులో నేను నటించిన మూడో స్ట్రయిట్ సినిమా ఇది అన్నారు.